వనితా
గత వారం నవలలు పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నల్లగొండ
: fb.com/vaartha Digital
Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam
11-3-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 38 పేజీలు: 8+16 వెల: 6.50

సిరియాలో ముదిరిన అంతర్యుద్ధం
లలిత్ మోడీకి వనౌతు పౌరసత్వం రద్దు
5



# సుభాష్‌కు ఉరి శిక్ష



## ప్రణయ్ హత్యకేసులో నల్లగొండ కోర్టు సంచలన తీర్పు

### ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు

### 2018లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పరువు హత్య కేసు

### వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్ర

**ప్రభాతవార్త ప్రతినిధి, నల్లగొండ:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పెరుమాళ్ళ ప్రణయ్ హత్యకేసులో నల్గొండ కోర్టు సోమవారం సంచలన తీర్పు వెలువరించింది. వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణానికి చెందిన వ్యాపారి తిరునగర్ మారుతీ రావు ఏకైక కుమార్తె అమృత పట్టణానికి చెందిన దళిత యువకుడు పెరుమాళ్ళ ప్రణయ్‌ని ప్రేమ వివాహం చేసుకుంది. ఇది ఇష్టం లేని అమృత తండ్రి మారుతీ రావు 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్ ని దారుణంగా హత్య చెయించాడు. అప్పట్లో ఈ పరువు హత్య ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. ఆరేళ్లకు పైగా ఎస్సి ఎస్టీ ప్రత్యేక కోర్టులో విచారణ కొనసాగగా, న్యాయమూర్తి రోజా రమణి సోమవారం సంచలన తీర్పు వెలువరించారు.

>>2

# ఢిల్లీలో దీక్ష చేస్తా



'రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం'

### అధిక నిధులు ఇచ్చినట్లు నిరూపిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా

### పదేళ్లలో ప్రాజెక్టులు కట్టిఉంటే ఎపితో సమస్య ఉండేది కాదు

### నిధులకోసం 36 కాదు.. 99 సార్లయినా ఢిల్లీ

### వెళ్తా: మీడియాతో సిఎం రేవంత్ చిట్ చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** అఖిలపక్ష సమావేశానికి పిలిస్తే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్‌లో ఉండి కూడా రాలేదని.. మాజీ సిఎం కేసీఆర్ బాధపడుతారని కేంద్రమంత్రి సహకరించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సిఎల్పీ కార్యాలయంలో సిఎం రేవంత్‌రెడ్డి సోమవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ... బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. మనోహర్ లాల్ కట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. ఆయన మీటింగ్‌కు కూడా కిషన్‌రెడ్డి ఎందుకు రాలేదన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు ఇచ్చామని మోడీ అన్నారని.. అదే ఇవ్వమని అంటున్నామన్నారు. జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోందని.. కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడుందని ప్రశ్నించారు. జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణకు అడ్డుకుంటుంది ఈటల రాజేందర్, లక్ష్మణ్‌లే కదా అనిఆరోపించారు. ప్రాజెక్టులు ముందుకు వెళ్ళకుండా అడ్డుకుంటుంది రాష్ట్ర బీజేపీ నేతలే అని మండిపడ్డారు. భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నప్పుడు కేంద్ర అధికారులుకానీ, మంత్రులుకానీ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించి చర్చించాలి కదా అని నిలదీశారు. కేంద్ర మంత్రులు హైదరాబాద్ వచ్చి సమీక్షలు పెడితే కూడా ఎందుకు కిషన్‌రెడ్డి హాజరు కావడంలేదని నిలదీశారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి నెక్లెస్ రోడ్డులో సన్మానం చేస్తా అని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని, కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నుంచి ఎన్ని పన్నులు కట్టామో లెక్కపై చర్చకు సిద్ధం, తాను, భట్టి వస్తాం అని కిషన్‌రెడ్డికి సవాల్ చేశారు. భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వ సమస్య అంటున్నాడు, డిప్యూటీ సిఎంభట్టి సమావేశం పెడితే కిషన్‌రెడ్డి రాలేదన్నారు. సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళనకు నిధులు ఇస్తున్న

>>2



## వారంలో మరో విడత

# రైతు భరోసా

### 4 ఎకరాల రైతులకు జమ చేసేందుకు ప్లాన్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలంగాణలో త్వరలో నాలుగో విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు సర్కార్ నిర్ణయించింది. ఇందుకు గాను నాలుగో విడతలో 4ఎకరాలున్న రైతులు 9.12లక్షల మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ భరోసా ఇవ్వడానికి వెయ్యికోట్ల రూపాయల మేర అవసరమవుతాయని లెక్క కట్టారు. ఈ పథకాన్ని ఇంతవరకూ పైలట్ ప్రొగ్రామ్‌తో సహా మూడు విడతలుగా రైతు

>>2

# రేపటి నుంచి అసెంబ్లీ

### నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సిఎస్, డిజిపితో స్పీకర్ సమీక్ష


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** బుధవారం (12వ తేదీ) నుండి ప్రారంభం కానున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు సర్వం సన్నద్ధమైంది. శాసనసభ, శాసనమండలి సమావేశాల నేపథ్యంలో నిర్వాహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులతో సోమవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన ఛాంబర్‌లో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్,అసెంబ్లీ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, లెజిస్లేటివ్ సెక్రటరీ డా.వి.నరసింహా చార్యులు,రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఫైనాన్స్) రామకృష్ణారావు, జిఏడి సెక్రటరీ రఘునందన్ రావు,హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా, రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్, ఏడిజి లా ఆర్డర్ మహేష్ భగవత్,డిజి ఫైర్ నాగి రెడ్డి, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు సివి ఆనంద్, సుధీర్ బాబు, అవినాష్ మహంతి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, అసెంబ్లీ ఛీఫ్ మార్షల్ కర్ణాకర్, కౌన్సిల్ చీఫ్ మార్షల్ సంజీవ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ... బుధవారం నుండి తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సమావేశాలు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు.రాష్ట్ర శాసనసభ సమావేశాల హుందాతనాన్ని పెంపొందించే విదంగా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.ఈసారి జరిగేవి బడ్జెట్ సమావేశాలు కావున ఎక్కువ రోజులు జరుగుతాయని,గతంలో లాగానే ఈ సమావేశాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు సహకారం అందించాలని చెప్పారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని చెప్పారు.సభలో సభ్యులు ప్రస్తావించిన అన్ని అంశాలకు సంబంధించిన సరైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు



సోమవారం హైదరాబాద్‌లో అసెంబ్లీ నిర్వహణపై సమీక్ష చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్. చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

సభకు,సభ్యులకు అందించాలని చెప్పారు.సభకు సమర్పించే సమాధాన పత్రాలను ముందుగానే పంపినట్లయితే వాటిని సభ్యులు చదువుకొని సభలో మాట్లాడడానికి, చర్చించడానికిఅవకాశం ఉంటుందన్నారు.సమాచారాన్ని తెలుగు, ఉర్దూ,ఇంగ్లీష్ బాషలలో ముద్రించి ముందస్తుగా సభ్యులకు అందించితే వారుసన్నద్ధం కావడానికి ఉపయోగపడుతుందన్నారు.శాఖకు సంబంధించిన చర్చ జరుగుతున్నప్పుడు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉంటూమంత్రులకు, సభ్యులకు తగిన సమాచారం అందిస్తూ సహకరించాలని చెప్పారు.శాసనసభ,శాసనమండలి సమావేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరగడానికి పోలీసు శాఖ తరుపున చర్యలు తీసుకోవాలని చెప్పారు.సభ లోపలితో పాటుగా, పరిసరాలలో కూడా శాంతియుత వాతావరణం ఉన్నప్పుడే చర్చలు బాగా జరుగుతాయని చెప్పారు. సభ జరుగుతున్న సమయంలో ఆందోళనలు

>>2



సోమవారం గ్రూప్ -1 ఫలితాలను విడుదల చేస్తున్న కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, పలువురు సభ్యులు

# గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల

### 24 దాకా రీకౌంటింగ్ దరఖాస్తులకు అవకాశం

### మార్కులను వెల్లడించిన కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది అక్టోబర్21 నుంచి27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్‌కి సంబంధించి అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల జాబితాను తెలంగాణ పబ్లికన సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) సోమవారం విడుదల చేసింది. కమిషన్ అధికారిక వెబ్ సైట్‌లో అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కులను అప్‌లోడ్ చేసింది. అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో మార్కులు చూసుకోవచ్చని కమిషన్ సోమవారం జారీ చేసిన ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 16 వరకు అభ్యర్థులు తమ మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అభ్యర్థులు రీకౌంటింగ్ కోసం ఈనెల 24 వరకు అవకాశం ఇచ్చినట్టు కమిషన్ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. ప్రతి పేపర్‌కి రూ.1000 చెల్లించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు

>>2



# హిందీపై దద్దరిల్లిన లోక్‌సభ

### డిఎంకె ఎంపీలు అనాగరికమన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

### కనిమొళి ప్రభృతుల తీవ్ర నిరసన

**న్యూఢిల్లీ, మార్చి 10:** కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానాన్ని తమిళనాడు అధికారపార్టీ డిఎంకె వ్యతిరేకిస్తోంది. తాజాగా ఇదే అంశాన్ని లోక్‌సభలో డిఎంకె ఎంపిలు లేవనెత్తడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఎంపిలచర్యలపై స్పందించిన కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ మండిపడ్డారు. దీనితో స్పీకర్‌ఓంబిర్లా సభను వాయిదావేసి తిరిగి ప్రారంభించారు. కొత్త విద్యావిధానం తమిళనాడులో అమలుచేయడంపై డిఎంకె


>>2

# ఎమ్మెల్సీ నామినేషన్లు దాఖలు

### బరిలో కాంగ్రెస్ నుంచి ముగ్గురు, సిపిఐ, బిఆర్ఎస్ నుంచి ఒక్కొక్కరు

### కాంగ్రెస్ నేతలకు హాజరైన సిఎం, డిసిఎం, మహేష్

### అభ్యర్థులందరూ ఏకగ్రీవమే



సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న విజయశాంతి. చిత్రంలో సిఎం రేవంత్, మంత్రి పొంగులేటి, పిసిసి చీఫ్ మహేష్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు సోమవారం నామినేషన్ లు దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్దులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి, సీపీఐ అభ్యర్థి నెల్లికంటి సత్యంలు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఇక ఈ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సీపీఐ నేతలు హాజరయ్యారు. అలాగే ఈ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు పలికింది ఎంఐఎం పార్టీ. ఈ సందర్భంగా కాంగ్రెస్

>>2

# ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

### హైదరాబాద్ హబ్సిగూడలో విషాదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 10:** హబ్సి గూడలో విషాదం చోటు చేసుకుంది. సోమవారం రాత్రి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. భార్యాభర్తలు ఇద్దరు పిల్లలు కలిసి ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులే కారణం కావచ్చని అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పోలీసులు విచారిస్తున్నారు. మృతులు చంద్రశేఖర్‌రెడ్డి (40),కవితరెడ్డి(35), శ్రీతరెడ్డి(13),విశ్వంత్‌రెడ్డి(10).చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రైవేట్ ఉద్యోగి, ఆయన భార్య కవిత హౌస్ వైఫ్,శ్రీతారెడ్డి 9వ తరగతి,విశ్వంత్‌రెడ్డి 5వ తరగతి చదువుతున్నారు. భార్యాభర్తలు ఉరి వేసుకనుఇ ఆత్మహత్య

>>2

3



'జగ్గారెడ్డి' సినిమా పోస్టర్

# సినిమాలో నటిస్తున్నా..

### 'ఎ వార్ ఆఫ్ లవ్' ప్రేమకథా చిత్రంలో నాది లీడ్ రోల్

### ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో 'మైండ్ బ్లాంక్'

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

## ఫార్ములా ఇ-కార్ రేస్ కేసులో

# మళ్లీ నాకు నోటీసులు పంపిస్తారేమో

### నలుగురు బ్రోకర్లతో వేల కోట్ల స్కామ్ చేసేందుకు తిరుగుతున్నాడు

### సిఎం రేవంత్‌రెడ్డిపై కెటిఆర్ విమర్శలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** అప్పుల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పదేపదే అబద్ధాలు చెబుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రమారావు మండిపడ్డారు. ఇంకా ఎన్నేళ్లు అబద్ధాలు చెబుతారని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం బిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. బడ్జెట్ సమావేశాల తీరు కూడా అబద్ధాలు, బుకాయింపులతోనే సాగుతుందని ఆరోపించారు. ఫార్ములా ఈ కార్ రేసులో మళ్లీ తనకు నోటీసులు ఇస్తారని అభిప్రాయపడ్డారు. ఈ నెల 16వ తేదీన అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి.. 17వ తేదీన తనకు నోటీసులు ఇస్తారని అన్నారు. తనను విచారణకు పిలిచి నాటకాలు ఆడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్ రేసు ముమ్మాటికీ

>>2

# ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు

### పాత ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టండి

### ప్రీబడ్జెట్ భేటీలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్



సోమవారం హైదరాబాద్‌లో ప్రీ బడ్జెట్ భేటీలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి10:** ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన సాగునీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో వారు పలు అంశాలు చర్చించారు. ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని, ఎఎంఆర్‌పిలో ఐదవ పంపు ఏర్పాటు చేసుకునే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు పూర్తిగా స్టడీ చేసి గోదావరి నీటితో పాలేరు రిజర్వాయర్ ను పరిపుష్టం చేసే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గోదావరి పరిధిలో బస్వాపూర్ మొదలు సింగూరు వరకు, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఏదుల నుంచి వట్టెం ఏదుల కాలువలు గుర్తు చేసుకోవాలని ఆదేశించారు. డిండి ఎత్తిపోతల పథకం పరిధిలో చివరి దశకు చేరుకున్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించాలని ఇరువురు మంత్రులు ఆదేశించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాజెక్టుల కింద ఉన్న భూ సేకరణ, పాత ప్రాజెక్టుల నిర్వహణ, క్యాపిటల్ వర్క్స్ పై దృష్టి సారించాలని అధికారులకు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునికరించుకోవడం, కాలువలకు లైనింగ్ ద్వారా ప్రాజెక్టుల జీవితకాలం పెరుగుతుందని, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని మంత్రులు తెలిపారు. గత పది సంవత్సరాల పాటు పరిపాలించిన వారు కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించి, రాష్ట్రంలో ఉన్న పాత ప్రాజెక్టుల నిర్వహణ అంశాన్ని గాలికి వదిలేయడంతో అవి ప్రమాదంలో పడే పరిస్థితి ఎదురైందని వివరించారు. పాత ప్రాజెక్టులను కాపాడుకునేందుకు మెయింటెనెన్స్ పనులు చేసుకుంటూనే, కేంద్ర నుంచి వివిధ పథకాల ద్వారా నిధులు

>>2



హర్యానా హిసార్‌లోని గురు జంభేశ్వర్ సైన్స్ అండ్ టెక్నాలజీ వర్సిటీ స్నాతకోత్సవంలో సోమవారం విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# సుభాష్‌కు ఉరి

>> ప్రణయ్ హత్య కేసులో ఎ 1గా ఉన్న మారుతీ రావు 2020 మార్చ్ నెలలో ఆత్మహత్య చేసుకోగా, ఎ 2 గా ఉన్న బీహార్ కి చెందిన సుభాష్ కుమార్ శర్మ కి ఉరి శిక్ష విధిస్తూ సంచలనతీర్పు నిచ్చింది. హత్య కేసులో ఎ 6 నిందితునిగా ఉన్న మారుతీరావు సోదరుడు తిరునగరు శ్రవణ్ కుమార్ సహా హత్యతో భాగస్వామ్యం ఉన్న మొత్తం ఆరుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రణయ్ హత్య కేసులో ఠి1 మారుతీరావు, ఠి2 బిహార్‌కు చెందిన సుభాష్ శర్మ, ఠి3 అస్గర్ అలీ, ఠి4 అబ్దుల్లా బారి, ఠి5 ఎంఏ కరీం, ఠి6 శ్రవణ్ కుమార్, ఠి7 శివ, ఠి8 నిజాంలను నిందితులుగా పేర్కొంటూ పోలీసులు ఛార్జి షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ కొనసాగుతుండగానే ప్రధాన నిందితుడైన మారుతీరావు 2020 మార్చిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి స్థాయి విచారణ అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవర్ సోమవారము విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ప్రణయ్ హత్య విషయమై తండ్రి బాలస్వామి మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాలస్వామి ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా ఐదేళ్లపాటు వాదనలు జరిగాయి. వాదన ల అనంతరం సోమవారం నల్లగొండ కోర్టు సుభాష్ శర్మకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వగా మిగిలిన ఆరుగురికి జీవిత ఖైదీ విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో సరియైన ఆధారాలు సేకరించి కోర్టులో చార్జిషీటు దాఖలు సమర్పించి నిందితులకు శిక్ష పడే విధంగా చేసిన అప్పటి విచారణ అధికారులు శ్రీనివాస్, సుధీర్ కుమార్, రాజశేఖర్ రాజు, ప్రసాద్, సైదిరెడ్డి, వీరస్వామి, మధుసూదన్, నరేందర్, మల్లికార్జునులను ఎస్పీ అభినందించారు.

# రేపటి నుంచి అసెంబ్లీ

>> జరగకుండా ముందస్తుగానే సమాచారం అందుకుని అడ్డుకోవాలి. ఇంటెలిజెన్స్ వ్యవస్థ సమర్థవంతంగా, చురుకుగా పనిచేయాలి. సభ్యులు సమయానికి సజావుగా శాసనసభకు చేరుకోవడానికి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రహదారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కౌన్సిల్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. శాసన సభ సమావేశాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా పని చేయాలన్నారు. సమావేశాలు జరిగే సమావేశం అన్ని శాఖల అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు. నోడల్ అధికారులను, లైజనింగ్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో చాలా సంఘాలు చలో అసెంబ్లీ కార్యక్రమాలకు పిలుపునిచ్చే అవకాశాలు ఉన్నందున పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశాలు జరిగే రోజుల్లో అసెంబ్లీ, శాసన మండలి చుట్టూ మూడు అంచెల భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆయన సూచించారు. అలాగే వీఐపీల నివాసాలు, అసెంబ్లీకి వచ్చే రూట్‌లో కూడా భద్రతను ఏర్పాటు చేయాలని చెప్పారు, మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు జవాబులను త్వరగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి శాఖ తరుపున ఒక నోడల్ అధికారిని నియమిస్తాం. తద్వారా అనుసందానానికి సులభమవుతుందన్నారు.

# నాకు నోటీసులు పంపిస్తారేమో

>> లొట్టపీసు కేసే అని పునరుద్ఘాటించారు. ఫార్ములా ఈ కార్ రేసుకు రూ.45 కోట్లు ఖర్చు చేస్తే తప్పు అని అన్నారని కేటీఆర్ అన్నారు. మరి అందాల పోటీలకు రూ.200 ఖర్చు ఎలా చేస్తారని ప్రశ్నించారు. మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి ఏం లాభం వస్తుందని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో ఒలింపిక్స్ గేమ్స్ పెడతానంటున్నాడని.. అందుకు రూ.లక్ష కోట్లు అవసరమవుతాయని తెలిపారు. బీసీలపై అంత ప్రేమ ఉంటే ఢిల్లీలో జంతర్ మంతర్‌లో కూర్చొని ఆమరణ దీక్ష చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమీషన్లు తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. కాంట్రాక్టర్లు భయపడి 20 శాతం తక్కువ చేసి చెబుతున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మాట ఢిల్లీలో నడవడం లేదని, ఢిల్లీలో ఆయనది నడవకున్నా.. పైసలు మాత్రం బాగానే సంపాదిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు ఉన్నారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించే రాహుల్ గాంధీ అన్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి విమానం ఎక్కడం.. దిగడం తప్ప చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా.. పూర్తి స్థాయి మంత్రివర్గం లేదని కేటీఆర్ అన్నారు. జీహెచ్‌ఎంసీలో 400 ఎకరాల భూమిని టీడీఆర్ ద్వారా సేకరించామని చెప్పారు. అయితే రేవంత్ రెడ్డి కొత్త తరహా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి వెనుక నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఉన్నారని కేటీఆర్ తెలిపారు. టీడీఆర్ ఎక్కడ ఉన్నాయోనని ఆ నలుగురు బ్రోకర్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. టీడీఆర్ పేరుతో వేల కోట్ల కుంభకోణానికి ఆ నలుగురితో కలిసి రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని అన్నారు. హైదరాబాద్‌లో టీడీఆర్ మొత్తం షేర్లను కొంతమంది రేవంత్ అనుచరులు విచ్చలవిడిగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే లక్ష చదరపు అడుగులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు.

భవిష్యత్తులో ఎఫ్‌ఎస్‌ఐ నియంత్రిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. ఆప్రకటన తర్వాత ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడతారని తెలిపారు. అప్పుడు టీడీఆర్‌లను అడ్డగోలు ధరలకు అమ్మేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. టీడీఆర్‌పై రేవంత్ రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. టీడీఆర్‌కు గత నెల రోజుల్లో విపరీతమైన గిరాకీ పెరిగిందని కేటీఆర్ తెలిపారు. టీడీఆర్ పేరిట భారీ లూటీ జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా టీడీఆర్ అనుమతులు ఇచ్చామన్న ఆరోపణల్లో నిజం లేదని అన్నారు. ఆ అనుమతులు ఇచ్చింది.. ఎఫ్‌ఎస్‌ఐ తీసుకొచ్చింది వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనే తెలిపారు. ఎఫ్‌ఎస్‌ఐ నియంత్రణ వైఎస్‌ఆర్ హయాంలో ఎత్తివేస్తే.. తాము కొనసాగించామని గుర్తుచేశారు.

## సిఎల్పీ కార్యాలయానికి వెళ్లి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి విషెస్ తెలిపిన పాడి కౌశిక్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి10:** కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న శంకర్ నాయక్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి స్వయంగా విషెస్‌తెలిపారు. సోమవారంఉదయం అసెంబ్లీలో సీఎల్పీ కార్యాలయానికి వచ్చిన పాడి కౌశిక్ రెడ్డి... అక్కడే ఉన్న శంకర్ నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్య

>> చేసుకునేముందు ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి మూకుమ్మడిగా కల్పి ఆత్మహత్య చేసుకున్నారు. ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి గత ఆరు నెలలుగా ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## నేడు ఢిల్లీకి మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్,మార్చి 10ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవానం ఢిల్లీ పర్యటనకు వెళ్ళుతున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మోర్త్ సెక్రెటరీ ఉమాశంకర్, నేషనల్ హైవేస్ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌తో సమావేశమవుతారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రీజినల్ రింగ్ రోడ్డుపై మంత్రి చర్చించనున్నారు.

# రైతు భరోసా

>> భరోసాను అమలు చేసింది. ఈ మూడు విడతల్లో 3 ఎకరాలు ఉన్న రైతులకు వర్తింప జేసింది. అయితే తాజాగా ఐదో విడత మరో వారంలో 4 ఎకరాలున్న రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. దీనికి సంబంధించి 4 ఎకరాలు ఉండి, అర్హులైన రైతుల జాబితాను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీరికి ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున జమ చేస్తారు. కాగా సాగు యోగ్యం కాని భూములకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల సర్వే నంబర్లు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. వాటికి రైతు భరోసా నిలిపివేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఇక రాష్ట్రంలో 1.51 కోట్ల ఎకరాల భూమి ఉండగా. అందులో వ్యవసాయానికి అనువుగాని భూమి 3 లక్షల ఎకరాలుగా అధికారులు నిర్ధారించారు. మిగతా 1.48 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం పంపిణీ చేయాలని నిర్ణయించారు.

## 12న అసెంబ్లీకి కెసిఆర్ హాజరవుతారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి 10:** అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 12న గవర్నర్ ప్రసంగానికి హాజరవుతారని చెప్పారు. బడ్జెట్ ప్రసంగంలోనూ కేసీఆర్ పాల్గొంటారని వెల్లడించారు. కానీ కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడమే మంచిదని ఒక కొడుకుగా తన అభిప్రాయమని చెప్పారు. కేసీఆర్ స్థాయికి కాంగ్రెస్‌లో ఎవరూ సరిపోరని అన్నారు. వాళ్లపిచ్చి మాటలు, పనికిమాలిన దూషణలు, కారుకూతలు వినడానికి కేసీఆర్ రావద్దనేది కొడుకుగా తన అభిప్రాయమని వివరించారు. బీఆర్ఎస్ సభకు వరంగల్ అనువైన ప్రాంతమని కేటీఆర్ తెలిపారు. అన్ని రకాల రవాణా సదుపాయం ఉందని పేర్కొన్నారు. ప్లీనరీ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. దీనిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున రెండు సభలు పెడితే ఇబ్బంది అని భావించామని తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 11-03-2025, మంగళవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల ద్వాదశి ఉ.8.15
ఆశ్లేష రా.2.14
వర్జ్యం మ.2.23-4.05
దు.ఉ.8.51-9.39, 2) రా.11.10-11.58
రాహుకాలం – మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. నూతన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**వృషభం :** అనుకోని విధంగా ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి. పుణ్య క్షేత్రాల సందర్శనం.

**మిథునం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమర్థవంతంగా పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** కుటుంబ సమస్యలు ఎదురైన పట్టుదలతో పరిష్కరించు కుంటారు. ఇంటా బయట అనుకూలం.

**సింహం:** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురైన అధిగమిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**కన్య:** దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. సన్ని హితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు.

**తుల :** పనులలో ఆటంకాలు ఎదురైన పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంటా బయటా ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి.

**ధనుస్సు:** రుణాలు తీరి ఊరట చెందుతారు. పూర్వపు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** సంఘంలో ఆదరణ పొందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు. వస్తులాభం.

**కుంభం:** పనులలో విజయం సాధిస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**మీనం:** దూరపు బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఢిల్లీలో దీక్ష చేస్తా

>> కేంద్రం మూసీకి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తాము 39 సార్లు కాకుంటే 99 సార్లు ఢిల్లీకి వెళ్తాం తప్పేంటని సీఎం ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారి అనేక అంశాలను కేంద్రం నుంచి క్లియర్ చేసుకొని వచ్చినట్లు తెలిపారు. రింగ్ ఉంటేనే రింగ్ రోడ్డు అంటారు. సగం చేసి రింగ్ రోడ్డు అంటే ఎట్లా? అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు సాధించేందుకు సందర్భం వస్తే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా. ఢిల్లీలో దీక్ష చేస్తా, నాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అని స్పష్టం చేశారు. కులగణన ప్రభావమే అన్ని పార్టీలు బీసీలకు ఎమ్మెల్సీ టికెట్లు ఇచ్చాయన్నారు. హరీష్‌రావు మోసం వల్లే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం, ఆయన దగ్గరుండి బిజెపికి ఓట్లు వేయించారని ఆరోపించారు. నేను సిఎం.. కెసిఆర్‌మాజీ సిఎం దానికి స్టేచర్ ఏందీ? పిసిసి అధ్యక్షుడిగాఉన్నప్పుడు కేసీఆర్‌ను గుండుసున్నా చేసింది నేను. కేసీఆర్‌ను బండకేసి కొట్టింది నేను. కెసిఆర్‌ను దించి సిఎం అయ్యింది నేను అని పేర్కొన్నారు. కేసీఆర్..కెటిఆర్‌కు బలుపు తప్ప ఏముంది, స్టేచర్ అంటే రోజంతా డ్రగ్స్ పార్టీలో పాల్గొంటే వస్తదా అని వ్యాఖ్యానించారు. ఫాంహౌస్‌లో కుసోని మందు తాగడం కెసిఆర్ స్టేచరా? అనిప్రశ్నించారు. కెసిఆర్ మాట్లాడిన అడ్డగోలు మాటలు కంటే ప్రపంచంలో ఎప్పుడు ఎవడు మాట్లాడలేదన్నారు. కెటీఆర్ చెల్లని రూపాయి. కెటిఆర్ ఓ పిచ్చోడు..ఏదేదో మాట్లాడుతాడు, క్రిమినల్స్ కేసులకు భయపడదు అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో అధికారపక్షం కంటే ప్రతిపక్షానికి ఎక్కువ సమయం ఇస్తున్నాం అని ఓ ప్రశ్నకు సమాధానంగా అన్నారు. ప్రతిపక్షం లేని రాజకీయాలు చేయాలని తాము అనుకోవడం లేదన్నారు. వాళ్ళు మూసేసిన ధర్నా చౌక్ మేం తెరిచామన్నారు. విమర్శలు చేస్తే పరిశీలించుకుంటాం.. సలహాలు ఇస్తే తప్పకుండా స్వీకరిస్తామని వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ జీతభత్యాలు తీసుకొని పని చేయని వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. పార్టీ నిర్ణయాలు ప్రెసిడెంట్ తీసుకుంటారని.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలో పూర్తి స్వేచ్ఛ పార్టీ అధ్యక్షుడికి ఉంటుందని తెలిపారు. పదేండ్లలో అప్పులు, తప్పులు తప్పా కేసీఆర్ ఏం చేయలేదని, అప్పుల విషయంలో కేసీఆర్ తప్పుడు లెక్కలు చూపెట్టారని దుయ్యబట్టారు. కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు కాగ్ రిపోర్ట్ అసెంబ్లీలో బయట పెడుతామన్నారు. రైతులు బాధపడ్తుంట్రంటే ఆ ముగ్గురు డ్యాన్స్ లేస్తుంట్రు, తెలంగాణలో శవాలు లేస్తున్నాయని తెలియగానే తీన్మార్ డాన్సులు చేస్తున్నారని.. పంటలు ఎండితే ప్రతిపక్షాలు సంతోషపడుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఇబ్బందులు పడితే బాధపడాలని.. ఇంత దుర్మార్గులు ప్రపంచంలో ఎవరైనా ఉంటారా అని అన్నారు. ప్రగతి భవన్‌కు జగన్‌ను పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టింది కెసిఆర్‌యే కదా? రోజమ్మ పెట్టిన రొయ్యల పులుసు తిని ఇరిగేషన్ సమస్యలు తెచ్చిపెట్టారని ఆరోపించారు. పదేళ్లలో ప్రాజెక్టులు కట్టి ఉంటే ఇప్పుడు ఏపీతో సమస్య వచ్చేది కాదన్నారు. ప్రగతి భవన్‌కు పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టింది ఎవరన్నారు. రాష్ట్రంలో కరువు వస్తే ఇంత పంట పండుతుందా అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కేటాయించే నిధులు పరిమితంగానే ఉంటాయని అందుకే కేంద్ర ప్రభుత్వాన్ని నిధులు అడుతున్నామని పేర్కొన్నారు. ట్రిబుల్ ఆర్ ప్రాజెక్టుకు నిధులు ఇస్తామని గతంలో మోదీ హామీ ఇచ్చినందునే తాము అడుగుతున్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న అభివృద్ధినే అన్ని ప్రాంతాలకు విస్తరించాలని తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ౭రాష్ట్రానికి నిధులు రాకూడదని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.7లక్షల 11వేల కోట్ల అప్పుకు వడ్డీతో సహా నెలకు రూ.6,500 కోట్లు అప్పులు కడుతున్నామన్నారు. మేడిగడ్డ నీరు లేకుండానే అత్యధికంగా పంట సాగు చేసామన్న ఆయన తాను చెప్పేది అంతా అధికారిక లెక్కనేనని వివరణ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగ అంటే తనకు గౌరవమే కానీ బీజేపీ నాయకుడిలా ఆయన మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. గతంలో ఎప్పుడో ఇచ్చిన నోటిఫికేషన్లకు ఇప్పటి ఎస్సీ వర్గీకరణ వర్తించదని, ఏదైనా చెయ్యాలని చూస్తే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని వివరించారు. తాను వర్గీకరణ అమలు చేస్తే అన్యాయం జరిగినట్లా, ఏపీలో వర్గీకరణ అమలు చేయనివాళ్లే మంచోళ్లా? అనిప్రశ్నించారు. కమిషన్ నివేదిక వచ్చిన తర్వాతవచ్చే నోటిఫికేషన్లకు వర్గీకరణ వరిస్తుందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఎం మాట్లాడుతున్నారో తనకు తెలియదని వ్యాఖ్యానించారు.

# మెయిన్స్ ఫలితాలు విడుదల

>> చేసుకోవచ్చని తెలిపారు. రీకౌంటింగ్ తర్వాత జనరల్ ర్యాకింగ్ జాబితాను టిజిపిఎస్‌సి ప్రకటిం చనుంది. రాష్ట్రంలోని వివిధనప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరు మెయిన్స్ పరీక్షలను 21,093 మందికి నిర్వహించారు. మెయిన్స్ పరీక్షలకి సంబంధించిన 7 పేపర్ల మూల్యాంకన ప్రక్రియ పూర్తయింది. మెయిన్స్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు ఏడు పేపర్లలో పొందిన మార్కులను ఈ నెల 16 సాయంత్రం 5 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకో వాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ టిజిపిఎస్‌సి ఐడీ, గ్రూప్-1 మెయిన్స్ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీతోపాటు కమిషన్ వెబ్‌సైట్‌లో వారి రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కి వచ్చిన ఓటిపిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా వారి పేపర్ వారీగా మార్కులను తెలుసుకోవచ్చు. అభ్యర్థులు మెయిన్స్ మెమోరాండం ఆఫ్ మార్క్స్ షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, నియామకం పూర్తయ్యే వరకు దానిని భద్రపరచుకోవాలని కమిషన్ సూచించింది. అభ్యర్థులు రీకౌంటింగ్ కోసం ఈ నెల 24 వరకు సుమారు 15 రోజుల పాటు మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్ కోసం అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు సమర్పించాలి. ఆఫ్‌లైన్ అభ్యర్థనలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణించరని కమిషన్ స్పష్టం చేసింది. నోటిఫికేషన్ నంబర్ 02/2024 పేరా 15.5 ప్రకారం.. కమిషన్ వివిధ కారణాలతో తిరస్కరించబడిన, అనర్హులైన అభ్యర్థులకు మార్కులను జారీ చేయలేదు. కమిషన్ నియమ నిబంధనలలోని నియమ, నిబంధనల ప్రకారం రీకౌంటింగ్ కోసం వారి అభ్యర్థన ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబడదని కమిషన్ స్పష్టం చేసింది. రీకౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత, కమిషన్ అందరు అభ్యర్థుల మొత్తం మార్కులను కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. గ్రూప్-1 నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా అభ్యర్థులు అవసరమైన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని కమిషన్ సూచించింది. రీకౌంటింగ్ ముగిసిన తర్వాత అభ్యర్థుల జనరల్ ర్యాం కింగ్ లిస్ట్(జిఆర్ఎల్)ను కమిషన్ ప్రకటించనుంది. జిఆర్ఎల్ ఆధారంగా అర్హులైన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపిక చేస్తారు. వారి వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచడమే కాకుండా.. అభ్యర్థులకు వ్యక్తిగతంగా కమిషన్ సమాచారం అందజేయబడుతుంది. అభ్యర్థులకి ప్రొవిజనల్ మార్కు లను పొందడంలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే.. అభ్యర్థులు టిజిపిఎస్‌సి టెక్నికల్ హెల్ప్ డెస్క్‌ను ఫోన్ నంబర్లు.. 040-23542185 లేదా 040-23542187 హెల్ప్‌డెస్క్‌ని ఇమెయిల్ ద్వారా సంప్రదించవచ్చని కమిషన్ ప్రకటనలో పేర్కొంది.

## ప్రాధాన్యత క్రమంలో సాగునీటి ప్రాజెక్టులు

>> రాబట్టేందుకు ఉన్న అవకాశాలను త్వరితగతిన పరిశీలించాలని మంత్రులు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక లీగల్ టీం ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టుల గేట్ల పరమతులు పూర్తి చేయాలని ఆదేశించారు. కాలువలను బలోపేతం చేసుకునే పనులపై దృష్టి పెట్టాలని సూచించారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు అడ్డగోలుగా ఎక్కువ వడ్డీ రేట్లు కు అప్పులు తేవడంతో ఆ భారం ప్రస్తుత ఖజానా నిర్వహణపై పడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు 10 వడ్డీ రేటుకు అప్పులు తేగా ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ వడ్డీ రేట్లు 8 శాతానికి తగ్గించేందుకు అధికారులు మంచి ప్రయత్నం చేశారని మంత్రులు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. ఈ పథకం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా పౌర సరఫరాల శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య దాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఈఎన్‌సి జనరల్ అనిల్, స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ విజయ్ కృష్ణారెడ్డి, ఓఅండ్ ఎం విజయ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హిందీపై దద్దరిల్లిన లోక్‌సభ

>> ఎంపిలునిరసన వ్యక్తంచేస్తూ వెల్‌వైపు దూసుకురావడంతో కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తంచేసారు. జాతీయ విద్యావిధానంపై చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. విద్యార్థుల భవిష్యత్తుతో డిఎంకె చెలగాటమాడుతోంది. వారంతా అనాగరికంగా వ్యవహరిస్తున్నారు. నిజాయితీ లేనివారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు డిఎంకె సిద్ధంగా లేదు. భాషాపరమైన వివాదాలు సృష్టించడమే పనిగా పెట్టుకుంటూ రాజకీయాలుచేస్తున్నారని వార ఇచర్యలు పూర్తి అప్రజాస్వామికమని మండిపడ్డారు. మంత్రి ప్రధాన్‌వ్యాఖ్యలపై డిఎంకె ఎంపి కణిమోళి కూడా తీవ్రనిరసన వ్యక్తంచేసారు. మంత్రి వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్‌చేసారు. ఈక్రమంలోనే స్పీకర్ సభను వాయిదావేసి తిరిగిప్రారంభించారు. ప్రధాన్ వ్యాఖ్యలపై డిఎంకె నిరసన వ్యక్తంచేసింది. అనంతరం ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మాట్లాడారు. ఓటరు జాబితాలో అవకతవకలు జరిగాయన్న అంశాన్ని ఆయన లేవనెత్తారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోలనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఓటరు జాబితాపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈజాబితాపై చర్చలుజరగాలని మా పక్షాలు డిమాండ్‌చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత అన్నారు.

## నోరు అదుపులో పెట్టుకోండి మంత్రిగారు!

### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై సిఎం స్టాలిన్ వార్నింగ్

చెన్నై, మార్చి 10: జాతీయ విద్యావిధానం అమలులో కేంద్రం తమిళనాడు మధ్య తీవ్ర మాటల యుద్ధం నడుస్తోంది. ఎన్ఇపి అమలుచేయకుండా తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డిఎంకె నాశనంచేస్తోందని మంత్రి ధర్మేంద్రప్రధాన్ లోక్‌సభలో ఆరోపించడంతో స్టాలిన్ మండిపడ్డారు. ఎన్ఇపి 2020ని అమలుచేయబోమని స్పష్టంచేసారు. ఆ విద్యావిధానాన్ని అమలుచేయాలని ఎవరూ తనను ఒత్తిడిచేయలేరన్నారు. విద్యార్థులకు చెందిన నిధుల్ని విడుదలచేస్తారా లేదా అని ఆయన కేంద్రాన్ని నిలదీసారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్రప్రధాన్ ఆయనకు ఆయనే చక్రవర్తిలా ఫీలవుతున్నారని చాలా దురుసుగా మాట్లాడుతున్నారని క్రమశిక్షణ అవసరమని అన్నారు. మంత్రి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తమిళనాడుప్రజలను మంత్రి అవమానిస్తున్నారనిచెప్పారు. మంత్రి ప్రధాన్ చేసిన వ్యాఖ్యలను ప్రధానిమోడీ ఆమోదిస్తారా అని ప్రశ్నించారు. నిధులు ఇవ్వకుండా తమిళప్రజల్ని మోసంచేస్తున్నారని తమిళ ఎంపిలనుఅనాగరికులు అని అంటారా అని సోషల్‌మీడియాలో తీవ్రపదజాలంతో స్టాలిన్ ఎదురుదాడిచేసారు. తమిళనాడులో కేంద్ర మంత్రి వ్యాఖ్యలక నిరసన తెలుపుతూ డిఎంకె కేడర్ అనేక జిల్లాల్లో నిరసనలు చేపట్టింది. ధర్మేంద్రప్రధాన్ దిష్టిబొమ్మలను దహనంచేసారు. త్రిభాషా సూత్రంతోపాటు జాతీయ విద్యావిధానం అమలును తీవ్రంగా వ్యతిరేకంచడమేకాకుండా తమిళనాడుకు రావాల్సిన 2వేల కోట్ల నిధులనున తక్షణమే విడుదలచేయాలని పార్టీ ఎంపిలు పార్లమెంటులో డిమాండ్‌చేసి కేంద్ర వైఖరిపట్ల తీవ్ర నిరసనలు తెలిపారు.

# ఎమ్మెల్సీ నామినేషన్లు దాఖలు

>> అభ్యర్థుల నామినేషన్లకు మద్దతుగా ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి నలుగురు, బీఆర్ఎస్ నుంచి ఒక అభ్యర్థి మాత్రమే పోటీలో ఉండటంతో ఈ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. బిఆర్ఎస్ తమ అభ్యర్థిగా దాసోజు శ్రావణ్‌కు అవకాశం ఇచ్చింది. ఈ క్రమంలో ఆయన వెంట మాజీ మంత్రి కెటిఆర్, హరీశ్‌రావు, ఇతర బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. దీంతో అసెంబ్లీ ప్రాంగణం మొత్తం ఒక్కసారి కోలాహలంగా మారిపోయింది. కాంగ్రెస్ నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు పోటీ చేయకుండా మూడు స్థానాలకే పరిమితమైంది. పొత్తులో భాగంగా మరో స్థానాన్ని సిపిఐకి కేటాయించింది. దీంతో బిఆర్ఎస్ రెండో అభ్యర్థిని నిలబెట్టేందుకు ముందుకు రాలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. తమకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని సీపీఐ కోరగా, కొత్తగూడెం మాత్రమే కేటాయించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును కేటాయిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు ఈ సీటును కేటాయించింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి విజయానికి 21 మంది ఎమ్మెల్యేల అవసరం ఉంది. కాంగ్రెస్‌కు 65 మంది ఎమ్మెల్యేలు ఉండగా, సిపిఐ ఎమ్మెల్యేతో కలుపుకుని 66 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బిఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ అందులో నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పైగా ఎంఐఎం కూడా కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా నిలిచింది. ఈ సందిగ్దంలో 6వ అభ్యర్థి రంగంలోకి దిగకపోవడంతో నామినేషన్ దాఖలు చేసిన ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలపై 11న స్క్రూట్నీ జరగనుంది. కాగా, నలుగురు ఇండిపెండెంట్ అభ్యర్థులు సిహెచ్.చంద్రశేఖర్, బూరాజ్ కోయల్కర్, జాజుల భాస్కర్, కంటే సాయన్న నామినేషన్ దాఖలు చేశారు. వీరి నామినేషన్ పత్రాల్లో ఎమ్మెల్యేలెవ్వరూ సంతకాలు చేయలేదు. దీంతో వారి నామినేషన్ పత్రాలు 11న జరిగే స్క్రూట్నీలో తిరస్కరణకు గురవుతాయి. 13వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహారణకు గడువు ఉండటంతో గడువు సమయం ముగిసిన తర్వాత అదే రోజు సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల ఎన్నికల సంఘం తరఫున రిటర్నింగ్ అధికారి సర్టిఫికేట్లు అందజేస్తారు.

**పదవులు రాని వారు కాస్త ఓపిక పట్టాలి: విజయశాంతి**

పార్టీ అధిష్ఠానం తనకు గతంలో అవకాశం ఇచ్చినా వద్దని చెప్పి, ముందు పని చేస్తానని చెప్పానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విజయశాంతి వెల్లడించారు. తాను గతంలోనూ కాంగ్రెస్ పార్టీలో పని చేశానని, కానీ ఏనాడూ ఇది కావాలని అడగలేదని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు తాను తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరానని తెలిపారు. పార్టీలో ఉండి పదవులు రాని వారు కాస్త ఓపిక పట్టాలని సూచించారు. పార్టీ తనకు అవకాశం ఇచ్చినప్పుడే మాట్లాడాలని అనుకున్నానని, అప్పటి వరకు పని చేసుకుంటూ వెళ్లానని విజయశాంతి అన్నారు. అవకాశం కోసం ఎదురు చూశానని, ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఒక పద్ధతి ఉంటుందని, దాని ప్రకారమే అందరూ పని చేయాలని ఆమె అన్నారు. ప్రజల సమస్యకు పరిష్కారం చూపించే దిశగా తాము పోరాడతామని అన్నారు. ఒక ఆలోచన, ముందుచూపుతో రాష్ట్ర ప్రజల కోసం పలు సంక్షేమ పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రకటించి, అమలు చేస్తోందని అన్నారు.



సోమవారం ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేస్తున్న శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్



## ప్రధాని మోడీని కలిసిన ఎంపి ఈటల కుటుంబసభ్యులు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీని మల్కాజ్‌గిరి ఎంపి ఈటలరాజేందర్ మర్యాదపూర్వకంగా కుటుంబసభ్యులతో కలిసారు. సోమవారం ఢిల్లీలోని ప్రధాని నివాసంలో కుటుంబసమేతంగా వెళ్లి కలిశారు. ప్రధానిని కలిసిన వారిలో ఈటల రాజేందర్ భార్య జమున, కూతరు డా.నీత, అల్లులు అనూప్, కుమారుడు నితిన్, మేనల్లుడు రాహుల్, మనుమలు రుష్‌హాంగ్, హిందియాన్‌లు ఉన్నారు. ప్రధానిని కలవడంపై ఎలాంటి రాజకీయాలు లేవని ఈటల ప్రకటించడగా, మరోవైపు తెలంగాణ బిజెపి అధ్యక్షుడిగా ఈటల పేరు ఖరారు అయినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే అధిష్టానం పెద్దల ఆశీర్వాదాలకు వెళ్లారని చర్చించుకుంటున్నారు. కాగా రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావు, డికె అరుణలతో పాటు పలువురు నాయకులు ప్రయత్నం చేయగా.. అధిష్టానం మాత్రం ఈటలవైపే మొగ్గు చూపిస్తున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈటలకు ఇస్తే బిసి సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని బిజెపి అగ్రనాయకులు భావిస్తున్నట్లు సమాచారం.

## కార్పొరేట్ విద్యాసంస్థ కార్యాలయాలపై ఐటి దాడులు

### తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర నగరాల్లోనూ సోదాలు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ కార్పొరేట్ విద్యా సంస్థ కార్యాల యాలపై సోమవారం నాడు ఐటి అధికారులు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, మహారాష్ట్ర, కర్నాటకలోని పలు నగరాలలో ఈ సంస్థకు విద్యాలయాలు, కాలేజీలు వున్నాయి. వీటన్నింటిలో అక్రమాలు జరిగినట్లు అందిన ఫిర్యాదుపై సమాచారం సేకరించిన ఐటి అధికారులు సోమ వారం ఉదయం నుంచి రాత్రి బాగా పొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భం గా పలుచోట్ల కీలక పత్రాలతో పాటు రెండు కోట్ల రూపాయలకు పైగా నగదు జప్తు చేసినట్లు తెలిసింది. నీట్, జేఈఈ వంటి పరీక్షల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఈ విద్యా సంస్థలో చేరుతుండడ ంతో పాటు ప్రత్యేకంగా కోచింగ్ తీసుకుంటుంటారు. ఇదే సమయంలో ఈ సంస్థలో చదువువున్న కొందరు విద్యార్థులు కొంత కాలంగా ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతాలు వెలుగు చూడడంతో వీటిపై పోలీసులు వేరుగా విచారించసాగారు.

## ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలి

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మార్చి 10, ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ జరిగేదాకా ఉద్యోగ పరీక్షల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలకు ముఖ్యఅతిథిగా హాజరై మందకృష్ణ మాట్లాడుతూ గత నోటిఫికేషన్లకు వర్గీకరణ వర్తింప చేస్తామని ఆగస్టు 1న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ యాక్ట్ 2000 ను రూపొందించి, ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు వర్గీకరణ సూత్రం వర్తింపచేసేలా నాలుగో నిబంధనను పొందుపరిచారని గుర్తు చేశారు. 2004కు ముందు వర్గీకరణ ప్రకారం ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చేవని, సుప్రీంకోర్టు 2004లో వర్గీకరణ రద్దు చేసిందనే కారణంతో వర్గీకరణ ప్రకారం ఆ నోటిఫికేషన్ల ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని గుర్తు చేశారు. వర్గీకరణ చట్టం వచ్చేవరకు అన్ని ఉద్యోగ ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ క్రాంతి దళ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్, తెలంగాణ విఠల్, సయ్యద్ ఇస్మాయిల్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



దీక్షనుద్దేశించి ప్రసంగిస్తున్న మందకృష్ణ మాదిగ

## ఎదురెదురుగా రెండు బైకులు ఢీ

### ఒకరు మృతి.. మరొకరి పరిస్థితి విషమం

**గుండాల, మార్చి 10, ప్రభాతవార్త :** ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయి మరో వ్యక్తి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం గుండాల మండలం పాచిల్ల గ్రామ రెవెన్యూ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గుండాల మండలం వస్తా కొండూరుకు చెందిన సుంకర బోయిన మహేష్( 30) వస్తా కొండూరు నుంచి గుండాల వైపు వస్తుండగా ఇదే మండలంలోని వంగాల గ్రామానికి చెందిన చిప్పలపల్లి శంకర్ గుండాల నుంచి వంగాలవైపు వెళుతుండగా పాచిల్ల రెవెన్యూ శివారులో ఎదురెదురుగా బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుంకర బోయిన మహేష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చిప్పలపల్లి శంకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక పోలీసులు హుటాహుటిన మెరుగైన వైద్య సేవలను నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# సినిమాలో నటిస్తున్నా..

### 'ఎ వార్ ఆఫ్ లవ్' ప్రేమకథా చిత్రంలో నాది లీడ్ రోల్

### ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో 'మైండ్ బ్లాంక్'

### కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక చూసి మైండ్ బ్లాక్ అయిందని ప్రస్తుతం తాను పొలిటికల్ మైండ్ బ్లాంక్‌లో ఉన్నానని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. సోమవారం ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ పాలిటిక్స్ నుంచి విశ్రాంతి తీసుకొని ఏ వార్ ఆఫ్ లవ్ అనే ప్రేమకథా చిత్రంలో లీడ్ రోల్ పోషించబోతున్నా నని సంచలన ప్రకటన చేశారు. నా ఒరిజినల్ క్యారక్టర్ అనుగుణంగా కథ ఉండబోతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎంపికతో తాను రాజకీయంగా షాక్‌లో ఉన్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. తన షాక్‌కు కాలం సమాధానం చెబుతుందన్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు జట్టి కుసుమ కుమార్‌కు ఇవ్వాలని తాను రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోరానని ఆయన తెలిపారు. అను కోకుండా ఢిల్లీకి తెలంగాణ నుంచి నేతలు రాలేదన్నారు. 2017లో రాహుల్ గాంధీ సంగారెడ్డి సభను తానే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి కష్టాలు పరిణామాలు చెప్పాలని అనుకున్నానని దానిపై రాహుల్ గాంధీని కలిసేందుకు ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. కుసుమ కుమార్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు చెప్పా నన్నారు. తాను ఢిల్లీకి వచ్చి కుసుమ అంశం మాట్లాడాలని అనుకున్నా నన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ అంశాన్ని ముందే చెప్పినట్లు తెలిపారు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ లేరని జగ్గారెడ్డి వెల్లడించారు. రాజకీయాల్లో ఫైట్ చేస్తానని తాను సింపతీ మీద రాజకీయాల్లోకి రాలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చెప్పుకొచ్చారు. నాకు సినిమా ఆఫర్ వచ్చింది లవ్‌స్టోరి చిత్రంలో ప్రత్యేక పాత్ర చేస్తున్నాను. ప్రేమికుల ప్రేమను కాపాడే క్యారెక్టర్‌లో కనిపిస్తాను మాఫియాను ఎదిరించి ప్రేమ పెళ్ళిచేసే కథాంశంతో త్వరలో సినిమాల్లోకి రానున్నట్లు ప్రకటించారు. అతి త్వరలో ఒక ప్రేమ కథ చిత్రంలో ప్రత్యేక పాత్ర పోషించనున్నట్లు ఆయన వెల్లడించారు. సినిమాలో మాఫియాను ఎదురించి ఆడపిల్ల పెళ్ళి చేసే వ్యక్తి అతనే జగ్గారెడ్డి అని అన్నారు. ఈ మధ్య కాలంలో ఓ వ్యక్తి తన దగ్గరకు వచ్చి ఒక కథ ఉంది అని చెప్పారన్నారు. ఆ కథలో మీ పాత్ర ఉందని అన్నారు. ఆ సినిమాలో నటిస్తా అని చెప్పాను. నూతన సంవత్సరం ఉగాదిరోజున సినిమా కథవిని, వచ్చే ఉగాదికి సినిమా పూర్తి చేస్తా నని ఆశాభావం వ్యక్తంచేశారు పిసిసి, ముఖ్యమంత్రి అనుమతి తీసుకొని నటిస్తాను అని వెల్లడించారు. ఇక సినిమా పేరును కూడా ప్రకటించేశారు. సినిమాల్లో, రాజకీయాల్లో కొనసాగుతానని రాజకీయాల్లో నన్ను ఎవరు తొక్క లేరని ఆయన ఆత్మవిశ్వాసం వ్యక్తీకరించారు. తాజాగా జగ్గారెడ్డి పోస్టర్‌ను చిత్ర బృందం విడు దల చేసింది. వద్ది రామానుజం చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జగ్గారెడ్డి సినిమాల్లో ప్రవేశిస్తుండటంతో ఆయన అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విదేశాల్లో ఉద్యోగాల పేరుతో ఎర

### సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి థాయ్‌లాండ్‌లో బందీగా మారిన యువత

### కేంద్రమంత్రి బండి సంజయ్ జోక్యం

### 540 మంది బందీలకు విముక్తి

### ప్రత్యేక విమానంలో భారత్‌కు రాక

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఉద్యోగాల కోసమని వెళ్లి థాయ్‌లాండ్ కేంద్రంగా సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో బందీలుగా మారి బలవంతంగా సైబర్ వెట్టిచాకిరికి గురవుతున్న వందలాది మంది భారతీయ యువతకు విముక్తి లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జోక్యంతో వీరందరినీ స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చకచకా జరిగిపోతున్నాయి. మొత్తం 540 మంది బందీలను గుర్తించగా వీరిలో తెలంగాణ, ఏపీకి చెందిన 42 మందిని గుర్తించారు. వీరందరినీ 270 మంది చొప్పున రెండు విమానాల్లో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. తొలుత వీరిని థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణానికి తరలిం చిన అక్కడి అధికారులు అక్కడి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తరలిస్తున్నారు. సోమవారం 270 మందితో కూడిన తొలి విమానం థాయ్‌లాండ్‌లోని మై సోట్ నుంచి ఢిల్లీకి బయల్దేరింది. మంగళవారం మరో 270 మందితో రెండో విమానం ఇండియాకు రానుంది. ప్రస్తుతం వీరంతా మయన్మార్‌లోని మేవాడీ జిల్లాలో ఆర్మీ పరిరక్షణలో ఉన్నారు. వీరందరినీ మంగళవారం ఉదయం మయన్మార్ ఆర్మీ ట్రక్కుల్లో తొలుత థాయ్‌లాండ్‌లోని మైసోట్‌కు, అక్కడ ప్రత్యేక ఆర్మీ విమానంలో ఇండియాకు తీసుకురానున్నారు. వాస్తవానికి వీరంతా విదేశాల్లో ఉద్యోగాలు చేసేందుకు వెళ్లి అక్కడ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగా వీరందరికీ ఉద్యోగాలిప్పిస్తామని స్థానిక ఏజెంట్ల ద్వారా సైబర్ నేరగాళ్ల ఆయా యువతకు ఆశ చూపారు. వారికి ఉద్యోగాలు ఖరారయ్యాయని నమ్మబలికిన ఏజెంట్లు థాయ్‌లాండ్‌తోపాటు పొరుగున్న కంబోడియా, లావోస్, మయన్మార్‌లలో పలు సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లో వీరిని విక్రయించారు. అక్కడికి వెళ్లాక వారితో బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నారు. ఒకవేళ సైబర్ నేరాలు చేయకపోతే యువతీ, యువకులకు కరెంటు షాకులిచ్చి హింసిస్తారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం రంగపేట గ్రామానికి చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు ఇలాగే కొలువు కోసం వెళ్లి బందీగా మారిన విషయం మీడియాలో వచ్చింది. వెంటనే స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ వారిని రప్పించేందుకు చర్యలు తీసుకున్నారు. భారత విదేశాంగశాఖకు స్వయంగా లేఖ రాశారు. మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్యకార్యాలయాలను అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో మయన్మార్ ప్రభుత్వం తన ఆర్మీని పంపి సైబర్ ఫ్రాడ్ కేఫ్‌లలో బంధీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. అనంతరం బండి సంజయ్ చొరవతో కేంద్రం వారందరినీ స్వదేశానికి రప్పిస్తుండటం గమనార్హం.

## ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో బిసి ఉద్యమం ఎఫెక్ట్

### జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** బిసి ఉద్యమం ఉధృతితోనే ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం పాటించారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు బీసీలలో వస్తున్న రాజకీయ చైతన్య పసిగట్టే అన్ని రాజకీయ పార్టీలు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎంపికలు సామాజిక న్యాయం పాటించారని ఇది అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులదరణ ఉద్యమం మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు ఓటు బ్యాంకుతో సంఘటితం కావడం అగ్రకుల రాజకీయాధిపతి ఆధ్వర్యంలో నిరంతరం బీసీలు ఉద్యమిస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ మూడు ఎమ్మెల్సీలను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అలాగే బిఆర్ఎస్, సిపిఐ పార్టీలు కూడా బీసీలకు అవకాశం ఇవ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్తులో జరిగే స్థానిక సంస్థలు, అసెంబ్లీ పార్లమెంటు ఎన్నిక ల్లోనూ జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి టికెట్లు ఇస్తేనే భవిష్యత్తులో రాజకీయ పార్టీలు మనగలసాధిస్తాయని, బీసీలను విస్మరిస్తే ఫలితాలు తారుమారు కానున్నాయని తెలిపారు. అన్ని పార్టీల నుండి ఎంపిక కాబడ్డ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు.

## పంటల పరిరక్షణే ప్రభుత్వ కర్తవ్యం

### అధికారులు సమన్వయంతో పని చేయాలి

### నీటి వనరులు చివరిదాకా అందేలా చూడాలి

### క్షేత్ర స్థాయిలో వాస్తవాలు బాహ్య ప్రపంచానికి వివరించాలి

### విడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు ఉత్తమ్, తుమ్మల



**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** చేతికొచ్చిన పంటను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి విషయంలో పెరుగుతున్న అసత్య ప్రచారాలు తిప్పికొట్టాలని ఆయన కోరారు. నీటి పారుదల శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వాస్తవాలను ప్రజలకు సోదాహరణంగా వివరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయం నుండి సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర వ్యవసాయ శాఖా కార్యదర్శి రఘునందన్ రావు టి.ఎస్.ఎస్.పి.డి.సి.ఎల్ సి.యం.డి ముషారఫ్ తదితరులతో కలసి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు, వ్యవసాయ శాఖాధికారులు, విద్యుత్ శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానున్న ఒదున ఆయా జిల్లాల అధికారులు సమన్వయంతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ రైతాంగానికి తోడ్పాటు నందించాలని ఆయన సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నిజ నిజాలు తెలుసుకోకుండా పంట నష్టం గురించి జరుగుతున్న ప్రచారం సత్య దూరమన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం రబీ పంట విషయంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూనే వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా సమగ్ర సమాచారం తెప్పిస్తున్నామన్నారు. అనంతరం వరంగల్ సాగునీటి సరఫరాపై సమీక్షను జరిపారు ఆ సమీక్షలో జిల్లాఇంచార్జీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కడియంశ్రీహరి తదితరులు హాజరయ్యారు.

# తెలంగాణ మోడల్‌ను మోడీ ఆచరిస్తే దేశం అభివృద్ధి

### రాష్ట్రానికి అన్యాయం చేసింది బిఆర్ఎస్‌యే

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి



సోమవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలంగాణ మోడల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆచరిస్తే దేశం శీఘ్రంగా అభివృద్ధి చెందుతోందని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లురవి హితవు చెప్పారు. ఢిల్లీలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పదకొండు వేల కోట్లు 55 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠ శాలల నిర్మాణం కోసం పాలనాపరమైన అనుమతులు ఇచ్చారని వివరించారు. ఒక్కకొక్క పాఠశాలకు 200 కోట్ల రూపాయలు నిధులు వ్యయం చేస్తున్నారని, 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేసానతరని ఆయన తెలిపారు. 4 వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువు కునేలా పాఠశాలలు ఉండబోతు న్నాయని మల్లు రవి తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా ఉన్నత చదువులు పేద వర్గాల ప్రజలకు దక్కే అవకాశం దేశంలో ఎక్కడ లేనివిధంగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లు విప్లవాత్మక నిర్ణయం చేశారని కొనియాడారు.

ఒక్కొక్క పాఠశాలకు30 కోట్ల రూపాయలు జిల్లా కలెక్టర్ కి విడుదల చేసి పెట్టారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఎంపీలందరం అభినందిస్తున్నాం. తెలంగాణ మోడల్‌ను దేశంలో మోడీ తీసుకొస్తే దేశ ప్రజ లకు మేలు జరుగుతుంది.

సామాజిక న్యాయం, సమా నత్వం వంటి మూల సూత్రాలను తెలంగాణలో అమలు చేసాం బిజెపి పాలిత రాష్ట్రాల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. సిఎంరేవంత్ రెడ్డి రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు, దానికి భిన్నంగా మాట్లాడటానికి కేటీఆర్ కి సిగ్గు ఉండాలి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని హోదాలో మోడీ హైదరాబాద్ వస్తే కేసీఆర్ కలవలేదు అని ఆయన ఆవేదన చెందారు. కేంద్రంతో సఖ్యతతో ఉండకుండా తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసిన పార్టీ బిఆర్ఎస్ అని ఆయన అన్నారు. కెసిఆర్, కేటీఆర్ వరి వేస్తే ఉరి రైతులను భయభ్రాంతులకు గురిచేశారని మల్లురవి దుయ్యబట్టారు. కేటీఆర్, కేసీఆర్ తెలంగాణ నాలుగు కోట్ల మంది ప్రజల విజ్ఞత, ఆత్మగౌరవాన్ని అవమాన పరిచినట్టు భావిస్తున్నానని ఆయన అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఏ రకంగా కేసీఆర్ స్థాయికి సరిపోరు అని ఆయన నిల దీశారు. ప్రజలు రేవంత్ రెడ్డి కి ఒక స్థాయి ఇచ్చారు, రేవంత్‌ను సిఎంగా, భట్టిని విక్రమార్క ను డిప్యూటీ సిఎంగా ప్రజలు చేశారని ఆయన తెలిపారు.

కేటీఆర్ వ్యాఖ్యలు మాటలు పిచ్చి వ్యాఖ్యలు అని మల్లురవి కొట్టివేశారు. కెసిఆర్ కెటిఆర్‌లకు పిచ్చి పట్టింది అందుకే ప్రజలు లోక్ సభలో డిపాజిట్ రాకుండా ఓడించారని లోక్‌సభ ఎన్నిక ఫలితాలను నెమరేసుకొంటు దూషించారు. కేటీఆర్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు కేటీఆర్ ఇలానే మాట్లాడితే ప్రజల నుంచి వచ్చే తిరుగుబాటు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు కేటీఆర్ పై తిరగబడతారని జోస్యం చెప్పారు. దానికి ఆయనే బాధ్యత వహించాలి సిఎం రేవంత్ రెడ్డి పై ,కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ మాట్లాడుతూ ఉంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరిక చేశారు.

## ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు హర్షణీయం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** నల్గొండ జిల్లాలో జరిగిన పరువు హత్య కేసు.. ప్రణయ్ హత్య కేసులో కోర్టు తీర్పు హర్షణీయమని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సిపిఐఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కుల దురహంకార హత్యకేసులో ఒకరికి ఉరిశిక్ష, మరో 6 మందికి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పును తమ పార్టీ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తుందని తెలిపారు. ఈ తీర్పు కుల దురహంకారులకు తీవ్ర హెచ్చరికగా ఉందన్నారు. 2018లో నల్గొండలో ప్రణయ్, అమృత కులాంతర వివాహం చేసుకున్నారు. కుల దురహంకారంతో అమృత తండ్రి మారుతీరావు ప్రణయ్‌ని నడిరోడ్డు మీద అత్యంత కిరాతంగా హత్యచేయించారు. ఈ హత్యకు వ్యతిరేకంగా, అమృతకు అండగా సీపీఎం పార్టీ నిలబడింది, దోషులను కఠినంగా శిక్షించాలని పార్టీ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు జరిగాయని.. రాష్ట్రంలో నేటికీ అనేక కుల దురహంకార హత్యలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తీర్పు వల్లనైనా కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని భావిస్తున్నట్టు జాన్‌వెస్లీ పేర్కొన్నారు.



బాధితుడికి రూ. 36.50 లక్షల డిడిని అందజేస్తున్న సైబర్‌క్రైం డిసిపి ధార కవిత. చిత్రంలో ఎసిపి శివమారుతి తదితరులున్నారు

## డిజిటల్ అరెస్టు పేరిట విశ్రాంత ఉద్యోగికి రూ.43 లక్షల టోకరా

### బాధితుడికి రూ.36.50 లక్షలు అందజేసిన పోలీసులు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఓ విశ్రాంత ఉద్యోగిని సైబర్ నేరగాళ్ల డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించి 43 లక్షల రూపాయలు కాజేయగా దీనిపై వెంటనే స్పందించిన సైబర్ క్రైం పోలీసులు బాధితుడు పోగొట్టుకున్న నగదు నుంచి 36.50 లక్షల రూపాయలను తిరిగి అందజేసిన ఉదంతం ఇది. హైదరాబాద్‌కు చెందిన 70 ఏళ్ల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగిని ఇటీవల సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరిట బెదిరించారు. ఫెడెక్స్ కొరియర్‌లో స్మగ్లింగ్ వస్తువులు వున్నాయి. ఇవి మీవేనని బెది రించి, ఆనక డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు హడలెత్తించి ఆయన బ్యాంకు ఖాతాలో నుంచి 43 లక్షల రూపాయలు కాజేశారు. దీనిపై బాధితుడు కొంతసేపటి తరువాత తేరుకుని సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన సైబర్ క్రైం డిసిపి ధార కవిత తన బృందం తో రంగంలో దిగి సైబర్ నేరగాళ్లు ఏ ఏ బ్యాంకు ఖాతాల నుంచి నగదు కాజేశారో...ఆయా బ్యాంకుల అధికారులతో మాట్లాడి అప్పటి వరకు ఆయా ఖాతాల్లో వున్న 36 లక్షల 50 వేల రూపా యలను నిలిపి వేయించారు. అనంతరం ఈ నగదును డిడి రూపంలో సోమవారం నాడు డిసిపి కవిత తన కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితు డు సంతోషం వ్యక్తం చేయగా పోలీసులను డిసిపి అభినందించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అందరు జాగ్రత్తగా వుండాలని ఆమె కోరారు. ఎలాంటి అనుమా నాలు వచ్చినా వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శివమారుతితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నడిగూడెంలో నకిలీ డిఎస్‌పి అరెస్ట్

### 18 లక్షలు నగదు, కారు స్వాధీనం

### వివరాలు వెల్లడించిన ఎస్పీ నరసింహా

**ప్రభాతవార్త, నడిగూడెం (సూర్యాపేట):** ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయక యువత నుండి డబ్బులు వసూలు చేస్తున్న నకిలీ డిఎస్పీని సూర్యాపేట పోలీసులు అరెస్ట్ జిల్లా ఎస్పీ నరసింహా కేసు వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సోమ వారం పట్టణంలోని శ్రీ గ్రాండ్ హోటల్ నందు ఒక వ్యక్తి అనుమానాస్పదం గా ఉన్నాడు అనే హోటల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారం పై వెంటనే శ్రీ గ్రాండ్ హోటల్ కి వెళ్ళి అక్కడ ఉన్న వ్యక్తిని అదుపు లోకి తీసుకొని బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అతనిని విచారించగా అతని పేరు బతుల శ్రీనివాస్ రావు 35 సం,,లు, నివాసం: మట్టపల్లి గ్రామం, మటంపల్లి మండలం అని తెలుపుతూ తనను తాను డి.ఎస్.పిగా పరిచయం చేసుకొని అమాయకమైన నిరుద్యోగులకు పోలీస్ డిపార్ట్మెంట్ లో, సివిల్ సప్లయ్ లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారి వద్ద డబ్బులు తీసుకొని జల్సాలకు ఖర్చు పెట్టుకుంటాడు, గతంలో ఇతని పై మటంపల్లి, రాజముండ్రి 2 టౌన్, నర్సరావపేట రూరల్, త్రిపురాంతకం, మెడికొండూర్ మరియు మార్కాపురం లలో 2022 ఇదే విధంగా మోసం చేయడం తో కేసులు అయినవి జైలుకెళ్లి బెయిలుపై వచ్చి 2024 సెప్టెంబర్ నుండి మరలా కొంత మందిని ఆటో డ్రైవరుల ద్వారా, మంగలి షాపుల ద్వారా కొంత మంది డి.ఎస్.పి గా పరిచయం చేసుకుని మోసానికి పాల్పడ్డాడు. కోదాడ అమ్మాయి వద్ద ఎస్సై ఉద్యోగం కోసం ఇచ్చిన డబ్బులలో మిగిలిన డబ్బులు రూ. 18,00,000/ ( పద్దెనిమిది లక్షలు )అతని వద్ద నుండి రికవరీ చేసి అతనిని రిమాండ్ కి పంపినట్లు తెలిపారు.

## ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన ఇండియా క్రికెట్ టీమ్‌కు శుభాకాంక్షలు

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ-2025ను గెలిచిన ఇండియా నక్రికెట్ టీమ్‌కి భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ శుభాకాంక్షలు తెఇపారు. విజేతైన ఇండియా క్రికెట్ టీమ్‌కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్రీడల అభివృద్ధికి, ఆటగాళ్ల ప్రోత్సాహానికి దక్షిణ అమెరికా దేశాలు అనుసరిస్తున్న విధానాలు మనం గమనించాలని.. భారతదేశం లోనూ అలాంటి వాతావరణాన్ని రూపొందించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి నారాయణ సూచిం చారు. ఆటగాళ్లను చిన్నప్పటి నుంచే ప్రోత్సహిస్తూ.. మెరుగైన సదుపాయాలు అందిస్తూ.. అంత ర్జాతీయ స్థాయిలో ప్రభావం చూపేలా చేయడం ఎంతైనా అవసరమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ
బహిరంగ (వెదురు) బొంబు వేలం ప్రకటన
Rc.No.428/2021/MS4, Dt: 07.03.2025
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలుపబడిన (వెదురు) బొంబు తేది: 12.03.2025 ఉదయం 11.00 గం.లకు ఐయ్యక్కపేట, మేడారం రేంజ్ వెదురు బొంబు డిపో నందు బహిరంగ వేలం నిర్వహించబడును. పూర్తి వివరములకు అటవీ క్షేత్రాధికారి, మేడారం గారిని (ఫోన్ నెంబర్: 7382447080) సంప్రదించగలరు.
సం/- డివిజనల్ అటవీ అధికారి, ములుగు
DIPR.No.11139-PP/CL/Advt/1/2024-25, తేది: 10.03.2025

వార్త

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.

-వి.జాన్సన్

# ఛాంపియన్స్ మనమే!


క్రికెట్ ప్రపంచంలో భారత జట్టు అజేయంగా నిలుస్తూ వస్తోంది. సుమారు 12ఏళ్ల తర్వాత మళ్లీ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని సాధించి తిరుగులేని జట్టుగా నిలిచింది. దుబాయిలో న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠను కలిగించింది. ఒకదశలో వరుసవెంబడి వికెట్లు కోల్పోవడంతో అభిమానులకు అసహనం కూడాపెరిగింది. తిరిగి నిలదొక్కుకున్న టీమిండియా చివరివరకూ ఎంతో జాగ్రత్తగా ప్రత్యర్థి ఎత్తులన్నింటినీ చిత్తుచేస్తూ ముందుకు సాగింది. చివరకు ఛాంపియన్స్ మేమే అని నిరూపించింది. నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచిభారత క్రికెట్ సత్తాను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. తొలుత న్యూజిలాండ్ బ్యాటింగ్‌కు రావడంతో మన స్పిన్నర్లు చెలరేగిపోయారు. కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఇలా ఒకరేమిటి అందరూ సమిష్టిగా వ్యూహాలను అమలుచేసారు. అందువల్లనే ఏడు వికెట్లు నష్టపోయినా చివరివరకూ నెగ్గుకు వస్తామనుకున్న కివీస్ జట్టును 251 పరుగులకే కట్టడి చేయగలిగారు. ఛేదనలో భారత్ ఆటతీరు చూసిన తర్వాత 49వ ఓవర్‌వరకూ వేచిచూడాల్సి వస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. కివీస్ బ్యాటర్లను కట్టడిచేసిన అదే పిచ్‌పై రోహిత్ చెలరేగి ఆడాడు. మరోవైపు శుభ్‌మన్‌గిల్‌అండగా నిలిచి ధనాధన్ బ్యాటింగ్‌తో ఇద్దరూ ఆసక్తిని మరింత పెంచారు. 19 ఓవర్లకు వచ్చేసరికి వికెట్ నష్టపోకుండా 105పరుగులు చేసిన టీమిండియా ఒక్కసారిగా ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చివేసింది. కివీస్ ఫీల్డర్ పిలిప్స్ అందుకున్న అద్భుత క్యాచ్‌కు గిల్ ఔట్ కావడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. భారత స్పిన్ మాయాజాలాన్నే కివీస్ కూడా అనుసరించింది. రన్‌మెషిన్‌గా పేరుపొందినవిరాట్ కోహ్లీ ఒకేఒక్క పరుగుచేసి క్రీజును వీడటంతో అభిమానుల్లో ఒకింత అసహనం, మరోవైపు ఉత్కంఠ పెరిగిపోయింది. భారత్‌పై ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. పరుగులు రావడం కష్టంగా మారింది. రచిన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన రోహిత్ ఏకంగా స్టంపౌట్ కావడంతో టీమిండియా ఛేదన అత్యంత కష్టంగా మారిపోయింది. అలాంటి స్థితిలో భారత్‌ను శ్రేయస్ తన ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు. కివీస్ స్పిన్ పరీక్షకు ఎదురొడ్డినిలిచి అక్షర్‌తో కలిసి జట్టును ముందుకు నడిపించాడు. ఇద్దరి భాగస్వామ్యం కొంత జట్టును కుదుటపరిచిందని భావిస్తున్న తరుణంలో ఇద్దరూ కొద్దితేడాలో ఔట్ అయ్యారు. దీనితో టీమిండియా ఫాన్స్‌కు మరింతగా నిరాశపెరిగింది. చివరికి హార్దిక్ పాండ్యా, కెఎల్ రాహుల్‌ల భాగస్వామ్యం జట్టును విజయతీరాలకు చేర్చింది. లక్ష్యసాధనలో మొనగాడనిపించిన రాహుల్, కోహ్లీలు కొద్దితేడాలతోనే పెవిలియన్ చేరుకోవడం కివీస్ స్పిన్నర్లకు బలం పెరిగింది. కివీస్ కచ్చితంగా మనమే గెలుస్తామన్న ధీమాతో ఉన్న తరుణంలో వచ్చిన శ్రేయాస్ తడబడినా కివీస్ స్పిన్‌ఉచ్చును తట్టుకుని నిలబడ్డాడు. మరోవైపు అతనికి అక్షర్‌నుంచి పూర్తి సహకారం వచ్చింది. సాధించాల్సిన రన్‌రేట్‌ను క్రమేపీ పెంచుతూపోయారు. కివీస్ బౌలర్ శాంట్నర్ ఓవర్‌లో శ్రేయాస్ ఔట్ కావడంతో మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. 42వ ఓవర్‌లో జట్టుస్కోరు 203పరుగుల వద్ద అక్షర్ కూడా నిష్క్రమించడంతో ఇక కష్టమే అనిభావించారు. కాని చివరి ఎనిమిది ఓవర్లలోనే పరుగులు చేయాల్సినస్థితిలో ఒత్తిడిని తట్టుకుంటూ కెఎల్ రాహుల్, హార్ధిక్‌పాండ్యాలు అద్భుతంగా బ్యాటింగ్ చేసారు. చివరి రెండుఓవర్లలో 12 పరుగులు అవసరమయ్యాయి. హార్ధిక్ ఔట్ అయినా రవీంద్రజడేజాతో కలిసి రాహుల్ జట్టును ధైర్యంగా నడిపించాడు. 49వ ఓవర్‌లో చివరిబంతికి జడేజా ఫోర్‌కొట్టడంతో భారత్ లక్ష్యం సులువుగా ఛేదించి విజేతగా నిలిచింది. పాకిస్థాన్‌లో ఆడేందుకు భారత్ జట్టుసుముఖత వ్యక్తం చేయకపోవడంతో భారత్‌జట్టు తన మ్యాచ్‌లన్నింటినీ దుబాయ్‌లోనే ఆడింది. ట్రోఫీ ఆసాంతం భారత్ పక్కా ప్రణాళికలతో ముందుకువెళ్లింది. దుబాయ్‌స్టేడియం పిచ్, వాతావరణ పరిస్థితులపై పూర్తిఅవగాహన ఉన్న టీమిండియా అందుకు తగినట్లుగానే జట్టు కూర్పుతో ముందుకుపోయింది. తొలిరెండు మ్యాచ్‌ల్లో ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లను దించిన భారత్ ఆ తర్వాత నలుగురిని ఆడించింది. ఓవైపు కివీస్‌జట్టు ముగ్గురుపేసర్లతో బౌలింగ్‌కు దించితేమనజట్టు కనీసం స్పెషలిస్టు పేసర్‌నుకూడా ఎంచుకోకపోవడం ఏమిటన్న సందేహాలు ఫ్యాన్స్‌లో వెల్లువెత్తాయి. జట్టు చివరి ఓవర్‌కు చేరుకునేసరికి భారత్ ఎంచుకున్న వ్యూహమే సరైనదని స్పష్టమైంది. డెత్ ఓవర్లలో స్పిన్నర్ కుల్‌దీప్‌తో బౌలింగ్‌చేయించి భారత్ పక్కాఫలితాలు రాబట్టింది. కొన్నాళ్లక్రితం వరకూజట్టులో స్థానమే సందేహంగా మారిన ఆటగాళ్ల శ్రేయాస్ అయ్యర్, అక్షర్‌పటేల్‌లు. కానీఇప్పుడు జట్టులో ఎంతో విలువైన క్రికెటర్లుగా మారారు. ఈ ట్రోఫీ వీరిని ఛాంపియన్లుగా మార్చేసింది. మిడిలార్డర్‌లో శ్రేయాస్ కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇక అక్షర్‌అయితే బంతితోనే కాకుండా బ్యాటుతో కూడా చెలరేగిపోయాడు. పొదుపుగా బౌలింగ్ చేస్తూ ఐదు మ్యాచ్‌ల్లో ఐదువికెట్లు తీసాడు. బ్యాటింగ్‌లో కూడ చివరిమూడు మ్యాచ్‌ల్లో తన సత్తా చూపించాడు. బ్యాటింగ్‌లో కూడా ఎవరు ఏస్థానంలో ఎక్కడ ఎలాఆడాలన్న క్రమంలో కూడా స్పష్టమైన ప్రణాళికతో టీమిండియా కొనసాగింది. మొత్తంగా అటు బ్యాటింగ్‌లోనూ, ఇటుబౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లోను భారత్ ఈ ట్రోఫీలో తామేఛాంపియన్స్ అని మరోసారి రుజువు చేసుకోగలిగింది. భారత్‌కు వరుసగా ఇది రెండో ఐసిసి టైటిల్. గత ఏడాది టి20 ప్రపంచకప్‌ను భారత్‌కు బహుమతిగా ఇచ్చిన టీమిండియా ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీని కానుకగా ఇచ్చింది. జయహో టీమిండియా..జయహోభారత్.

ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఈ మూడింటితోనే చాలా మంది సామాన్యులు నాయకులైనారు.



మహాత్మాగాంధీ

మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహ బలం వాటంతట అవే సమకూరుతాయి.



థామస్ ఫుల్లర్

## ప్రజావాక్కు



### రాష్ట్రమంతా అమలు చేయాలి

**ఆంధ్రప్రదేశ్‌లో** గత అసెంబ్లీ ఎన్నికలు ముందు ప్రచారంలో భాగంగా కూటమి పార్టీలు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగాప్రయాణం అంటూ హామీనిచ్చిఓట్లు వేయించుకొని తీరా గెలిచాక ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం అందుకు కండీషన్ అప్లై అనడం దారుణం. ఇప్పుడు మహిళలకుఉచితబస్సు పథకాన్ని జిల్లాస్థాయి వరకే పరిమితం చేస్తామని చెప్పి చేతులుదులుపుకుంది. ఈమాత్రం దానికి ఇన్ని రోజులు కమిటీల పేరుతో కాలయాపన, రాష్ట్రాల పర్యటనలు ఎందుకో? ప్రభుత్వం ఇంకా ఈ పథకం పై నియమ నిబంధనలు రూపొందించనందున, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలు మాదిరిగా మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఆంధ్ర రాష్ట్రం అంతటా వర్తించేలా అమలు చేయాలి. లేదంటే మహిళాఆగ్రహం చవిచూడక తప్పదేమో.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### వినియోగదారుల హక్కులేంటి?

**అమ్మకపుదారు** ఏదైనా నాసిరకం వస్తువును అమ్మిన సందర్భంలో సరైన ఆధారాలతో వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించి, న్యాయం పొందటం. మోసపూరిత వాణిజ్యం కారణంగా నష్టపోతే పరిహారం కోరే హక్కు వినియోగదారులకి ఉంటుంది. కొన్నవస్తువుకు సంబంధించి సరైన అవగాహన పొందే హక్కు కూడా ఉంటుంది. వస్తువులు, సేవల నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత, ధర, మన్నికకు సంబంధించిన సమాచారం తెలుసుకోవచ్చు. సేవాలోపం జరిగితే బ్యాంకింగ్, వైద్యరంగం, విద్యుత్తు, రవాణా, బీమా తదితర సంస్థల పైనా వినియోగదారుల ఫోరమ్‌లో కేసులు వేయవచ్చు.

-సింగు. లక్ష్మీనారాయణ, కొత్తపల్లి, కరీంనగర్

### ప్రాంతీయ బేధాలు విస్మరించాలి

**హైదరాబాద్‌లో** నిర్మించాలనుకున్న మహిళా విశ్వ విద్యాలయం పేరు తెలంగాణా ఉద్యమ కారిణి, వీరవనిత, చాకలి ఐలమ్మ పేరు పెట్టడం ఏ మాత్రం సరిపోదు. ఈమె విద్యాలయాలకు సంబంధించిన వ్యక్తి కాదు. అత్యంత పెద్ద విద్యాసంస్థకు ఆమె పేరు పెట్టడం న్యాయంగా, శాస్త్రీయంగా ఏమాత్రం లేదు. అలాగే విప్లవ కవి గద్దర్ సినిమా ఫీల్డ్‌కు ఏ మాత్రం సంబంధం, పరిచయం లేకపోయినా ఆయన పేరున నంది అవార్డులు ఇవ్వాలనే నిర్ణయం కూడా ఏమాత్రం సరిపోలేదు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### ఎత్తిపోతల పథకం తప్పనిసరి!

**చంద్రబాబు** నాయుడు గారి ప్రతిపాదిత బనకచర్ల ఎత్తిపోతల నీటిసరఫరా వ్యవస్థపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. భిన్నాభిప్రాయాలు కంటే సాధ్యాసాధ్యాలపై ఎవరికీ విశ్వాసం కలగడం లేదు. అయితే వాస్తవాలను నిశితంగా పరిశీలిస్తే, రాయలసీమ ప్రాంతం కృష్ణా బేసిన్ పరిధిలో లేదు. ఏదైనా ఆ ప్రాంతానికి కృష్ణా మిగులు జలాలు తప్పించి వేరే అవకాశం లేదు. ఆ మిగులు జలాల లభ్యత కూడా దైవాధీనం! మరోవైపు తుంగభద్ర పరిస్థితి కూడా ఆందోళనకరమే! కనీసం శిధిలమైన పాతగేట్లు తొలగించి కొత్తగేట్లు పెట్టాలంటే ఏ ప్రభుత్వం కూడా చొరవ చూపడం లేదు! తుంగభద్ర డ్యాం పూడికలతో నీటి నిల్వసామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది! మరోవైపు తుంగభద్రడ్యామ్‌కి ఎగువన మరోడ్యామ్ నిర్మించాలన్న ఆలో చనలో కర్ణాటక ప్రభుత్వం ఉంది! అదే జరిగితే శ్రీశైలం డ్యాం పరిస్థితి కూడాఆందోళనకరమే! ఆర్థికవనరులకు మాత్రంగట్టి ప్రయత్నం జరగాల్సిందే! ఇందుకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలి.

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

### రాష్ట్రంలో నూతన విద్యా సంస్కరణలు

**ఏపి** రాష్ట్ర అధికార తెలుగు దేశం పార్టీ వివిధ శాఖల్లో పనితీరు మార్చే విధానాల్లో విద్య విధానంలో అవసరమైన మార్పులకు నిర్ణయం తీసుకున్నారు. వాటిలో అన్నిఅంశాలు చాలా విలువైనవి. అమలులో చాలా ఉన్నత ప్రమాణాలు సాధించవచ్చు. విద్యార్థులపై పుస్తకాల ఒత్తిడి తొలగింపు, మానవతా విలువల బోధన, స్వతంత్ర పోరాట వీరుల చరిత్రలు, ఫ్లాష్ కార్డులు, ఇంటి పనుల్లో పిల్లలతోడు, లింగ సమానత్వం ప్రధానమైనవి. రాజకీయ జోక్యం లేకుండా నూతన విధానంలో బోధనకు అన్ని స్థాయిలలో తృప్తిగా జరిగేటట్లు చేస్తే మన రాష్ట్ర విద్యా స్థాయి దేశంలో మంచి ప్రగతి పథంలో ఉంటుంది. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు మన బిడ్డలకు అందుతాయి.

- బొల్లోజు మేఘనాధమ్, విశాఖపట్నం

### పేట్రేగిపోతున్న అవినీతి

**తెలంగాణ**రాష్ట్రంలో ప్రభుత్వశాఖల్లో అవినీతిపెట్రేగి పోతుంది. ఏ కార్యాలయం వెళ్లిన లంచం ఇవ్వనిదే పని కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. జనవరి నెలలోనే ఇరవై మంది ఏ.సి.బికి చిక్కడం సంచలనం సృష్టించింది. ప్రజలతో నేరుగా సంబంధం ఉండేశాఖల్లో అవినీతి ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రజల్లో అవినీతిమీద అవగాహన పెరిగిన మార్పురావడంలేదు.

-కె. సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాలపల్లి జిల్లా

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేశాల మధ్య కొత్త స్నేహాలా!

*శక్తివంతమైన దేశంగా కీర్తించబడ్డ ఒకప్పటి అమెరికా ప్రస్తుతం డాలర్‌తో సహా బలహీనపడిందన్న వార్తల నేపథ్యంలో ఆర్థికంగా తనను తాను నిలదొక్కోవటానికి టారిఫ్ వ్యవహారంతోపాటు రాజకీయంగా అమెరికా ఇంకా గట్టిగానే ఉందని ఉక్రెయిన్ వ్యవహారంలో ఎన్నాళ్ల నుంచో ఉన్న సమీకరణాలు మార్చి ఈ విధంగా ప్రవర్తిస్తున్నదా అన్నది తేలాల్సిన విషయం. ఏరోస్పేస్ విషయంలో కూడా అమెరికా పై చేయిగా ఉండటానికి స్పేస్ ఎంగేజిమెంట్ విషయంలో తాము చెప్పినట్లుగా ఉండాలని భావిస్తున్నది. అందుకనే మిగతా అన్ని దేశాలూ క్లైమేట్ మార్పు విషయంలో కానీ, ఏరోస్పేస్ విషయంలో కానీ తాము సంఘటితంగా వ్యవహరించి అమెరికా తెరబాటు నియంతృత్వ ధోరణిని 'అరికట్టడానికి' సమిష్టి చర్యలు తీసుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. విదేశాంగ విధానాలు మారటం ఈ మధ్య అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుల అంచనాలకు భిన్నంగా జరుగుతూనే ఉన్నాయి.*



రావులపాటి సీతారాంరావు

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎవరి మాట వినే పరిస్థితి లేదు. సంకేతాలు ఆ విధంగానే ఉన్నాయి. ట్రంప్ రాజకీయాల్లోకి రాకముందు బిజినెస్ మాన్‌గా ఉన్నారని అంటారు. రాజకీయాలను అందుకనే బిజినెస్ తరహా చేస్తున్నారనే అపవాదు కూడా ప్రబలంగా వినపడుతున్నది. ఈ మధ్య ఉక్రెయిన్ నేత జెలెన్‌స్కీతో ట్రంప్ సమావేశం రసాభాసగా మారింది. మీడియా సమక్షంలో వైట్‌హౌస్‌లో గొడవ వీధి పోట్లాటను మరిపించింది. మొత్తానికి మూడవ ప్రపంచ యుద్ధం తెచ్చేట్లు ఉన్నావని జెలెన్‌స్కీని బెదరించి, మేమిచ్చిన డాలర్లు కక్కమని వైస్ ప్రెసిడెంట్‌తోసహా ఒత్తిడితెచ్చి, ఒకదారికి తెచ్చినట్లుంది. జెలెన్‌స్కీ కొన్ని రోజులు హీరోగా ఒక వెలుగు వెలిగాడు కానీ చిచ్చుబుడ్డి ఆరిన తర్వాత మా ఖనిజ సంపద మీకిస్తాం, మీతోనే మా భవిష్యత్తు అని లొంగిపోయాడు. నీవు యుద్ధం తెస్తున్నావ్ అని బెదిరించడం ట్రంప్ నేర్పరితనం అని అనుకోక తప్పదు. యుద్ధం ముసుగుతో సంధికి దిగేట్లు జెలెన్‌స్కీ లాంటి నాయకులను అందునా అప్పటి వరకు అమెరికాతో ఉన్న నాయకులను కూడా లొంగుబాటు దిశగా పయనించేట్లు చేయడం ట్రంప్ యుద్ధం బెదరింపుతో శాంతి నాటకం ఆడుతున్నట్లుగా ఉంది. రష్యా మొదటి నుంచీ అమెరికా శత్రురాజ్యమే. ట్రంప్ రాకతో ప్రస్తుతం అమెరికా మిత్ర దేశంగా మారే సూచనలు కనపడుతున్నాయి. జెలెన్‌స్కీ దేశ ఖనిజసంపద ఇద్దరూ పంచుకోవటమా, ఇద్దరుతో ఒకరికే దక్కేతీరులో స్నేహపూర్వక వాతావరణం కల్పించి రాజకీయం చేయటమా? కొన్ని రోజుల్లో తేలే అంశంగా మారింది. ఎలుకపోరు పిల్లి తీర్చినట్లుగా చైనా అదే ఖనిజసంపద కోసం పొంచి వున్న సంగతీ ప్రపంచ దేశాలు గమనిస్తూనే ఉన్నాయి. చూడాలి ఈ మూడు అగ్రరాజ్యాల మూడు ముక్కలాట! ఉక్రెయిన్ దేశం ఈ అగ్రరాజ్యాల ఆటలో పావుగా మారింది. ట్రంప్ రెండవసారి పదివిలోకి రాక మునుపు ప్రెసిడెంట్ జోబైడెన్ జెలెన్‌స్కీకి నాటో దేశాలతో సహా సహాయం చేసాడు. నాటోలో చేరి జెలెన్‌స్కీ తను రష్యాను ఎదిరించడంలో బలంగా మారాలని ఆశించాడు. ఆయుధాలు, మిలటరీ ట్రయినింగ్ సహా అన్ని సదుపాయాలు అమెరికాతోపాటు యూరప్ దేశాలు ఉక్రెయిన్‌కు ఇచ్చాయి. ఆ బలంతోనే రష్యాను దీటుగా ఎదురించాడు కానీ పూర్తి విజయాన్ని సాధించలేకపోయాడు. అది కష్టం కూడా. ట్రంప్ రాకతో ఇదివరకటి సదుపాయాలు యుద్ధంలో పై చేయి సాధించటానికి కావల్సిన బలం ఒక్కసారిగా జెలెన్‌స్కీ కోల్పోయాడు. అందుకే వైట్‌హౌస్‌లో మొన్నటి సమావేశంలో బహిరంగంగా ఎదిరించినప్పటికిని, తిరిగి ట్రంప్‌ముందు లొంగిపోక తప్పలేదు. లేకపోతే ఉక్రెయిన్ మనుగడే కష్టసాధ్యమని జెలెన్‌స్కీకి తెలుసు. ఇప్పటి పరిస్థితులలో ఉక్రెయిన్, యూరప్ దేశాలు, అమెరికా చెప్పినట్లు రష్యాతో సహకరించక తప్పదు. అయితే కొన్ని నెలల క్రిందటి వరకు



ఉక్రెయిన్‌ను సపోర్టు చేసిన అమెరికా, ఇప్పుడు ట్రంప్ రాజకీయంతో జెలెన్‌స్కీని వెనక్కు నెట్టేస్తే, అమెరికా దేశానికి అంతర్జాతీయంగా ఉన్న పేరునూ, గౌరవాన్ని తృణప్రాయంగా వదిలేసినట్లవుతుంది. అందుకే జెలెన్‌స్కీ తనను ఛాలెంజ్ చేసే రీతిలో మాట్లాడినా, తనూ మాటకు మాట అన్నా, అవసరమనుకొని జెలెన్‌స్కీ వెనక్కు తగ్గి వస్తే మాట్లాడుతాం అని చెప్పటం అమెరికా దేశ గౌరవానికి భవిష్యత్తులో అంతర్జాతీయంగా 'మాట నిలబెట్టుకోలేని దేశం' అన్న మాట రాకుండా ఉండటానికే! ఇరు దేశాలూ ఈ విషయంలో తగ్గినట్లే అవుతుంది. రష్యాతో శాంతి ఒడంబడిక అమెరికా వల్ల జరుగుతే ట్రంప్‌కు మంచిదే అవుతుంది. పెను మార్పులు అంతర్జాతీయంగా సంభవిస్తున్న వేళ మరొకమార్పు చాప కింద నీరులా ఉండి ఉంటుంది అన్న అనుమానం ఈమధ్య వచ్చిన సంకేతంతో అంతర్జాతీయ వ్యవహార నిపుణులు రాబోయే పరిణామాలను అంచనా వేయడానికి ప్రయత్నిస్తున్నారు. అమెరికా, రష్యాలు దగ్గరవుతున్నవేళ, యూరప్‌తో పాటు మెక్సికో కెనడా లాంటి దేశాలు అమెరికా వైఖరిపై కినుకవహిస్తున్న వేళ, చైనా గుట్టుచప్పుడు కాకుండా భారతదేశానికి స్నేహహస్తం చాచి మనం దగ్గరవుదాం అన్న సంకేతాన్ని పంపినట్లు కొన్ని వార్తలు వస్తున్నాయి. ఆ నేపథ్యంలో భారతదేశం పాక్ ఆక్యుపైడ్ కాశ్మీర్ (పి.ఓ.కె) ఇచ్చి తీరాల్సిందే అని పాకిస్థాన్‌ను డిమాండ్ చేస్తున్న వార్తకూడా వెలుగులోకి వచ్చింది. రష్యా కానీ అమెరికా కాని పాకిస్థాన్‌తో అన్ని సందర్భాలలో కాకుండా కొన్ని కొన్ని క్లిష్టమైన సందర్భాలలో భారతదేశాన్ని ఇరుకునపెట్టే అంశంలో దగ్గరయిన మాటనిజం అని భావించినప్పుడు, చైనా ఒకవిధంగా భారతదేశానికి స్నేహహస్తం అందించకపోగా పాకిస్థాన్‌కు దగ్గరయిన సంఘటనలున్నాయి. పి.ఓ.కే సమస్య ఎన్నేళ్ల నుంచో ఉన్నది. ఇప్పుడు రష్యా అమెరికాలు దగ్గరవుతున్న వేళ (ఉక్రెయిన్ విషయాన్ని అడ్డుపెట్టుకొని) చైనా కూడా తన శక్తి సామర్థ్యాలు నిలబెట్టుకోవటమే కాకుండా అందరికీ స్పష్టపర్చడానికి ఇండియాను దగ్గరకు తీసి పి.ఓ.కె సమస్యలో పాకిస్థాన్‌పట్ల ఏవిధంగా అమెరికా, రష్యా ప్రవర్తిస్తాయో చూడటానికి వేసిన ఎత్తుగడా అన్నది తెలియడానికి కొంత సమయం పట్టవచ్చు. కానీ ఆ విధంగా అంచనాలు వేయడంలో తప్పులేదు. ఏ దేశమూ ఏ దేశానికీ శాశ్వతంగా శత్రువు కాదు. మిత్రుడూ కాదు. కాలమాన అవసరాలూ, సమీకరణాలను బట్టి స్నేహసంబంధాలు మారుతూనే ఉంటాయి. అమెరికా ఎత్తుగడలు అర్థం చేసుకోవాల్సిన అవసరం అన్ని దేశాలకూ ఏర్పడుతున్నది. శక్తివంతమైన దేశంగా కీర్తించబడ్డ ఒకప్పటి అమెరికా ప్రస్తుతం డాలర్‌తో సహా బలహీనపడిందన్న వార్తల నేపథ్యంలో ఆర్థికంగా తనను తాను నిలదొక్కోవటానికి టారిఫ్ వ్యవహారంతోపాటు రాజకీయంగా అమెరికా ఇంకా గట్టిగానే ఉందని ఉక్రెయిన్ వ్యవహారంలో ఎన్నాళ్ల నుంచో ఉన్న సమీకరణాలు మార్చి ఈ విధంగా ప్రవర్తిస్తున్నదా అన్నది తేలాల్సిన విషయం. ఏరోస్పేస్ విషయంలో కూడా అమెరికా పై చేయిగా ఉండటానికి స్పేస్ ఎంగేజిమెంట్ విషయంలో తాము చెప్పినట్లుగాఉండాలని భావిస్తున్నది. అందుకనే మిగతా అన్ని దేశాలూ క్లైమేట్ మార్పు విషయంలో కానీ, ఏరోస్పేస్ విషయంలో కానీతాము సంఘటితంగా వ్యవహరించి అమెరికా తెరబాటు నియంతృత్వ ధోరణిని 'అరికట్టడానికి' సమిష్టి చర్యలు తీసుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. విదేశాంగ విధానాలు మారటం ఈ మధ్య అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుల అంచనాలకు భిన్నంగా జరుగుతూనే ఉన్నాయి. •

# నీటి పొదుపుపై అవగాహన అవసరం


డాక్టర్ మోటె చిరంజీవి

వేసవికాలం ప్రారంభంలోనే నీటి ఎద్దడి మొదలైంది. నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించకపోతే సంక్షేమం ఎదుర్కోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి వృధాను అరికట్టేందుకు ప్రభుత్వం అనేక రకాల చర్యలను తీసుకుంటుంది. నీటిని నిల్వ చేస్తే భవిష్యత్ తరాలు ఎటువంటి సమస్యలను ఎదుర్కోరు. అందరూ చాలా సంతోషంగా ఉంటారు. ఇప్పుడు వృధా అయితే భవిష్యత్తులో నీరు ఉండదు. మనిషి నీరు లేకుండా జీవించలేడు. ఒక చుక్క నీరు మనకు చాలా విలువైనది కాబట్టి మనం నీటిని వృథా చేయకూడదు. మురుగునీటిని కాలువలు, సముద్రాలలోకి విడుదల చేయకూడదు. నీటి ప్రాముఖ్యతను మన పిల్లలకు తెలియజేప్పాలి. నీరు లేకపోతే పంట ఉండదు. పంట లేకపోతే మనకు ఆహారం లేదు. కాబట్టి నీటిని సరిగ్గా వాడాలి. మన దేశవ్యవసాయ రైతు జనాభాలో 85 శాతం మంది వీరేఉన్నారు. చిన్న, మధ్యతరహా వ్యవసాయ రైతుల జీవన విధానంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నా 84శాతం మంది రైతులు తమ భూమిని అమ్ముకోడానికి గానీ, ఇతర సంపాదన మార్గాల వైపు మళ్లడానికి గానీ ఇష్టపడడం లేదు. గ్రామీణ భారతంలో ఇటువంటి రైతులు 85శాతం మంది తమ జీవన విధానం కోసం భూగర్భ జలాలపైనే ఆధారపడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటడం వల్ల వచ్చే ప్రమాదాలపై వీరికి అవగాహన ఉండడం లేదు. పంజాబ్ రాష్ట్రంలో 76శాతం, రాజస్థాన్‌లో 63 శాతం, తమిళనాడులో 40శాతం వరకు భూగర్భ జలాలను అత్యధికంగా వాడడం జరుగుతోంది. 2020లో దేశంలో గృహ అవసరాల కోసం 54,000 బిలియన్ లీటర్ల నీరు అవసరమైనట్టు అంచనా. వ్యవసాయ రంగానికి 14 రెట్లు ఎక్కువ అవసరంఅంటే 7,76,000 బిలియన్ లీటర్లనీరు అవసరం. కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సిఇఇ డబ్లు) అంచనా ప్రకారం 2030 నాటికి వ్యవసాయ రంగా నికి దేశంలోని జిల్లాల్లో 87శాతం డిమాండ్ ఉంటుంది. కొన్ని వారాలపాటు ఆహారం లేకుండా ఉండగలం కానీ, నీరు లేకుండా, నీటిని తాగకుండా మానవులు ఎక్కువ రోజులు జీవించలేరు. ఇంతటి ప్రాధాన్యత కలిగినటువంటి తాగునీరు నేటి పరిస్థితులలో కలుషితమవుతుంది. ముఖ్యంగా భూ కాలుష్యం ద్వారా కలుషితమై ఆ నీటిని మానవులు తాగిన ప్పుడు వారు అనారోగ్యాల బారినపడుతున్నారు. ముఖ్యంగా భూమిలో ఉన్నటువంటి నీటి టిడిఎస్ 50 నుండి 150 పిపిఎంగా ఉండాలి. దాని పీహెచ్ విలువ 7గా ఉండాలి. పట్టణీకరణ, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయంలో ఉప యోగించే ఎరువులు క్రిమిసంహారక మందులు, డిటర్జెంట్స్, ఇంట్లో ఉన్న ప్లాస్టిక్, చెత్త, మొదలైనవి అన్ని కూడా భూమి లోపలికి చేరి కలుషితం చేసి, నీటిని కూడా కలుషితం చేస్తున్నాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం ప్రపంచ జనాభాలో ఎక్కువ శాతం కలుషితమైన నీటిని తాగడం వల్లనే అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. నీటిలోవ్యాధులను కలుగజేసే సూక్ష్మజీవులు, వైరస్‌లు, బ్యాక్టీరియా వంటివి చేరడంవల్ల ఆ నీటిని తాగినప్పుడు టైఫాయిడ్, కలరా, అతిసారం, హైపటైటిస్, కాలేయ సంబంధిత, జీర్ణ సంబంధిత, మూత్రపిండానికి సంబంధించిన వ్యాధులు కలుగుతాయి. ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మందికి పైగా సురక్షితమైన త్రాగునీరు అందుబాటులో లేకపోవడం వల్ల మరణిస్తున్నారని నీతి ఆయోగ్ కంపోసిట్ మేనేజ్మెంట్ ఇండెక్స్ నివేదిక తెలిపింది. 2030 నాటికి దేశ జనాభాలో 40శాతం అనగా 60 కోట్ల మందిప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోబోతున్నారని నివేదించింది. దీన్ని నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, సంవత్సరాల తరబడి అక్రమణల కారణంగా నీటి వనరులు తగ్గిపోతున్నాయని, నగరాలు, పట్టణాలలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. అందుకోసం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ 4294 ప్రదేశాలలో నదులు, సరస్సులు, ట్యాంకులు, చెరువులు, నేషనల్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ప్రోగ్రాం కింద ఉపరితల నీరు భూగర్భ జలాల నీటి నాణ్యతను పర్యవేక్షిస్తూ నాణ్యమైన త్రాగునీటిని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తుంది. నీటి పొదుపులో స్వీయ నియంత్రణ అవసరం. ట్యాంకుల్లో నీరు నిండగానే బోరు ఆపాలి. వీలైనంతవరకు వేసవిలో వాహనాలకు వాటర్ సర్వీసింగ్ చేయించకూడదు. శుభకార్యాల్లో తప్పనిసరిగా నీటి పొదుపునకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీరు భూమిలోకి చేరేలా ఇల్లు, పార్కులు, ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలి. మురుగువ్యర్థాలను నీటి వనరుల్లోకి విడుదల చేయడానికి ముందు వాటిని శుద్ధి చేయడం మంచిది. సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేసే దిశగా ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాలి. పరిశ్రమల నుండి వచ్చేటువంటి వ్యర్థాలలో రసాయన పదార్థాల శుద్ధీకరణ చేయాలి. ఇవన్నీ కేవలం ప్రభుత్వాలు చేయలేవు ప్రజలు సామాజిక బాధ్యత కలిగి ఉండి కంకణం కట్టుకొని పని చేస్తేనే సాధ్యమవుతుంది. అలా చేస్తేనే సురక్షితమైనటువంటి నీటిని భవిష్యత్ తరాలకు అందించవచ్చు. •

# డీలిమిటేషన్‌తో 'సౌత్'కు అన్యాయమా?

బి. మధుపాళి

ప్రస్తుతం తమిళనాడు సిఎం స్టాలిన్ తమ రాష్ట్ర ప్రజలను, వివాహిత యువతను వెంటనే పిల్లల్ని కనండి, లేదంటే మనకు తక్కువ ఎంపీ సీట్లు కేటాయిస్తారంటూ ప్రకటన చేసే వరకు పరిస్థితులు దిగజారడం గమనార్హం. అదే విధంగా జాతీయ హిందీ భాషను బలవంతంగా దక్షిణ భారత రాష్ట్రాలపై రుద్దడం వల్ల స్థానిక భాషలు అంతరిస్తాయని, హిందీని తప్పనిసరి చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తుండడం చూస్తున్నాం. దీనికి తోడుగా 2026లో చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రయోగం పూర్తి అయితే దక్షిణ భారతంతో పోల్చితే ఉత్తర భారతంలో పార్లమెంట్/అసెంబ్లీ స్థానాలు భారీగా పెరుగుతాయనే ఆందోళనలో దక్షిణ భారత పార్టీలు, పౌరసమాజం మునిగిపోతున్నది. ఎక్కడ చూసినా డీలిమిటేషన్ చర్చ జరుగుతున్నది. డీలిమిటేషన్ అమలు చేస్తే జనాభా ప్రాతిపదిక కుటుంబ నియంత్రణ పాటించని ఉత్తర భారతంలో ఎంపీ సీట్లు అతిగా పెరగడం, కుటుంబ నియంత్రణతో జనాభా పెరుగుదలను అదుపులో పెట్టుకున్న దక్షిణ భారత రాష్ట్రాల్లో ఎంపీ/ఎంఎల్ఏ సీట్లు తగ్గడం జరగవచ్చనే అనుమానాలను కేంద్ర ప్రభుత్వం తాజాగా కొట్టిపారేసినప్పటికీ దక్షిణ భారతం దీని పట్ల పలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పదేళ్లకు ఒకసారి జనగనణ తర్వాత జనాభా ప్రాతిపదికన రాష్ట్రాల పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు, నియోజకవర్గ ప్రాంతాలను పునర్విభజన చేసే ప్రక్రియను డీలిమిటేషన్ అని పిలుస్తున్నాం. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలకు అధిక నియోజక వర్గాలు, తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలకు తక్కువ స్థానాలు కేటాయించడం జరుగుతూ వస్తున్నది. డీలిమిటేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ స్థానాలు కూడా పునర్ నిర్వచించబడతాయని తెలుసుకోవాలి. రాజ్యాంగంలోకి ఆర్టికల్ 82,170 ప్రకారం, పార్లమెంట్‌లో చట్టంచేసి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే స్వయం ప్రతిపత్తిగల డీలిమిటేషన్ కమీషన్" ద్వారా ప్రతి జనగణన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన చేయడం జరుగుతుంది. ఇప్పటివరకు 1951, 1961, 1971లలో జనగణన వరుసగా 36.1 కోట్లు, 43.9 కోట్లు, 54.8 కోట్ల జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేయడంతో పార్లమెంట్ స్థానాలు 494, 522, 543 వరకు పెంచడం జరిగింది. 1976లో కుటుంబ నియంత్రణ అమలును పెద్ద ఎత్తున చేపట్టిన నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్ల వరకు పొడిగించడం జరిగింది. జనాభా నియంత్రించని రాష్ట్రాలకు అధిక నియోజకవర్గాలు కేటాయించాల్సి వస్తుందనే కారణంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణతో డీలిమిటేషన్ ప్రక్రియను 25 ఏండ్లవరకు, అనగా 2000 వరకు పొడిగించడం జరగడం చూసాం. 2001 సంవత్సరంలో 84వ, 2003లో 87వ రాజ్యాంగ సవరణతో తిరిగి మరోసారి డీలిమిటేషన్ ఎక్సర్‌సైజ్‌ను మరో 25 ఏండ్ల వరకు, అనగా




2026 వరకు పొడిగించారు. అనగా 1971 తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియను 50ఏండ్ల వరకు పొడిగించడం జరిగిందని తెలుసుకోవాలి. 2026లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయితే 141 కోట్ల జనాభాకు పార్లమెంట్ స్థానాలు 753 వరకు పెరగవచ్చని అర్థం అవుతున్నది. ఇప్పుడు ఉన్నఎంపీ స్థానాల కన్న 210 స్థానాలు పెరుగుతాయని, ఇవికుటుంబ నియంత్రణ పాటించని అధిక జనాభా కలిగిన యూపీ, బీహార్ లాంటి రాష్ట్రాల్లో ఎంపీస్థానాలు అధికంగా పెరగవచ్చని దక్షిణ భారతం భయపడుతున్నది. కుటుంబ నియంత్రణను పాటించి జనాభాను నియంత్రించిన దక్షిణ భారత రాష్ట్రాలను డీలిమిటేషన్ వల్ల అన్యాయం జరుగుతుందని సౌత్ ఇండియా గళం పెంచడం సముచితంగా, సమర్థనీయంగా కనిపిస్తున్నది. 2026లో జనగణన చేపడితే2031 వరకు పూర్తి కావడం, ఆ తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియ అమలు చేయడం జరగవచ్చు. దీనితో పాటు మహిళలకు 33శాతం ఎంపీ స్థానాలు కేటాయించడం కూడా డీలిమిటేషన్‌తో పూర్తి అవుతుంది. ప్రస్తుతం దక్షిణ భారతంలో 24 శాతం అనగా 129 ఎంపీ స్థానాలు (543 మొత్తంస్థానాలు) ఉన్నాయి. తెలంగాణలో 17, ఏపీలో 25, కేరళలో 20, తమిళనాడులో 39, కర్ణాటకలో 28 ఏంపీస్థానాలున్నాయి. ప్రతి ఎంపీ స్థానానికి 20 లక్షల జనాభాను నిర్ణయించి 2026లో డీలిమిటేషన్ చేసిన యెడల తెలంగాణలో 20, ఏపికి 28, కేరళలో 19, తమిళనాడులో 41, కర్ణాటకలో 36 సీట్లు మాత్రమే కేటాయించడం జరుగుతుంది. అనగా దక్షిణ భారతంలో ఎంపీ స్థానాలు 129నుంచి 144 వరకు, అనగా 15 సీట్లు మాత్రమే పెరుగుతాయని దక్షిణ భారతం ఆవేశపడుతున్నది. 2026 డీలిమిటేషన్ అమలుతో తెలంగాణలో 03, ఏపీలో 03, తమిళనాడులో 02, కర్ణాటకలో 08 ఏంపీ స్థానాలు పెరగడం, కేరళలో మాత్రం 01 ఏంపీ స్థానం తగ్గవచ్చని తెలుస్తున్నది. దేశవ్యాప్త 753 ఎంపీ స్థానాల్లో 19 శాతం (24 శాతం నుంచి 19 శాతానికి 5 శాతం పడిపోవడం) నియోజకవర్గాలు మాత్రమే దక్షిణాది రాష్ట్రాల్లో పెరగడం జరగవచ్చు. 2026 జనగణన ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ అమలు అయితే యూపీలోఎంపీ స్థానాలు ప్రస్తుత 80 నుంచి 128 వరకు(పెరుగుదల 48), బీహార్‌లో 40 నుంచి 70 వరకు(పెరుగుదల 30), మధ్యప్రదేశ్‌లో 29నుంచి 47వరకు(పెరుగుదల 18), మహారాష్ట్రంలో 48నుంచి 68వరకు(పెరుగుదల 20), రాజస్థాన్‌లో 25 నుంచి 44వరకు(పెరుగుదల 19) నియోజకవర్గాలు పెరుగుతాయి. జనాభాను నియంత్రించిన పుణ్యానికి బహుమతిగా దక్షిణాదికి ఎంపీ సీట్లు తగ్గడం, జనాభాను అదుపు చేయని ఉత్తర భారతానికి అధిక ఎంపీ సీట్లు కేటాయించడం జరిగితే దక్షిణ ఉత్తర భారతాల మధ్య విభేదాలు పెరగడం, దక్షిణ భారతాన్ని ఒక దేశంగా విభజించాలని ప్రతిపాదనలు కూడా బలపడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశాభివృద్ధిలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న దక్షిణాది మెడపై డీలిమిటేషన్ కత్తిచూపితే రెండు ప్రాంతాల మధ్య ఘర్షణ వాతావరణం మొలకెత్తడం తప్పనిసరి కావచ్చు. దేశ హితం కోరే రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడానికి బదులు డీలిమిటేషన్ వేదికగా అన్యాయం చేయడం విచారకరం, అభ్యంతరకరం కూడా. •

# సిరియాలో ముదిరిన అంతర్యుద్ధం

## 48 గంటల్లో 745 ప్రతీకార హత్యలు, వీధుల్లో ఎటుచూసినా శవాలే..



**డమాస్కస్, మార్చి 10:** సిరియాలో అంతర్యుద్ధం తీవ్రస్థాయిలో జరుగుతున్నట్లు నివేదికలు వస్తున్నాయి. గత 48 గంటల్లోనే 745 ప్రతీకార హత్యలు చోటుచేసుకొన్నాయి. చాలా ప్రాంతాల్లోని మైనారిటీలైన అలావైట్లను అణచివేసే దిశగా ఈ దాడులు జరుగుతున్నాయి. గురువారం అసత్ మద్దతుదారులపై హెచ్‌టిఎస్ ప్రభుత్వానికి అనుకూల సాయుధులు దాడులు చేయడంతో ఘర్షణలు మొదలయ్యాయి. ఈ క్రమంలో అసద్ మద్దతుదారులను వెతికి మరీ చంపుతున్నట్లు ఓ బాధితుతు వెల్లడించాడు. వీధుల్లో శవాలు పడి ఉన్నాయని మగవారిని ఇళ్ల పైకప్పు మీదకు చేర్చి కాల్చేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బనియాస్ అనే ప్రాంతంలో రోహిబ్ కమెల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి బాత్రూమ్‌లో దాక్కొని ప్రాణాలు కాపాడుకొన్నాడు. ఈ విషయాన్ని అతడే ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించాడు. 'మా పొరుగు వారిపై సాయుధ మిలిటెంట్లు దాడులు చేస్తుండటంతో మేము లైట్లు ఆర్పేసి దాకొన్నాము. వీధుల్లో మృతదేహాలున్నాయి. ఈ పిల్లలు ఏం తప్పు చేశారు. అసద్ పాలన అంతం కావడానికి వీరు కూడా మద్దతు పలికారు' అని కమెల్ వెల్లడించాడు. ఇక సమీర్ హైదర్ అనే బాధితుడు మాట్లాడుతూ తన ఇంటిలోకి సాయుధులు చొచ్చుకొచ్చి తన ఇద్దరు సోదరులు, అల్లుడిని హత్య చేసినట్లు వెల్లడించాడు. వాస్తవానికి అతడు అలావైట్ వర్గానికి చెందినా సుదీర్ఘ కాలంగా అసద్‌ను వ్యతిరేకిస్తూ వచ్చాడు. దాదాపు పదేళ్లు జైలులో గడిపాడు. ఇక రేవు నగరమైన లటాకియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. అక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కేంద్రం అధిపతి యాసిర్ సబౌహ్‌ను గుర్తుతెలియని దుండగులు కాల్చి చంపారు. అతడి ఇంటి ఎదుటే మృతదేహాన్ని పడేశారు. ఈ తీర ప్రాంత నగరంలో అలావైట్లు అత్యధికంగా ఉంటారు. ప్రస్తుతం అక్కడే అత్యధిక హింస చోటుచేసుకుంటోంది. మొత్తంగా మార్చి 6నుంచి ఈ హింసలో 973 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది.

మరోవైపు దేశంలో తాజాగా చెలరేగిన హింసపై దర్యాప్తు చేస్తామని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా ఓ విడియో సందేశంలో పేర్కొన్నారు. అదే సమయంలో అసద్ వర్గానికి చెందినవారు, విదేశీ శక్తుల కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. ప్రస్తుతం తాము సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నామన్నారు. సరికొత్త ముప్పును తాము ఎదుర్కొంటున్నామన్నారు. తమ దేశాన్ని అంతర్యుద్ధం దిశగా లాగుతున్నారన్నారు.

సిరియాలో అలావైట్లు మతపరమైన మైనారిటీలు దేశ జనాభాలో వారు 12 శాతం ఉంటారు. వారి మూలాలు షియా ముస్లింలలో ఉన్నాయి. అయితే వారి విశ్వాసాలు, పద్ధతులు భిన్నంగా ఉంటాయి. చారిత్రకంగా చూస్తే అలావైట్లు సిరియా తీర ప్రాంతంలో ఉంటారు. అదీ లటాకియా, టార్టస్‌లలో అధికంగా ఉంటారు. సిరియాను ఐదుదశాబ్దాలపాటు పాలించిన అసద్ కుటుంబం అలావైట్ల వర్గానికి చెందినదే. గత డిసెంబరు వరకు వారిదే ఆధిపత్యం. అసద్ పాలనలో అలావైట్లు కీలక స్థానాల్లో కొనసాగారు. సైన్యంలో, ప్రభుత్వంలో వారిదే పైచేయి.

# లలిత్‌మోడీకి వనువాతు పౌరసత్వం రద్దు



**పోర్టువిల్లా(వనువాతు), మార్చి 10:** ప్రపంచంలోనే అత్యంత క్యాష్‌రిచ్‌లీగ్ అయిన ఐపిఎల్ వ్యవస్థాపకుడు మాజీ ఛైర్మన్ లలిత్‌మోడీ పసిఫిక్ ద్వీపదేశం అయిన వనువాతుకు మకాం మార్చేస్తున్నారన్నది తెలిసిందే. ఇందుకోసం ఆదేశానికి చెందిన గోల్డెన్ పాస్‌పోర్టును తీసుకున్నారు. కాగా ఆయనకు జారీచేసిన పౌరసత్వాన్ని రద్దు చేయాలని వనువాతు ప్రధాని జోథం నపాట్ పౌరసత్వ కమిషన్‌ను ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుపరంగా నిర్వహించిన ఇంటర్‌పోల్‌స్క్రీనింగ్‌లతోసహా అన్ని ప్రామాణికనేపథ్య తనిఖీల్లో లలిత్‌మోడీపై ఎటువంటి నేరారోపణలులేవని తేలింది. అయితే 24 గంటల్లో ఆయనపై హెచ్చరిక నోటీసు జారీచేయాలని భారత అధికారులు ఇంటర్‌పోల్‌కు రెండుసార్లు అభ్యర్థనలు చేసారని మాకు తెలిసిందని అయితే తగిన ఆధారాలు లేనందువల్ల వారి అభ్యర్థనలను ఇంటర్‌పోల్ తిరస్కరించిందని చెప్పారు. వనువాతు పౌరసత్వం పొందాలంటే చట్టబద్ధమైన కారణాలుండాలని, స్వదేశంలో దర్యాప్తును తప్పించుకోడానికి ఆతడు వనువాతు పౌరసత్వం అడుగుతున్నట్లు తెలుస్తోందని, ఆతడు చూపించిన కారణం చటబద్ధంగా లేకపోవడంతో లలిత్‌పౌరసత్వం రద్దు చేయాలని నిర్ణయించుకున్నామని వనువాతు ప్రధాని అన్నారు. వనువాతు పౌరసత్వం వస్తే తన భారత పాస్‌పోర్టును అప్పగించేందుకు లండన్‌లోని రాయబార కార్యాలయంలో ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. దీనిపై విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందిస్తూ నిబంధనలప్రకారం అధికారులు పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఆతడిపై ఉన్న కేసును చట్టపప్రకారం కొనసాగిస్తామని తెలిపింది. లలిత్‌మోడీ ఐపిఎల్‌కు బాస్‌గా ఉన్న సమయంలో కోట్లాదిరూపాయలు దుర్వినియోగంచేసాడని ఆతడిపై ఆరోపణలు ఉన్నాయి.

దీనితో భారత అధికారులకు దొర క్కుండా గత 15 ఏళ్లుగా లండన్‌లో తలదా చుకున్నాడు. ఆతడిని తిరిగి స్వదేశానికి రప్పిం చేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. లలిత్‌పసిఫిక్ ద్వీపదేశం అయిన వనువాతుకు మకాం మార్చ డానికి సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోందని, ఆదేశంలో వ్యాపారసంస్థను రిజిస్టరుచేసుకుని దేశం బయటినుంచి ఆదాయాన్ని పొందినా ఎలాంటి ఇబ్బంది ఉండదని అలాగే గిఫ్ట్, ఎస్టేట్ ట్యాక్స్‌లు లేవని అంతేకాకుండా ఆదేశం క్రిప్టో హబ్‌గా అభివృద్ధిచెందుతున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయంగా వచ్చే ఆదాయంతో సంబంధం లేకుండాదేనిపైనా అక్కడ ఆదాయపు పన్ను ఉండదు. దీర్ఘకాలిక లాభాలపైనా పన్ను ఉండదు. స్టాక్స్, రియల్‌ఎస్టేట్ వంటి వ్యాపారాలకు ఈ దేశం ఎంతో అనుకూలమని తెలుస్తోంది.

# భారత్‌తో దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకుంటాం

## కెనడా ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న మార్క్‌కార్నీ



**ఒట్టావా, మార్చి 10:** కెనడా అధికార లిబరల్ పార్టీ నూతన నేతగా ఎన్నికైన మార్క్ కార్నీ భారత్–కెనడా సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రూడో అధికారంలో ఉన్న సమయంలో భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తానన్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ విధంగా కృషి చేయడానికి ఎదురుచూస్తానని పేర్కొన్నారు. న్యూఢిల్లీతోనే కాకుండా సారూప్యత కలిగిన దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. భారత్‌పై తన వైఖరిని ఇదివరకే ఓ ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేసిన విషయం తెలిసిందే. తాజా వ్యాఖ్యలు ఆయనకు భారత్‌పై ఉన్న సానుకూల ధోరణిని వ్యక్తపరుస్తున్నాయి.

దశాబ్దాల తరబడి మిత్రదేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధలు ఇటీవల బాగా దెబ్బ తిన్నాయి. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో నిరుడు తమ పార్లమెంటులో మాట్లాడుతూ ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఏజెంట్ల హస్తం ఉండొచ్చుని చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు రాజేశాయి. భారత్ వెంటనే వాటిని తిప్పికొట్టింది. అనంతరం ఇరు దేశాలు పరస్పరం దౌత్యవేత్తలను తిప్పి పంపివేశాయి. ఆ క్రమంలోనే వరసగా జరిగిన కొన్ని పరిణామాలతో ఉభయ దేశాల దౌత్య, వాణిజ్య సంబంధాలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో కెనడాకు నూతన ప్రధానిగా అధికార లిబరల్ పార్టీ నేత మార్క్ కార్నీ ఎన్నికవ్వడం ఆయన భారత్‌కు అనుకూలంగా ఉండడంతో భవిష్యత్తులో ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# ప్రపంచ వ్యాప్తంగా నిలిచిపోయిన 'ఎక్స్' సేవలు

**వాషింగ్టన్, మార్చి 10:** అమెరికన్ టైకూన్ స్పేస్ ఎక్స్ అధినేతెలాన్ మస్క్ అధీనంలోని ప్రముఖ సోషల్‌మీడియా ఎక్స్ మాజీ ట్విట్టర్ పదేపదే సతాయిస్తోంది. సాంకేతిక లోపాలు పెరిగిపోయాయి. ఏదో ఒక సమస్యతో యూజర్లను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఎక్స్‌సేవల్లో అంతరాయం ఏర్పడటం లాగిన్ కాకపోవడం ట్వీట్స్‌మాయం కావడం వంటి సమస్యలు తలెత్తిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఎక్స్‌లో ఇలాంటి సమస్యే తలెత్తింది. సోమవారం మధ్యాహ్నం ప్రపంచ వ్యాప్తంగా ఎక్స్ సేవలు నిలిచిపోయాయి. సైట్‌ఓపెన్ కావడం లేదు. లాగిన్ అయినా యాక్సిస్ చేయలేక యూజర్లు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో వరుసగా పోస్టులు పెడుతున్నారు. సుమారు అర్థగంటనుంచి ఎక్స్‌సేవలు స్తంభించిపోయాయని చెపుతున్నారు. ఎక్స్ సైట్‌ఓపెన్‌చేస్తే స్క్రీన్‌పై సంథింగ్ వెంట్ రాంగ్ ప్లీజ్ ట్రై అగైన్ అని సందేశం వస్తోందని యూజర్లు వాపోయారు. డౌన్ డిటెక్టర్ నివేదిక ప్రకారం భారత్‌లో రెండువేలమంది అమెరికాలో 18వేల మంది యుకెలో పదివేలమంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఎక్స్ అంతరాయానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. చాలా మంది యూజర్లు సర్వర్ డౌన్ అయినట్లు ఫిర్యాదుచేసారు. ఈ అంతరాయం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులు ఒకింత గందరగోళానికి లోనయ్యారు.

# ఇద్దరు బ్రిటన్ దౌత్యవేత్తలను బహిష్కరించిన రష్యా



**మాస్కో, మార్చి 10:** రష్యా, బ్రిటన్ దేశాలమధ్య విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. గూఢచర్యం ఆరోపణలపై ఇద్దరు దౌత్యవేత్తలను తమదేశం నుంచి బహిష్కరిస్తున్నట్లు రష్యా ప్రకటించింది. రెండువారాల్లోగా తమ దేశంవీడి వెళ్లిపోవాలని పేర్కొంది. మరోపక్క అమెరికాతో సంబంధాలను బలోపేతంచేసుకోడానికి చర్చలు ప్రారంభించిన రష్యా మరోవైపు ఐరోపాతో విభేదాలు కూడా ఎదుర్కొంటున్నది. ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు మాత్రం ఈ ఇద్దరు దౌత్యవేత్తలు తప్పుడు సమాచారం ఇచ్చి రష్యాలోకి ప్రవేశించారని చెపుతున్నారు. వీరు గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. వారు రష్యా భద్రతకు ప్రమాదకరంగా పరిణమించారని ఈనక్రమంలో తమ విదేశాంగశాఖ బ్రిటన్ దౌత్యకార్యాలయానికి సమన్లు పంపించినట్లు తెలిపింది. మరోవైపు ఈపరిణామాలపై తక్షణమే స్పందించేందుకు బ్రిటన్ కార్యాలయం నిరాకరించింది. గతంలో కూడా ఈ దేశ దౌత్యవేత్తలపై మాస్కో ఇటువంటి ఆరోపణలే చేసింది. నాడు వీటిని లండన్ ఖండించింది. అమెరికాతో చర్చలు మొదలుపెట్టిన తర్వాత రష్యా బహిష్కరించిన పశ్చిమదేశాలకు చెందిన తొలి దౌత్యవేత్తలు కూడా వీరే. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం ఆరంభం కాగానే చాలా పాశ్చాత్య దేశాల్లో మాస్కో దూతలు బహిష్కరణలకు గురయ్యారు. దీనితో ఆయా దేశాల్లో రష్యా దౌత్యకార్యాలయ పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపించింది.

# గంగా జలాలు స్నానానికి అనువైనవే..

## పార్లమెంటులో సిపిసిబి నివేదిక



**న్యూఢిల్లీ, మార్చి 10:** ప్రయాగరాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద మహాకుంభమేళా గంగానది నీరు స్నానానికి యోగ్యంగా ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన నివేదికను కేంద్రం పార్లమెంట్‌లోప్రవేశపెట్టింది. 2023 నుంచి 2025వరకూ గంగానది నీటి శుభ్రతకోసం రూ.7421కోట్లుకేటాయించామని కేంద్రం ప్రకటించింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపి ఆనంద్ భదౌరియా కాంగ్రెస్ ఎంపి కె సుధాకర్‌చేసిన ప్రశ్నలకు కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ సమాధానం ఇచ్చారు. సిపిసిబి రిపోర్టు ప్రకారం పిహెచ్ వాల్యూ, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్, ఫీకల్ కోలిఫామ్ పరిమితులకు తగినట్లుగానే ఉందని తెలిపారు. అన్ని విలువల అమృతస్నానం చేసేందుకు అనుకూలంగా ఉందన్నారు. డివో, బిఒడి, ఎఫ్‌సీద్వారా నీటి నాణ్యత తెలుస్తుందనిచెప్పారు. కేంద్ర కాలుష్యనివారణబోర్డు గతనెల 3వ తేదీ ఇచ్చిన నివేదికలో ప్రయాగరాజ్‌లోని నీటి నాణ్యతపై సందేహాలు వ్యక్తంచేసింది. నీటిలో మలశాతం ఎక్కువగా ఉందని, దీనివల్ల మహాకుంభ్‌నీరు స్నానానికి అనువైనదిగా లేదని జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్‌కు సిపిసిబి చెప్పింది. అయితే ప్రయాగరాజ్ నీటి నాణ్యతపై మళ్లీ ఈనెల 28వ తేదీ కొత్త నివేదికను అందించారు. ఆ నివేదిక ప్రకారం త్రివేణి సంగమ నీరు స్నానానికి అనువుగా ఉన్నట్లు సిపిసిబి పేర్కొంది. వేరువేరు తేదీల్లో వేరువేరుప్రాంతాలనుంచి సేకరించిన శాంపిళ్లద్వారా డేటాను విశ్లేషించామని చెప్పింది. ప్రయాగరాజ్‌లోని శృంగవర్‌పుర్ ఘాట్‌నుంచి దీనాఘాట్ వరకూ వారానికి రెండుసార్లు శాంపిళ్లు సేకరించారు. త్రివేణి సంగమ ప్రాంతంనుంచి కూడా నీటిని టెస్టింగ్‌కోసం సేకరించారు. జనవరి 12నుంచి పర్యవేక్షణ చేసారు. అమృత్ స్నానాలు చేసిన రోజుల్లో నీటిని పరీక్షించారు. ప్రయా గరాజ్‌లో ఏర్పాటుచేసిన 10 సీవేజి ట్రీట్‌మెం ట్‌ప్లాంట్ల డేటాను కూడా మానిటర్ చేసారు. మహాకుంభ్‌లో వృథా నీటిని ట్రీట్ చేసేందుకు యుపి సర్కారు పది సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాం ట్లను ఏర్పాటు చేసింది. ఇక 21 డ్రైనేజీ ప్రదేశాలవద్ద నీటిని ట్రీట్ చేసింది. ఇందుకోసం ఏడు జియో ట్యూబ్‌లుఅమర్చింది. నీటిశుభ్రతకోసం అడ్వాన్స్ స్థాయి ఆక్సిడేషన్ టెక్నిక్‌లను వాడినట్లు అధికారులు తెలిపారు.

# ఎయిర్‌పోర్టుల్లో నిలిచిన విమానసర్వీసులు



**బెర్లిన్, మార్చి 10:** జర్మనీలోని విమానాశ్రయాల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికసంఘాలు ఒకరోజు సమ్మెకు పిలుపు ఇవ్వడంతో ఫ్రాంక్‌ఫర్ట్, మ్యూనిచ్ సహా ప్రధాన నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో విమానసర్వీసులన్నీ నిలిచిపోయాయి. వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. మొత్తంగా ఐదు లక్షలమంది ప్రయాణీకులపై ఈ ప్రభావం పడనున్నట్లు అంచనా. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టునుంచే 1116 విమానసర్వీసులు నడుస్తుండగా వీటిలో 1054 సర్వీసులు రద్దయ్యాయని సంస్థ ప్రకటించింది. బెర్లిన్‌నుంచి నడిచే విమానాలన్నీ రద్దయ్యాయి. హాంబర్గ్‌లోనూ అదే పరిస్థితి. విమానసర్వీసులు రద్దయినట్లు కోలోన్ ఎయిర్‌పోర్టు ప్రకటించగా సమ్మెకారణంగా విమానసర్వీసుల సంఖ్య భారీగా తగ్గినట్లు మ్యూనిచ్ విమానాశ్రయ అధికారులు ప్రయాణీకులకు తెలిపారు. మొత్తంగా 3400 విమానసర్వీసులు రద్దయ్యే అవకాశం ఉందని జర్మనీ ఎయిర్‌పోర్టు ఆపరేటర్స్ అసోసియేషన్ అంచనావేసింది. సుమారు ఐదు లక్షలమందిప్రయాణీకులపై ఈప్రభావం పడుతుందని వెల్లడించింది. తమకు వేతనాలు పెంచాలని ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తుండగా పనిప్రదేశంలో షరతులు సహా అదనపు సమయానికి ఎక్కువ మొత్తం బోనస్ ఇవ్వాలని కోరుతూ విమానాశ్రయాల్లో పనిచేసే సిబ్బంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే వారి డిమాండ్లను పరిష్కరించలేమంటూ ఆయా యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల జరిపిన చర్చలు విఫలం కావడంతో ఉద్యోగ కార్మిక సంఘాలు ఒకరోజు సమ్మెకు దిగాయి. ఈ నెల చివరిలో మరోసారి చర్చలు జరిగే అవకాశం కనిపిస్తోంది.



# నన్ను మాటలతో మానసికంగా వేధించారు

## కోర్టులో డిఆర్ఐ అధికారులపై సినీ నటి రన్యారావు

**బెంగళూరు, మార్చి 10:** డిఆర్ఐ అధికారుల కస్టడీలో ఉన్న సినీనటి రన్యారావు అధికారులు తనను మాటలతో బెదిరించారని తనను కొట్టలేదని కోర్టులో తెలిపారు. దాంతో తాను మానసికంగా ఎంతో వేదనకు లోనయినట్లు చెప్పారు. దుబాయ్‌నుంచి బంగారు బిస్కెట్లను అక్రమంగా తీసుకువస్తు నటిరన్యారావు బెంగళూరులో దొరికిపోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈకేసుకు సంబంధించి బెంగళూరు కోర్టులో విచారణ జరిగింది. కస్టడీలో ఆమెను ఏరకంగానూ వేధింపులకు గురిచేయలేదని దర్యాప్తు అధికారి తెలిపారు. మేం అడిగిన ఏ ప్రశ్నకు ఆమె సమాధానం ఇవ్వడంలేదు. మౌనంగా ఉండిపోతోంది. ఆధారాలు చూపించి ప్రశ్నించినా ఆమె బదులివ్వడంలేదు. ఆమె కోర్టుకు రాగానే ఏంమాట్లాడాలో తన న్యాయవాదులుసూచించారని, ఇక మా దర్యాప్తుప్రక్రియ మొత్తం మేం రికార్డుచేసామని తెలిపారు. రన్య వాదనలపై స్పందించిన కోర్టు మీ న్యాయవాదితో మాట్లాడేందుకు మీకు 30 నిమిషాల సమయం ఇచ్చాం. ఆవేధింపుల విషయం వారికి ఎందుకు చెప్పలేదు ఆ అంశంపై వారు పిటిషన్ ఎందుకువేయ లేదన్నారు. దర్యాప్తునకు తాను పూర్తిగా సహకరిస్తున్నానని కానీ వారు మాత్రం నన్ను పేపర్లపై సంతకంచేయమని ఒత్తిడిచేస్తున్నారని వారు నా ఇంటిని ఎందుకు మ్యాపింగ్ చేస్తున్నారని ఆ అవసరం ఏముంది. నన్ను గుర్తుతెలీనిప్రాంతానికి తీసుకెళ్లి వారు చెప్పినట్లు పాటించమంటున్నారు. ప్రామిస్‌చేసి చెపుతున్నా వారు ఇలాగే తనతో ప్రవర్తించారని చెప్పారు. మీకు ఏమైనా ఆందోళనలు ఉంటే మీ లాయర్లతో చెప్పి పిటిషన్లు వేయండి దర్యాప్తుప్రక్రియ అంతా విడియోలో రికార్డు అయింది. ఈ ఆరోపణలను డిఆర్ఐ తరపు న్యాయవాది తోసిపుచ్చారు. ఇక విచారణ అనంతరం ఆమెకు 14 రోజుల జ్యుడిషియల్‌కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది.

# పన్నులు తగ్గించాలని పదేపదే కోరవద్దు..

## సంక్షేమం అమలుకు నిధులు ఎంతో అవసరం

## కేంద్ర మంత్రి గడ్కరీ చురకలు



**న్యూఢిల్లీ, మార్చి 10:** పన్ను తగ్గింపులు కోరవద్దనికేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కార్లపరిశ్రమకు విజ్ఞప్తిచేసారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న రోడ్డురవాణా హైవేశాఖల మంత్రి గడ్కరీ మాట్లాడుతూ పేదలకోసం సంక్షేమపథకాలను అమలుచేసేందుకు ప్రభుత్వానికి నిధులు అవసరమన్నారు. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు తొమ్మిదిశాతానికి తగ్గుతుందని చెప్పారు. జీఎస్టీ ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయవద్దన్నారు. ఇది నిరంతరప్రక్రియ అని పన్నులు తగ్గిస్తే మరింత డిమాండ్ చేస్తారాన్నరు. ఇది మానవ మనస్తత్వం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నామని, కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమపథకాలను అమలు చేయలేదన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకుని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 16–16శాతంగా ఉందని రాబోయే రెండేళ్లలోపు లాజిస్టిక్స్ ఖర్చు 9 శాతానికి తగ్గుతుందని హామీ ఇచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పోటీతత్వాన్ని కలిగి ఉంటామన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా అమెరికా యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతం ఉందని నితిన్ గడ్కరీపేర్కొన్నారు. నాణ్యత పరంగా రాజీపడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మూలధన పెట్టుబడిని పెంచడం ద్వారా భారతదేశం మరిన్ని ఉద్యోగాలను సృష్టించబోతోందన్నారు. మీరంతా సంపద సృష్టికర్తలు మాత్రమే కాదు ఉద్యోగ సృష్టికర్తలు. ఈ స్వర్ణయుగాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలంటూ పిలుపునిచ్చారు. భారత్‌ను అభివృద్ధిచెందిన దేశంగా మార్చేందుకు దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరాన్ని గడ్కరీ నొక్కిచెప్పారు.



# గుల్మార్గ్ ఫ్యాషన్‌షోపై దద్దరిల్లిన జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ

**శ్రీనగర్, మార్చి 10:** జమ్ముకాశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో ఈనెల 7న జరిగిన ఫ్యాషన్‌షోపై వివాదం చెలరేగింది. ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఈకార్యక్రమం జరగడంపై విమర్శలు వచ్చాయి. సోమవారంజమ్ముకాశ్మీర్‌అసెంబ్లీని ఈ ఫ్యాషన్‌షో అంశం కుదిపేసింది. అధికార నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, స్వతంత్ర సభ్యులు ఈ అంశాన్ని సభలో లేవనెత్తారు. అశ్లీల కార్యక్రమాన్ని కండించారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసిందని ఆరోపించారు. ముస్లింప్రజలు రంజాన్ ఉపవాసాలు పాటిస్తున్నపుడు అలాంటి కార్యక్రమం ఎలా జరిగిందో దర్యాప్తుచేయాలని డిమాండ్ చేసారు. ఫ్యాషన్‌షోపై వివాదం అనవసరమైన అంశమని బిజెపి సభ్యులు వాదించారు. అన్నివర్గాలప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని కోరారు. దీనితో సభలో గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో సీఎం ఓమర్ అబ్దుల్లా సభలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించిందని తెలిపారు. గుల్మార్గ్‌లో జరిగిన ప్రైవేటు కార్యక్రమం ప్రజల మనోభావాలను దెబ్బతీసింది.

ఇలాంటి కార్య క్రమాలు ఏ సంమయంలో కూడా జరక్కూడదని ఈ ఫ్యాషన్‌షోతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, నిర్వాహకులు కూడా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఇది ఒక హోటల్‌లో నిర్వహించిన ప్రైవేట్‌షో. నిబంధనలు ఉల్లంఘించినవారిపై పోలీసులు చర్యలు తీసుకుంటాయని సభలో వివరణ ఇచ్చారు.

## వ్యాన్ లారీ ఢీ:

# ఏడుగురు మృతి, 14 మందికి గాయాలు

**భోపాల్, మార్చి 10:** రాష్ట్రంలోని సిధి జిల్లాలో సోమవారం తెల్లవారురఝామున ఈ సంఘటన చోటుచేసుకుంది. తెల్లవారుజామున 2.30 గంటలకు సిది బహ్రి హైవేపై ఉప్నీ పెట్రోల్‌పంప్ సమీపంలో మైహార్‌వైపు వెళుతున్న వ్యాన్‌ఖు సిధినుంచి బహ్రీ వేపు వెళుతున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో వాన్‌లో ఉన్న ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 14 మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిలో తొమ్మిదిమందిపరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్సకోసం రేవా ఆసుపత్రికి తంలించారు. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దాంతో ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. మిగతా క్షతగాత్రులు సిధి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలచొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.తీవ్రంగా గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున గాయపడిన వారికి రూ.50వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.


# జెలెన్‌స్కీకి కనీస కృతజ్ఞత లేదు: డొనాల్డ్ ట్రంప్




**వాషింగ్టన్, మార్చి 10:** తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకొన్నా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంట ర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా అమెరికా నుంచి సొమ్మును జెలెన్‌స్కీ తీసుకొన్నట్లు అభివర్ణించారు. 'అతను (ఉక్రెయిన్ అధ్యక్షుడు) పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత తేలిగ్గా బైడెన్ సర్కారు నుంచి సొమ్ములు తీసుకొన్నారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా ఉన్న అధ్యక్షుడిని నేను. దాని పైప్‌లైన్ ఆపి ఆంక్షలు విధించాను. జావెలిన్ క్షిపణులు అందజేశాను. కానీ, పుతిన్‌తో కూడా మంచి సంబంధాలున్నాయి. రష్యా విషయంలో నన్ను మించి కఠినంగా ఎవరూ లేరు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

మరోవైపు ఉక్రెయిన్ వీలైనంత తొందరగా యుద్ధం ముగించాలన్న ఒత్తిళ్లు డోజ్ సారథి మస్క్ వైపు నుంచి కూడా పెరిగాయి. తాజాగా తాను స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలను నిలిపేస్తే కీవ్ సేనలు కుప్పకూలుతాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో ఉక్రెయిన్ ఓటమి అనివార్యమని వ్యాఖ్యానించారు. వాస్తవికతతో ఆలోచించేవారు, అర్థం చేసుకునేవారు ఎవరైనా ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుకుంటారని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ట్రంప్ తాజా కామెంట్లు రావడం గమనార్హం.ఇటీవల ఖనిజాల ఒప్పందం కోసం అమెరికా లోని శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ అక్కడ వాగ్వాదం జరగడంతో సంతకాలు చేయకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత అమెరికా నుంచి కీవ్‌కు సైనిక, ఇంటెలిజెన్స్ సాయాలు నిలిచిపోయాయి. మరోవైపు ఇదే అదునుగా రష్యా దాడులను తీవ్రతరం చేసింది. ఇక ట్రంప్ తొలిసారి అధికారంలో ఉన్న సమయంలో రష్యా గ్యాస్ పైప్‌లైన్‌పై ఆంక్షలు విధించారు. వాస్తవానికి దీని నుంచి ఐరోపాలోని జర్మనీకి గ్యాస్ సరఫరా అవుతుంది.

# చత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుడి నివాసంలో ఇడి సోదాలు!



## మనీలాండరింగ్ కేసు..

**చత్తీస్‌గఢ్, మార్చి 10:** చత్తీస్‌గఢ్ మాజీ సిఎం భూపేశ్ భగేల్ కుమారుడు చైతన్య నివాసంలో సోమవారం ఇడి సోదాలు నిర్వహించింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ తనిఖీలు జరిగాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. మొత్తం 15 ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. వాటిలో భిలాయి ప్రాంతంలో ఉన్న చైతన్య భగేల్ నివాసం కూడా ఉంది. ఈ తనిఖీల నేపథ్యంలో భగేల్ కార్యాలయం నుంచి స్పందన వచ్చింది. 'ఏడు సంవత్సరాలు నడిచిన తప్పుడు కేసును కోర్టు కొట్టివేసింది. కానీ ఇప్పుడు ఇడి అతిథులు వచ్చి భగేల్ నివాసంలో తనిఖీలు చేశారు. అని మండిపడింది. చత్తీస్‌గఢ్ మద్యం కుంభకోణంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపణలు ఉన్నాయి. మద్యం సిండికేట్‌కు రూ.రెండువేల కోట్ల మేర లబ్ధి చేకూరిందని ఇడి గతంలో పేర్కొంది. దర్యాప్తులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు వ్యాపారవేత్తలను అరెస్టుచేసింది.

# సరైన శిక్షలే పడ్డాయి..హైకోర్టుకు వెళ్లినా ఉపయోగం ఉండదు

## ప్రణయ్ హత్య కేసులో నిందితులకు కఠిన శిక్షలు పడడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందన



**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మిర్యాలగూడలో దళిత యువకుడు ప్రణయ్ హత్య కేసులో నిందితుల్లో ఒకరికి ఉరిశిక్ష పడగా మిగతా వారికి జీవితఖైదు శిక్ష పడడం సబబేనని హైడ్రా కమిషనర్, అప్పట్లో ఈకేసును విచారించిన నల్లగొండజిల్లా ఎస్పి ఎ.వి. రంగనాథ్ తెలిపారు. నల్లగొండ జిల్లా ఎస్సి,ఎస్టి కోర్టు ఈ కేసుపై సోమవారం తీర్పు వెలువరించిన తరువాత తనను కలిసిన మీడియా ప్రతినిధులతో రంగనాథ్ హైదరాబాద్‌లో మాట్లాడారు. ప్రణయ్ హత్య జరిగిన సమయంలో తాను జిల్లా ఎస్పిగా వున్నానని, ఈ ఘటన తరువాత తమ సిబ్బంది హుటాహుటిన రంగంలో దిగి విచారణ చేబట్టారని, నిందితుల అరెస్టు కూడా త్వరగానే జరిగిందని ఆయన తెలిపారు. ఈ కేసులో 2019లో ఛార్జిషీట్ దాఖలు చేశామని, ఈ విషయంలో కొంత సమయం తీసుకున్న మాట వాస్తవమేనని, ఇందుకు తమపై విమర్శలు వచ్చాయని, కానీ కీలక కేసులో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేసేందుకు అన్ని ఆధారాలు సేకరించాల్సి వచ్చిందని ఆయన అన్నారు. మొత్తం 1600 పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశామని, ఇందులోని కొన్నింటిని పలుమార్లు అదనపు ఆధారాలు లభించడంతో మార్చాల్సి వచ్చిందని ఆ=యన అన్నారు. ఈ కేసులో సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించామని, సిసి టివిలు తమకు ఎంతో ఉపయోగపడ్డాయని రంగనాథ్ తెలిపారు. ఈ కేసులో మొద టి ముద్దాయిగా వున్న మారుతీరావు తన కుమార్తె అమృతను అమితంగా ప్రేమించాడని, ఈ కారణంగానే అతను కుమార్తె కులాంతర వివాహం చేసుకోవడాన్ని జీర్ణిం చుకోలేక పోయాడని, చివరకు ఈ కారణంగానే అతను అల్లుడిని కిరాయి హంతకులతో దారుణంగా హత్య చేయించాడని ఆయన తెలిపారు. హత్య తరువాత ఈ విషయం తనకు తెలియదని, ఇందులో తన ప్రమేయం లేదని మారుతీ రావు నాటకాలు ఆడాడని, అబద్ధాలు చెప్పాడని, అయితే పోలీసులు తమదైన శైలిలో విచారణ జర పడంతో నిజాన్ని అంగీకరించాడని రంగనాథ్ తెలిపారు. తన కూతురును అమితంగా ప్రేమించిన మారుతీరావు ఇందుకు అల్లుడిని అన్యాయంగా చంపడం సరైంది కాద ని ఆయన తెలిపారు. మారుతీరావుతో తాను స్వయంగా మాట్లాడనని, ఇదే విషయాన్ని ఆయనకు చెప్పానని ఆయన అన్నారు. నిజం ఎప్పుడూ నిజమేనని, ఎప్పుడైనా బయటకు వస్తుందని ఆయన అన్నారు. ఈ కేసులో మారుతీరావు ఆత్మహత్య చేసుకోవడంతో ఎ2గా వున్న వ్యక్తికి ఉరిశిక్ష విధించడం సరైందేనని, మిగతా నిందితులకు జీవిత ఖైదు పడడం కూడా సబబేనని ఆయన అన్నారు. దీనిపై నిందితులు హైకోర్టుకు వెళ్లినా, సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎలాంటి ప్రయోజనం వుండదని, అక్కడా ఇవే శిక్షలు ఖరారవుతాయని ఆయన అన్నారు. ఈ కేసును అప్పటి డిఎస్పి శ్రీనివాస్ తన బృందంతో పగడ్బందీగా విచారించారని, ఇందుకు వారిని అభినందిస్తున్నానని ఆ యన తెలిపారు. ఈ కేసు తమకు ఒక లెర్నింగ్ లెసన్‌గా ఆయన అభివర్ణించారు. టీనేజి సైకాలజి, కులాంతర వివాహాల్లోని సమస్యలరు అర్థం చేసుకున్నామని రంగనాథ్ తెలిపారు. విజయవాడలో జరిగిన ఆయేషా కేసును సిబిఐవిచారిస్తోందని, దీనిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని ఆయన వెల్లడించారు.



## దేశంలో తొలి సొంత ఉపగ్రహ రాష్ట్రం 'అసోం'

**గువాహతి, మార్చి 10:** రాష్ట్ర అవసరాలకోసం సొంతంగా ఉపగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు అస్సోం ప్రభుత్వం ప్రకటించింది. సరిహద్దులపై నిఘా ఉంచడంతోపాటు సామాజిక ఆర్థిక ప్రాజెక్టుల అమలుకు అవసరమైన సమాచారం సేకరించేందుకు దోహదంచేస్తుందని వెల్లడించింది. దీనితో దేశంలో సొంత ఉపగ్రహం కలిగిన తొలి రాష్ట్రంగా అస్సాం నిలిచింది. ఇన్‌స్పేస్ సహకారంతో రాష్ట్రం కోసం ప్రత్యేకంగా ఉపగ్రహాన్ని ఏర్పాటుచేసుకోవాలని చూస్తున్నామని, కీలకమైన ప్రాజెక్టుల అమలుకు సమాచారం సేకరించేందుకు ఈఉపగ్రహం ఎంతో మేలు చేస్తుందని ఆర్థికమంత్రి అజంతా నియాగ్ అన్నారు. 2025-26 ఆర్థికసంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆమెవ్యవసాయం విపత్తు, నిర్వహణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, సరిహద్దు నిర్వహణ పోలీస్ ఆపరేషన్లలో కీలకసేవలు అందిస్తుందని చెప్పారు. శాటిలైట్ విషయమై సీఎం హిమంత బిశ్వశర్మ మాట్లాడుతూ రాష్ట్రానికి సొంతంగా ఉపగ్రహం ఉంటే విదేశీయుల అక్రమ చొరబాట్లను అడ్డుకో వచ్చన్నారు. వాతావరణ నివేదిక ద్వారా రాబోయే వరదలగురించి ముందుగానే తెలుసుకోవచ్చున్నారు. ఇటీవల ఉమ్రాంగ్సోలో చోటుచేసుకున్న బొగ్గగని ప్రమాదం ప్రస్తావించిన ఆయన ఉపగ్రహ సమాచారం పొందేందుకు నెలరోజులకుపైగా వ్యవధి పట్టిందని సొంతంగా ఉపగ్రహం ఉండటంవల్ల అది మన ప్రాంతంపైనే పూర్తినిఘా ఉంచే అవకాశం ఉందని అందుకోసమే ఏర్పాటుచేస్తున్నామని, ఇస్రోతో చర్చలుప్రారంభించినట్లు ఆయన తెలిపారు. భారత్‌లో ఇస్రోతోపాటు కేవలం ఇండియన్ ఆర్మీకి మాత్రమే సొంత ఉపగ్రహాలున్నాయి.



## కాంగ్రెస్ నిరసనలో కుప్పకూలిన వేదిక

### జలఫిరంగులతో చెదరగొట్టిన పోలీసులు

**భోపాల్, మార్చి 10:** కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదికపైకి ఒక్కసారిగా నేతలందరూ పైకిచేరడంతో వేదిక కూలిపోయింది. దీనితో ఆపార్టీనేతలు, కార్యకర్తలు గాయపడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన ఈసంఘటనకు సంబంధించిన పూర్వాపరాలిలా ఉన్నాయి.బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడంతో అధికార బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ రైతు సంఘం ఆధ్వర్యంలోనిరసన చేపట్టారు. అసెంబ్లీవరకూ నిరసన ర్యాలీకి ప్లాన్‌చేసారు. కాగా భోపాల్‌లోని రంగమహల్‌చౌక్ వద్ద ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమం వేదికపైకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎక్కారు. పరిమితికిమించినసంఖ్యలో నాయకులు చేరడంతో ఆ వేదిక బరువు మోయలేక కూలిపోయింది. మధ్యప్రదేశ్ కిసాన్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మేంద్రసింగ్‌చౌహాన్, పార్టీ సీనియర్ నాయకడు గులాబ్‌సింగ్ సహా ఏడుగురు గాయపడ్డారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మరోవైపు ఈసంఘటన జరిగినప్పటికీ నిరసన ర్యాలీనికాంగ్రెస్‌కొనసాగించింది. అడ్డుగా ఉంచిన బారికేడ్లను తొలగించేందుకు కాంగ్రెస్ నేతలు కార్యకర్తలుప్రయత్నించారు. దీనితో జలపిరంగులు ప్రయోగించి నిరసనకారులను పోలీసులు చెదరగొట్టారు. కాగా నిరసనవేదిక కూలిన విడియోక్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# యేడాదిపాటు బిఆర్ఎస్ రజతోత్సవాలు

## 27న బిఆర్ఎస్ భారీ బహిరంగసభ

### లక్షల మందితో నిర్వహిస్తాం: హరీష్ రావు



సోమవారం హన్మకొండలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

**హన్మకొండ బ్యూరో,మార్చి 10.ప్రభాత వార్త:** హామీలు అమలు చేయని చరిత్ర కాంగ్రెస్ పార్టీ కి వుందని మాజీ మంత్రి హరిష్ రావు అన్నారు. సోమవారం హన్మకొండ ఓ హోటల్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 25 వ సంవత్సరంలోకి అడు గెడుతున్న సందర్భంగా రజితోత్సవ సభ ను ఘనంగా నిర్వహించేందుకు బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారని తెలిపారు. తన సలహా మేరకు సభను నిర్వహించేందుకు గతంలో 15 లక్షల మంది తో మహా గర్జన నిర్వహించిన చరిత్ర బిఆర్ఎస్‌పార్టీదని,ఉద్యమాల ఖిల్లా వరంగల్ లో అనేక భారీ బహిరంగ సభలు నిర్వహించామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏప్రిల్ 27వ తేదీన నిర్వహించే సభకు రెండు చోట్ల చోట్లా స్థలాలను పరిశీలించడం జరిగిందని అన్నారు. 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటాన్ని, పదేండ్ల పరిపాలనను నిదర్శనంగా రజోత్సవ సభను ఘనంగా నిర్వహించాలని అన్నారు. సామాజిక, చారిత్రక అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ఉద్యమం చేపట్టి ప్రత్యేక తెలంగాణ సాధించడం జరిగిందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలకు ప్రశ్నించడమే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యమన్నారు. ప్రజలంతా కేసిఆర్‌ను చూడాలని,తన మాట వినాలని కోరుకుంటున్నారని అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ రజితోత్సవ సభ జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అసెంబ్లీ అయిపోయిన తర్వాత ఎక్కువ సమయం వరంగల్ లోనే ఉండి, మీడియాతో కూడా ఇంకా డీటెయిల్స్ లో మాట్లాడుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మం త్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు,మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతి పక్ష నేత మధుసూదన్ చారి,మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య,మాజీ చీఫ్ వీప్ దాస్యం వినయ్ భాస్కర్,ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి,పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపనేని నరేందర్, శంకర్ నాయక్‌లతో పాటు రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేటర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పులి జాడ కోసం తీవ్ర అన్వేషణ..

## భయాందోళనలో జిల్లా ప్రజలు



పాదముద్రలను సేకరిస్తున్న దృశ్యం, అన్వేషిస్తున్న అటవీ అధికారులు

**ప్రభాతవార్త, జయశంకర్ భూపాలపల్లి బ్యూరో:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ మండలాలైన కాటారం, మల్హర్‌రావు, మహదేవపూర్, పలిమెల మండలాల్లో పులి సంచరిస్తునే ఉంది. కాటారం మండలంలోని నస్తూర్‌పల్లి, గుండ్రాత్‌పల్లి, వీరాపూర్, మల్హార్‌రావు మండలం కాపురం, మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం, అన్నారం, పల్గుల, మద్దులపల్లి, రాపెల్లికోట, ఏన్కపల్లి తదితర సమీప అడవుల్లో పులి సంచరిస్తుందని, పులి పాదముద్రలను సైతం సంబంధిత అటవీ శాఖ యంత్రాంగం అప్రమత్తమై సేకరిస్తుంది. దీంతో సమీప గ్రామాల ప్రజలు పులి సంచారంతో భయాందోళనకు గురవుతున్నారు. సుమారు నెల రోజుల వ్యవధి నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ పరిధిలో గల అటవీ గ్రామాల్లో పులి సంచారంకు సంబంధించిన పాదముద్రలను అటవీ అధికారులు సేకరించారు. దీంతో అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమై పులికి ఎవరూ కూడా ప్రాణహాని చేపట్టకుండా ఉండేందుకు అడవులల్లో కెమెరాలను ఏర్పాటు చేసి పులి జాడకోసం అన్వేషిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గోరికొత్తపల్లిలో పులి సంచరిస్తుందనే 'వార్త' సోషల్ మీడియాలో వీడియో ఇటీవలి చక్కర్లు కొట్టడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకొని దాని పాదముద్రలను సేకరిం చారు. దీంతో అది పులికాదని అడవి జంగపిల్లి అని తేల్చేసి చెప్పారు. అడవి జంగపల్లిని వీడి యోలో జూమ్ పెట్టి తీయడం మూలంగా పులి లాగా అనిపించిందని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఏది ఏమైనా నెల రోజుల పాటు గా జిల్లాలోని కాటారం సబ్ డివిజన్ ప్రాంతంలో పులి సంచారంతో జిల్లా ప్రజలు ఏక్షణాన ఏం జరుగుతుందోనని, అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించినా కానీ భయం గుప్పిట్లో నివసిస్తున్నారు.

# ఆన్‌లైన్‌లో విద్యుత్ ఫీడర్ల పర్యవేక్షణ

## ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం అమలు

### దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి ఫరూఖీ

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తమ సంస్థ పరిధిలో ఆన్‌లైన్‌లో విద్యుత్ ఫీడర్ల పర్యవేక్షణ నిర్వహించనున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోపాలను త్వరగా గుర్తించి సకాలంలో పరిష్కరించే ఉద్దేశ్యంతో 11 కేవీ ఫీడర్ల లో ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం సాంకేతికతను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈ టెక్నాలజీ ద్వారా ఫీడర్ లో దెబ్బతిన్న, లోపం గల ప్రాంతాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించడం జరుగుతుందన్నారు. లోపం ఎక్కడ ఉందో అనేది సులభంగా గుర్తించడానికి వీలుగా జిఐఎస్ డేటాను సంబంధిత అసిస్టెంట్ ఇంజినీర్‌కు ఎస్ఎఎస్ఎ యాప్ ద్వారా బజర్ సౌండ్ వచిచ అప్రమత్తం చేస్తుందని వివరించారు. దీని వలన విద్యుత్ మరమ్మతు బృందాలు లోపం జరిగిన ప్రాంతానికి సకాలంలో చేరుకొని విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడతాయని చెప్పారు. దీనికి తోడు, ఈ సిస్టం ద్వారా ఫీడర్ల లో విద్యుత్ సరఫరా తీరును అంటే ఏదైనా ఫీడర్ బంద్ అయితే దానికి గల కారణాలు మరియు దానిని ఎంత వ్యవధిలో పునరుద్ధరించారు అనే సమాచారాన్ని రియల్ టైంలో పర్యవేక్షణ చేయవచ్చని పేర్కొన్నారు. అలాగే యాసంగి సీజన్ పీక్ స్థాయిలో వుందని, మరింత అప్రమత్తంగా ఉండాలని సంస్థ పరిధిలోని అన్ని సర్కిళ్లు, జోన్ల అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రము లో యాసంగి సీజన్ పీక్ స్థాయిలో వున్నదని డిమాండ్ 17 వేల మెగావాట్లకు చేరువలో వుందన్నారు. డిస్కం పరిధిలో కూడా పీక్ డిమాండ్, అత్యధిక వినియోగాలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయని, ఈ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి, విద్యుత్ సరఫరా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

# తొలి అణుజలాంతర్గామిని ఆవిష్కరించిన ఉత్తరకొరియా



**ప్యాంగ్యాంగ్,మార్చి 10:** తన అణుపరీక్షలతో దక్షిణకొరియా, అమెరికాలకు సవాల్ విసురుతున్న ఉతనతరకొరియా తాజాగా రష్యా సాయంతో అభివృద్ధిచేసిన తొలి అణుజలాంతర్గామిని ఆవిష్కరించింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఆదేశ అధికారిక మీడియా శనివారమే విడుదలచేసింది. దీనిని అణు ఆధారిత వ్యూహాత్మక గైడెడ్ మిసైల్ జలాంతర్గామిగా వెల్లడించింది. ఈ జలాంతర్గామిని నిర్మిస్తున్న షిప్‌యార్డ్‌ను ఆదేశ సుప్రీంలీడర్ కిమ్‌జోంగ్ ఉన్ సందర్శించారని తెలిపింది. ఈనౌక ఆరువేలటన్నుల తరగతి లేదా ఏడు వేల టన్నుల కేటగిరీకి చెందినదిగా కనిపిస్తోందని, పది క్షిపణులను మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉందని సియోల్‌లోని హన్యాంగ్ యూనివర్సిటీ బోధకుడు దక్షిణకొరియా జలాంతర్గామి నిపుణుడు మూన్‌క్యూన్ సిక్ తెలిపారు. వ్యూహాత్మక గైడెడ్ క్షిపణులు అనే పదాన్ని ఉపయోగించారంటేనే అది అణ్వాయుధ సామర్థ్యం కలిగినదని అర్థమని ఆయన వివరిం చారు. దక్షిణకొరియా, అమెరికాలను భయ పెట్టేందుకే దీనిని నిర్మిస్తున్నారని ఆయన అన్నారు. ఈ విషయం తమ దృష్టికికూడా వచ్చిందని కాకపోతే అంతకుమించిన వివరాలు తెలియరాలేదని అమెరికా జాతీయ భద్రతా అధికారప్రతినిధి బ్రియాన్ హక్స్ వెల్లడించారు.

## ఇన్‌స్టాగ్రామ్ ట్రాప్, నలుగురు మైనర్ల మిస్సింగ్: గుంటూరులో ఆచూకీ లభ్యం

**కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త:** సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న మంచి కంటే చెడు ఎక్కువగా యువతను ప్రభావితం చేస్తుందనటానికి కరీంనగర్ లో చోటు చేసుకున్న ఓ ఘటనే అందుకు ఉదాహరణ. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నగరానికి చెందిన నలుగురు మైనర్లు గత కొంతకాలంగా స్మార్ట్ ఫోన్లలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా చాటింగ్ నిర్వహించారు. స్నేహితులైన నలుగురు బాలికలు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులకు రిక్వెస్టులు పంపి చాటింగ్స్ నిర్వహించారు. బాలికల ఫోన్ వ్యవహారంపై అనుమానం వచ్చిన తల్లి దండ్రులు స్మార్ట్ ఫోన్లను పరిశీలించగా చాటింగ్ వ్యవహారం బయటపడింది. వారిని తీవ్రంగా మందలించడంతో మనస్థాపానికి గురైన మైనర్లు ఇంట్లో నుంచి పరారయ్యారు. బాలికల తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో అప్రమత్తమైన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బాలికలు గుంటూరులో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఒక ప్రత్యేక పోలీస్ బృందం గుంటూరుకు చేరుకొని నగరానికి చెందిన మైనర్ బాలికలను అదుపులోకి తీసుకొని క్షేమంగా తీసుకు వస్తున్నట్లు సమాచారం.

## ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం ముద్రణలో అస్పష్టత: 4 మార్కులు కలపాలని ఇంటర్ బోర్డు నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి10:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ద్వితీయ ఇంటర్ ఇంగ్లీష్ ప్రశ్నాపత్రంలో ఒక ప్రశ్న అస్పష్టంగా ముద్రణ అయింది. దీంతో ఇంటర్మీడియట్‌బోర్డు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఇంగ్లీష్ ప్రశ్నపత్రంలో అస్పష్టంగా ముద్రించిన ఏడో ప్రశ్న రాసేందుకు ప్రయత్నం చేసిన విద్యార్థులకు నాలుగు మార్కులు చొప్పున ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు ఇంటర్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ సెకండియర్ ఇంగ్లీష్ పరీక్షలో ఏడో ప్రశ్నగా ఇచ్చిన చార్ట్‌లో ముద్రణ లోపం కారణంగా బాక్సులు అస్పష్టంగా కనిపించాయి. స్పష్టంగా లేనం దున జవాబు సరిగా రాయలేక పోయినట్లు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బోర్డు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. దీంతో సబ్జెక్టు నిపుణులు, ఇతరులతో చర్చించిన బోర్డు అనంతరం విద్యార్థులకు నష్టం జరగకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇంటర్ బోర్డు వెల్లడించింది.

# గిరిజన మ్యూజియంను సందర్శించిన ఐదు దేశాల ప్రతినిధులు

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన మ్యూజియాన్ని విదేశీ ప్రతినిధులు సందర్శించారు. నేపాల్, శ్రీలంక, గయానా, టాంజానియా, సురినామె దేశాలకు చెందిన మీడియా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఈ బృందంలో ఉన్నారు. హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ ఇస్తున్న శిక్షణలో భాగంగా తెలంగాణ గిరిజన సంస్కృతి జీవన విధానాలను అవగాహన చేసుకోవడానికి సోమవారం మ్యూజియంను పరిశీలించారు. ఈ మ్యూజియంలో ఉన్న ఆదిమ జాతులు, గిరిజన జాతుల ఆవాసాలు, వృత్తులు, జీవన విధానాలు, ఆర్థిక, సాంస్కృతిక, మత, సంస్కృతులను గూర్చి అక్కడి అధికారులు వివరించారు. అనంతరం వారు బంజారా మహిళలు ప్రదర్శించిన బిందెల నృత్యాన్ని వీక్షి ంచారు. ఉత్సాహంగా వారితో కలిసి విదేశీ ప్రతినిధులు బిందెల నృత్యంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సం స్థ సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల, మ్యూజి యం క్యూరేటర్ డాక్టర్ ద్యావనపల్లి సత్యనారా యణ, గిరిజన సంక్షేమ శాఖ ఈస్టూడియో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 15 నెలలలో ఎంత మందిని కోటీశ్వర్లను చేశారు?

## బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి

**హైదరాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 15 నెలలలో ఎంత మందిని కోటీశ్వరులు చేశారని బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి పదే పదే చెబుతున్నారని, 15 నెలల్లో ఎంత మందిని కోటీశ్వరులన చేశారో వెంటనే ప్రకటించాలని శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదని తెలంగాణ మహిళలు భావిస్తున్నారని విమర్శించారు. మహిళా సాధికారతకు కట్టుబడి ఉంది బిజెపి మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహిళలు అంటే ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ మాత్రమేనని అన్నారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని అన్నగా భావిస్తే కడుపుకోతే మిగులుతుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేస్తామన్న ముఖ్యమంత్రి ఒక్క మహిళనైనా పారిశ్రామిక వేత్తను చేశారా అని ప్రశ్నించారు. 600 బస్సులు ఇస్తామని చెప్పి కేవలం 20 బస్సులే ఇచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మహిళలకు రూ. 2500 కూడా నెరవేర్చలేదన్నారు. ప్రతి విషయంలో ప్రభుత్వం మహిళలను మోసం చేస్తూనే వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు పూర్తి సమాచారం అందించాలి

## ఉన్నతాధికారులతో సిఎస్ శాంతికుమారి సమీక్ష

**హైదరాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్‌రాజ్, జయేష్ రంజన్, రవి గుప్తా, ముఖ్య కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తా నియా, శైలజా రామయ్యర్, సంజయ్ కుమార్,దానకిషోర్, శ్రీధర్, ఎస్.ఎ.యం. రిజ్వీ, కార్యదర్శులు యోగితా రాణా, లోకేష్ కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, బుద్ధ ప్రకాష్ జ్యోతి, రఘునందన్ రావు, అనితా రామచంద్రన్, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# కొత్తగా రెండు లైఫ్ ఇన్స్యూరెన్స్ ప్లాన్‌లు

## ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రెసిడెంట్ ఆనంద్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** భారతదేశపు అత్యంత విశ్వసనీయ ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ దిగ్గజాల్లో ఒకటైన ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ రెండు కొత్త పిల్లల పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రెసిడెంట్ ఎం. ఆనంద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఎస్‌బీఐ లైఫ్-స్మార్ట్ ఫ్యూచర్ స్టార్, ఎస్‌బీఐ లైఫ్-స్మార్ట్ ప్లాటినా యంగ్ అచీవర్థ్ అనే ఈ రెండు కొత్త చైల్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఖచ్చితమైన ఆర్థిక రక్షణతో పిల్లల భవిష్యత్తు ఆకాంక్షలకు భద్రత కల్పించడంలో తల్లిదండ్రులకు సాధికారతనిచ్చేలా ఈ ప్లాన్లు తీర్చిదిద్దబడ్డాయన్నారు. మారుతున్న కెరియర్, పెరిగిపోతున్న విద్య వ్యయాల భారం, పెరుగుతున్న జీవన విధాన వ్యయాలు తల్లిదండ్రులకు ఆందోళనకరంగా పరిణమిస్తున్నాయని చెప్పారు. సామాజిక, ఆర్థిక సవాళ్లు ఎలా ఉన్నా తమ పిల్లలకు మెరుగైన జీవితాన్ని అందించాలన్న తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా, తమ పిల్లల కోసం సమగ్రమైన ఆర్థిక రక్షణ కవచాన్ని నిర్మించడంలో వారికి సాధికారత కల్పించేందుకు ఉపయోగపడే సాధన సంపత్తిని ఈ ఎస్‌బీఐ కొత్త లైఫ్ చైల్డ్ ప్రోడక్టులు అందిస్తాయని వెల్లడించారు.

# రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

## రూ.12 లక్షలు అందించిన ఎస్ఎస్ఏ ఎంప్లాయీస్ అసోసియేషన్

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విధి నిర్వహణలో ఉండి ప్రాణాలు కోల్పోయిన సమగ్రశిక్ష ఉద్యోగుల కుటుంబాలను అసోసియేషన్ ఆర్థికంగా ఆదుకుంది. విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మరణించిన సమగ్ర శిక్షా ఉద్యోగులు రమేష్ నాయక్, శ్రీనివాస్‌లకి ఇరువురికి ఎస్ఎస్ఏ ఎంప్లాయీస్ అసోసి యేషన్ రూ. 12,00,000 ఆర్థిక సహాయం చేసింది. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తమవంతుగా ఆదుకోవాలని భావించి.. ఆర్థికసాయం చేసినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి తెలిపారు. సమగ్ర శిక్షాలో విధులు నిర్వహిస్తున్న మెదక్ జిల్లా చెగుంట మండలంలో సిఆర్‌పిలుగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్ నాయక్, శ్రీనివాస్‌లు ఈ ఏడాది ఫిబ్రవరి 14న రోడ్డు ప్రమాదంలో కన్ను మూశారు. ఈకార్యక్రమంలో మెదక్ జిల్లా విద్యాధికారి ప్రొఫెసర్ రాధా కిషన్, జిల్లా కోఆర్డినేటర్స్ జ్యోతి, సుదర్శణ మూర్తి, చేగుంట ఎంఈవో నీరజ, తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శేషాద్రి, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, సంగారెడ్డి జిల్లా అధ్యక్షలు దత్తు, మెదక్ జిల్లా సిఆర్‌పిల అధ్యక్షులు గట్టయ్యతోపాటు పలువురు ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు. ఇక మీదట ఇటువంటి ఘటనలు జరిగితే ప్రభుత్వమే నష్టపరిహారంగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు.

# మ్యూచువల్ బదలీల ఉత్తర్వులు ఇవ్వాలి

## విద్యాశాఖ కార్యదర్శికి ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 10, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకి సంబంధించిన మ్యూచివల్ బదలీలపై వెంటనే ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మె ల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి విద్యాశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేశారు. నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన పింగిలి శ్రీపాల్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాని కలిశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి. మాజీ ఎమ్మెల్సీ బి మోహన్ రెడ్డి, నాయకులు సతీష్ రెడ్డి, చిత్తలూరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శితో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జి.ఒ. నెం. 317 ఉత్తర్వులలో భాగంగా ఇచ్చిన మ్యుచువల్ బదిలీలు ఇప్పటికే అలస్యమయ్యాయని, కాబట్టి వెంటనే మ్యుచువల్ బదిలీ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

విద్యాశాఖ కార్యదర్శి స్పందిస్తూ ఇప్పటికే సాధారణ పరిపాలనా విభాగం (జిఏడి) ఆమోదం తెలియచేసిందని మూడు నాలుగు రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేస్తామని తెలియచేశారని ఎమ్మెల్సీ తెలిపారు.

# పిఎస్‌యులు, ఎంఎస్ఎంఇల మధ్య సహకారం పెరగాలి

## పరిశ్రమల డైరెక్టర్ డా.మల్సూర్

**హైదరాబాద్, మార్చి 10 ప్రభాతవార్త:** ప్రభుత్వరంగ సంస్థలు(పిఎస్ యూలు), సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) మధ్య పరస్పర సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా. మల్సూర్ పేర్కొన్నారు. పిఎస్‌యూలు స్థానిక ఎంఎస్ఎంఇల ద్వారా అవసరమైన అవసరమైన ఉత్పత్తులు, పరికరాలను కొనుగోలు చేస్తే ఇద్దరికి ప్రయోజనం పొందగలుగుతారని ఆయన తెలిపారు. సోమవారం టూరిజం ప్లాజాలో పిఎస్‌యూలు, భారీ పరిశ్రమల కోసం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎంఎస్ ఎంఇలు, పిఎస్‌యూలు ట్రేడ్ రిసీవేబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్, ప్రభుత్వ ఇమార్కెట్ ప్లేస్ పోర్టల్స్‌లో తమ సంస్థల పేర్లు, ఉత్పత్తులు, అవసరమైన ఉపకరణాలను నమోదు చేసుకోవడంవల్ల బహిరంగ మార్కెట్లను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని డా.మల్సూర్ సూచించారు. ఎంఎస్ ఎంఇలలో పోటీతత్వం కూడా పెరుగుతుందని ఆయన అన్నారు. పిఎస్‌యూలు, భారీ పరిశ్రమలకు రవాణా ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు. రూ.250 కోట్ల టర్నోవర్ దాటిన భారీ పరిశ్రమలు తప్పనిసరిగా ఈ ప్లాట్ ఫామ్స్‌లో నమోదు కావాలని కేంద్ర ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని వెల్లడించారు. సదస్సులో బిడిఎల్, ఇసిఐఎల్, మిధాని, ఎఫ్ సిఐ, బిఎస్ ఎన్ ఎల్, సెయిల్, మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్. సఫ్రాన్ తదితర వంద పరిశ్రమలు, పిఎస్‌యూల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం1 ఎక్స్ఛేంజ్ సిఇఓ రాయ్ మేథ్యూ, ఇన్ వాయిస్ మార్ట్ నేషనల్ హెడ్ నికితా బోస్, ఆర్ఎక్స్ ఐఎల్ ప్లాట్ ఫామ్ స్టేట్ హెడ్ వేద్ ప్రకాశ్, మహమ్మద్ జియాదీ (గ్రాంట్ తోర్టన్) రవి వర్మ( జెమ్ పోర్టల్) శ్రీనివాస్ రఘు (ఎపిపిసి), శ్రీనివాసరావు (డీట్), పరిశ్రమశాఖ ఉన్నతాధికారులు కె.మధుకర్ బాబు, రాజ్ కుమార్ ఓహత్కర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# భారత్ కెప్టెన్‌గా శుభమన్ గిల్!

## వన్డే, టెస్టు సారధ్యానికి రోహిత్ గుడ్ బై

## కేవలం ఆటగాడిగానే కొనసాగింపు

## ఇక టీమిండియాలో పెను మార్పులు



శుభమన్ గిల్



బుమ్రా



రోహిత్ శర్మ



విరాట్ కోహ్లీ

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక మినీ వరల్డ్ కప్ ఛాంపియన్స్ ట్రోఫీని రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా గెలుచుకుంది. ఇక ఈ టోర్నీ తర్వాత భారత్ క్రికెట్‌లో పెను మార్పులు జరిగే అవకాశం ఉంది. టోర్నీ ముగిసిన తర్వాత వన్డే, టెస్టు జట్ల కెప్టెన్సీకి వీడ్కోలు పలికి కేవలం ఆటగాడిగానే రోహిత్ కొనసాగనున్నట్లు తెలుస్తోంది. రోహిత్ భారత్ క్రికెట్ చరిత్రలో విజయవంతమైన నాయకుల్లో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. అన్ని ఐసిసి టోర్నీల్లో జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన తొలి కెప్టెన్‌గా రోహిత్ ప్రపంచ రికార్డు సాధించాడు. మూడేళ్లలో నాలుగు ఐసిసి టోర్నీల్లో భారత్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లిన ఘనత రోహిత్ సొంతం. 2023 వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్, 2023 వన్డే ప్రపంచ కప్, 2024 టి20 ప్రపంచ కప్, ఇప్పుడు ఛాంపియన్స్ టోర్నీని కూడా కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాడు. ఇక 2027 వన్డే ప్రపంచ కప్, వచ్చే వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ సీజన్ కోసం జట్టు సన్నాహకాల్లో భాగంగా రోహిత్ కెప్టెన్సీని వదులుకోనున్నట్లు సమాచారం. భవిష్యత్తు ప్రణాళికల గురించి తెలియజేయాలని ఇప్పటికే రోహిత్‌కు చెప్పడం జరిగిందని రిటైర్‌మెంట్ పూర్తిగా అతని నిర్ణయమని బిసిసిఐ వర్గాలు చెబుతున్నాయి.

ఐతే రోహిత్ కెప్టెన్సీని కొనసాగించాలనే చర్చ కూడా జరుగుతోందని తెలిపాయి. ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత ఘోర పరాభవం తర్వాత జరిగిన సమీక్షలోనే రోహిత్ భవిష్యత్తుపై చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ విషయంలో మాత్రం మేనేజ్‌మెంట్ మార్పు వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే వరల్డ్‌కప్ నాటికి జట్టును సిద్ధం చేసుకునే విషయంపై ఇప్పటికే చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గంభీర్‌తో చర్చలు కూడా జరిగినట్లు పేర్కొన్నాయి. రోహిత్ కెప్టెన్‌గా వైదొలిగితే మాత్రం టీమ్ ఇండియా తదుపరి నాయకుడు ఎవరనేది ఆసక్తిగా మారింది.

ప్రస్తుతానికి వైస్ కెప్టెన్‌గా ఉన్న శుభమన్ గిల్‌కే నాయకత్వ పగ్గాలు దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా పోటీలో ఉన్నప్పటికీ ఫిట్‌నెస్ సమస్యలు, వయస్సు అడ్డంకిగా మారనున్నాయి.

అటు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంశం కూడా చర్చకు రాగా అతడితో కూడా యాజమాన్యం మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే, కోహ్లీ భవిష్యత్తుకు ఇప్పట్లో ఢోకా లేనట్లే అనిపిస్తోందని బిసిసిఐ వర్గాలు చెబుతున్నాయి. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన నేపథ్యంలో సెంట్రల్ కాంట్రాక్ట్‌ల విషయంలోనూ బిసిసిఐ చర్యలు తీసుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మూడు ఫార్మాట్లలో నాణ్యమైన క్రికెట్ ఆడే వారికి ఎ ప్లస్ గ్రేడ్‌ను బిసిసిఐ కేటాయిస్తుంది. ప్రస్తుతం ఎ ప్లస్ గ్రేడ్ జాబితాలో రోహిత్, విరాట్, బుమ్రా, జడేజాలు ఉన్నారు. వీరిలో ముగ్గురు ఇప్పటికే టీ20లకు గుడ్‌బై చెప్పేశారు. ఇప్పుడు వన్డేలకు కూడా వీరు రిటైర్‌మెంట్ ఇస్తే గ్రేడింగ్‌లో మార్పులు చేయడం ఖాయంగా కనిపిస్తోంది. అటు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్, అక్షర్ పటేల్‌ల గ్రేడ్లను పెంచే ఆలోచనలో బిసిసిఐ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సెంట్రల్ కాంట్రాక్టును పోగొట్టుకున్న శ్రేయస్ అయ్యర్ తిరిగి కాంట్రాక్టు పొందే అవకాశం ఉంది.



# ఆసియా ఛాంపియన్‌గా భారత్


## ఆతిథ్య ఇరాన్‌పై 32-25 తేడాతో గెలుపు

## మహిళా కబడ్డీ జట్టుకు ఐదోసారి టైటిల్

**న్యూఢిల్లీ:** ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత మహిళల కబడ్డీ జట్టు తమకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. ఇరాన్‌లో జరిగిన మహిళల ఆసియా కబడ్డీ ఆరో ఛాంపియన్‌షిప్‌లో టీమిండియా టైటిలును నిలబెట్టుకుంది. ఎనిమిదేళ్ల విరామం తర్వాత జరిగిన ఈ మెగా ఈవెంట్లో భారత జట్టు లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్లో, ఆ తర్వాత ఫైనల్లోనూ జైత్రయాత్ర కొనసాగించి ఐదోసారి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. ఈ టైటిల్ పోరులో భారత జట్టు 32-25 పాయింట్లతో తేడాతో ఆతిథ్య ఇరాన్ జట్టును ఓడించింది. అంతకు ముందు సెమీఫైనల్లో భారత్ 56-18 పాయింట్ల తేడాతో నేపాల్ జట్టుపై ఘన విజయం అందుకుంది. లీగ్ దశలో తొలి మ్యాచ్‌లో టీమిండియా 64-23 పాయింట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై, రెండో మ్యాచ్‌లో 76-21 పాయింట్లతో థాయ్‌లాండ్ జట్టుపై, మూడో మ్యాచ్‌లో 73-19 పాయింట్లతో మలేసియా జట్టుపై గెలుపొందాయి. మొత్తం ఏడు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఎ లో భారత్, బంగ్లాదేశ్, మలేసియా, థాయ్‌లాండ్ జట్లు, గ్రూప్ బిలో ఇరాన్, ఇరాక్, నేపాల్ జట్లు ఉన్నాయి. గ్రూప్ బిలోని నాలుగో జట్టు చైనీస్ తైపీ చివరి నిమిషంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. ఆసియా చాంపియన్ షిప్ నెగ్గిన భారత జట్టుకు సోనాలి విష్ణు షింగేట్ కెప్టెన్‌గా, పుష్ప రాణా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించారు. జాతీయ చాంపియన్‌షిప్‌లో ఇండియన్ రైల్వేస్ తరఫున ఆడిన సోనాలి గోల్డెన్ రెయిడ్‌తో తన జట్టును విజేతగా నిలిపింది. పూజా కజిలా, నిధి శర్మ, పూజా నర్వాల్, ఆమ్రపాలి గలాండె, నేహాదక్ష్, సంజూదేవి, జ్యోతి ఠాకూర్, సాక్షిశర్మ, భావనదేవి, రీతూ మిగతా సభ్యులుగాఉన్నారు. కాగా 2005లో హైదరాబాద్‌లో తొలిసారి ఆసియా చాంపియన్‌షిప్ నిర్వహించగా, అందులో భారత జట్టు విజేతగా అవతరించింది. అనంతరం 2007లో టెహ్రాన్ (ఇరాన్)లో జరిగిన రెండో ఆసియా చాంపియన్‌షిప్‌లో, 2008లో మదురై (భారత్)లో జరిగిన మూడో ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత మహిళాజట్టు టైటిల్ నిలబెట్టుకుంది. 2008 తర్వాత ఎనిమిదేళ్లకు మళ్లీ ఆసియా చాంపియన్‌షిప్ జరిగింది.

### ఇండియన్ వెల్స్ ఎటిపిలో..

# జోకోవిచ్‌కు చుక్కెదురు



**న్యూఢిల్లీ:** ఇండియన్ వెల్స్ ఎటిపి-1000 మాస్టర్స్ టోర్నమెంట్లో సెర్బియా టెన్నిస్‌స్టార్ నొవాక్ జొకోవిచ్‌కు చుక్కెదురైంది. 24 గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన ప్రపంచ మాజీ నంబర్ వన్ జొకోవిచ్ ఈటోర్నీలో రెండో రౌండ్లోనే ఇంటిబాట పట్టాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్లో ఆరో సీడ్ జొకోవిచ్ 2-6, 6-3, 1-6తో లక్కీ లూజర్ బొటిక్ వాన్ డి జాండ్‌షుల్ప్ (నెదర్లాండ్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు. వాస్తవానికి జాండ్‌షుల్ప్ క్వాలిఫయింగ్ దశలోనే ఓడిపోయాడు.

అయితే మెయిన్ డ్రాలో ఒక ప్లేయర్ వైదొలడగంతో క్వాలిఫయింగ్ ఓడిపోయిన మెరుగైన ర్యాంకర్ జాండ్‌షుల్ప్‌కు లక్కీ లూజర్ హోదాలో మెయిన్ డ్రాలో ఆడేఅవకాశం కల్పించారు. తొలి రౌండ్‌లో బై దక్కించుకున్న జొకోవిచ్ బరిలోకి దిగిన తొలి పోరులోనే నిష్క్రమించాడు. గతంలో ఐదుసార్లు ఈ టోర్నీలో చాంపియన్‌గా నిలిచిన జొకోవిచ్ ఈసారి అదే జోరు కనబర్చలేకపోయాడు. 37 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. తొలి సెట్లోనే జొకో 14 అనవసర తప్పిదాలకు పాల్పడడంతో తిరిగి కోలుకోలేకపోయాడు. జాండ్‌షుల్ప్ బేస్‌లైన్‌తో పాటు నెట్ గేమ్‌తో అదరగొడితే జొకో మ్యాచ్ ఆద్యాంతం తడబడ్డాడు. ఓవరాల్‌గా జాండ్‌షుల్ప్ 4 ఏస్లు సంధించగా, జొకో ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయాడు. నెదర్లాండ్స్ ప్లేయర్ 4 డబుల్ ఫాల్ట్స్ చేయగా, జొకో 3 డబుల్ ఫాల్ట్‌కు పాల్పడ్డాడు.

# టీమిండియాకు కాసుల వర్షం

## ఇతర జట్లకూ భారీ నగదు



**న్యూఢిల్లీ:** ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో, టీమిండియా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా టైటిల్ గెలుచుకుని చరిత్ర సృష్టించింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా న్యూజిలాండ్‌ను ఓడించి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2013 సంవత్సరం తర్వాత అంటే దాదాపు 12 ఏళ్లకు భారత జట్టు ఈ టోర్నమెంట్‌లో తొలిసారి టైటిల్ గెలుచుకుంది. ఈ విధంగా, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న తర్వాత టీమిండియాకు ఎన్ని కోట్లు వచ్చాయి, రన్నరప్ న్యూజిలాండ్ ఎన్ని కోట్లతో స్వదేశానికి తిరిగి వెళ్లిందనేది సర్వత్రా ఆసక్తికరమైంది. పాకిస్తాన్, దుబాయ్‌లలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఐసిసి హైబ్రిడ్ మోడల్‌తోపాటు, ప్రైజ్ మనీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక ఫైనల్ మ్యాచ్‌లో టీం ఇండియా ఛాంపియన్స్ ఆఫ్ ఛాంపియన్‌గా నిలిచింది.

ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు 2.24 మిలియన్ యూఎస్ డాలర్లు అంటే దాదాపు 20 కోట్ల రూపాయల బహుమతిని పొందింది. అదే సమయంలో, టైటిల్ మ్యాచ్‌లో ఓడిపోయిన న్యూజిలాండ్ జట్టుకు 1.12 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే దాదాపు 10 కోట్ల రూపాయల బహుమతి లభించింది. ఇక సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయిన ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి జట్లకు 5 లక్షల 60 వేల అమెరికన్ డాలర్లు అంటే దాదాపు 4.8 కోట్ల రూపాయలు లభించాయి. ఈ రెండు జట్లు ఓటమి తర్వాత ఇంటికి వెళ్లిన సంగతి తెలిసిందే. అదే సమయంలో, గ్రూప్ దశ నుంచి నిష్క్రమించిన జట్లలో, ఐదవ, ఆరవ స్థానంలో నిలిచిన జట్లకు ఒక్కొక్కరికి రూ. 3 కోట్లు, ఏడవ, ఎనిమిదవ స్థానంలో నిలిచిన జట్లకు రూ. 1 కోటి చొప్పున అందాయి.

# టాప్స్‌లో టిజి, ఎపిల నుండి 13 మంది అథ్లెట్లకు చోటు



**న్యూఢిల్లీ:** టార్గెట్ ఒలింపిక్స్ పోడియం పథకం (టాప్స్)లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలనుంచి 13మంది క్రీడాకారు లకు చోటు దక్కింది. కేంద్ర క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగే టాప్స్‌లో కోర్ బృందంలో 42 మంది, పారాకోర్ గ్రూప్‌లో 52 మంది, డెవలప్‌మెంట్ గ్రూప్‌లో 112 మందికి మొత్తంగా 206 మంది ప్లేయర్లకు చోటు లభించింది. కోర్ గ్రూప్‌లోని క్రీడాకారులకు నెలకు రూ.50 వేలు, డెవలప్‌మెంట్ గ్రూప్ అథ్లెట్లకు నెలకు రూ.25 వేలు చొప్పున ఉపకార వేతనంగా అందనుంది. కోర్ గ్రూప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి షట్లర్లు సింధు, సాత్విక్ సాయిరాజ్, పుల్లెల గాయత్రి, ఆర్చర్ ధీరజ్, బాక్సర్ నిఖత్ జరీన్, షూటర్ ఇషా సింగ్, టీటీ ప్లేయర్ శ్రీజ ఉన్నారు. డెవలప్‌మెంట్ గ్రూప్‌లో ఏపీనుంచి ఆర్చర్ జ్యోతిసురేఖ, స్ప్రింటర్ యర్రాజీజ్యోతి, పారా అథ్లెట్ రొంగలి రవి, తెలంగాణ తరఫున అథ్లెట్ నందిని, పారా అథ్లెట్ జీవాంజి దీప్తి, షూటర్ కెనాన్ చినాయ్‌లకు చోటు దక్కింది.

# ఆరంభ లాభాలు ఆవిరి

**ముంబై, మార్చి 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో కదలాడిన సూచీలు మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా ఫ్యూచర్స్ నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో ఇన్వెస్టర్లు ఆఖర్లో అమ్మకాలకు దిగారు. దీంతో ఇంట్రాడే గరిష్టాల నుంచి సెన్సెక్స్ 700 పాయింట్ల మేర పతనం కాగా, నిఫ్టీ 22,500 దిగువకు చేరింది. ఇన్ఫోసిస్, హిందుస్థాన్ యూనిలీవర్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు సూచీలకు దన్నుగా నిలవగా, ఎల్అండ్‌టి, రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీలను దిగువకు లాగాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. చివరికి సెన్సెక్స్ 217.41 పాయింట్లు నష్టపోయి 74,115.17 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 77.55 పాయింట్లు నష్టపోయి 22,474.95 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ 38 పైసలు క్షీణించి రూ.87.33గా నిలిచింది. ఇండస్ ఇండ్ బ్యాంకు, జొమాటో,




ఎల్అండ్‌టి, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, హిందుస్థాన్ యూనిలీవర్, ఇన్ఫోసిస్, నెస్లే ఇండియా, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 70.51 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 2914 డాలర్ల వద్ద కొనసాగింది.


# 'ప్రమోద్ మిట్టల్' దివాలా

**ముంబై, మార్చి 10:** ఒకప్పుడు ఉక్కు పరిశ్రమలో ప్రముఖ వ్యక్తిగా ప్రమోద్ మిట్టల్‌కు గొప్ప పేరుండేది. విలాసవంతమైన జీవనశైలికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండే మిట్టల్, సుమారు రూ.24వేల కోట్ల అప్పు తీర్చలేక దివాలా తీశారు. ఒకప్పుడు తన కూతురి పెళ్లికి ఏకంగా రూ.550 కోట్లు ఖర్చు చేసి వార్తల్లో నిలిచిన ఆ వ్యక్తి ఎందుకు ఇంతలా దిగజారిపోయారు. అందుకు గల కారణాలను తెలుసుకుందాం. భారతీయ ఉక్కు దిగ్గజం, ప్రపంచంలోని అతిపెద్ద ఉక్కు మైనింగ్ కంపెనీ ఆర్సెలర్ మిట్టల్ చైర్మన్, దేశంలోని స్టీల్ పరిశ్రమలో ఎన్నో విజయాలు సాధించి 'స్టీల్ మాగ్నెట్'గా పేరు తెచ్చుకున్న లక్ష్మీ మిట్టల్ సోదరుడే ఈ ప్రమోద్ మిట్టల్. మైనింగ్,



మెటల్స్ రంగంలో లక్ష్మీ మిట్టల్ అత్యంత సంపన్నుల్లో ఒకరిగా కొనసాగుతుండగా, ప్రమోద్ అదృష్టం మరో మలుపు తిరిగింది. బిలియనీర్‌గా ఇస్పాత్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ చైర్మన్‌గా ప్రమోద్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని కొనసాగించారు. 2013లో తన కుమార్తె సృష్టి మిట్టల్ పెళ్లి కోసం రూ.550 కోట్లు వెచ్చించి వార్తల్లో నిలిచారు. స్పెయిన్‌లోని బార్సిలోనాలో జరిగిన ఈ వివాహ కార్యక్రమంలో రుచికరమైన వంటకాలు, విస్తారమైన అలంకరణలు, హైప్రొఫైల్ అతిథులు పాల్గొన్నారు. బోస్నియా కోక్ ఉత్పత్తిదారు గ్లోబల్ ఇస్పాత్ కోక్స్నా ఇండస్ట్రీస్ లుకావాక్‌చేసిన అప్పులకు హామీదారుగా ప్రమోద్ మిట్టల్ పాత్ర ఉందని అధికారులు తెలిపారు. ఇది దాని ఆర్థిక బాధ్యతలను తీర్చడంలో విఫలమైంది. దాంతో ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా ఉన్న ప్రమోద్ ఆర్థిక సామ్రాజ్యం కుప్పకూలింది. మోసం ఆరోపణలపై 2019లో బోస్నియాలో తనను అరెస్టు చేశారు. రూ.24వేల కోట్లకుపైగా అప్పులతో ప్రమోద్ దివాలా తీసినట్లు 2020లో లండన్ కోర్టు ప్రకటించింది. తుజ్లాలోని కంటోనల్ కోర్టు జిఐకెఐఎల్ నష్టపరిహారంగా దాదాపు 11 మిలియన్ యూరోలను డిపాజిట్ చేయాలని ప్రమోద్‌ను ఆదేశించింది. దాంతో అతని ఆర్థిక కష్టాలు మరింత పెరిగాయి.

# ఎస్‌ఎంఇ ఐపిఒ నిబంధనలు కఠినతరం..




**న్యూఢిల్లీ, మార్చి 10:** స్టాక్ మార్కెట్లో నిధుల సమీకరణ కోసం క్యూ కడుతున్న స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎస్ఎంఇ) ఐపిఒలకు చెక్‌పెట్టేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి నడుం బిగించింది. పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు కొన్ని నిబంధనలను నిర్దేశించింది. లాభదాయకత, 20 శాతానికి మించని ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) వంటి పరిమితులను పెట్టింది. రిటైల్ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను కాపాడే ఉద్దేశంతో సెబి ఈ నిబంధనలను తీసుకొచ్చింది. ఇటీవల కాలంలో ఎస్ఎంఇ ఐపిఒల్లో పెట్టుబడులకు ఇన్వెస్టర్లు ఉత్సుకత చూపిస్తున్న వేళ సెబి ఈ నిబంధనలను కట్టుదిట్టం చేస్తూ తాజాగా ఓ నోటిఫికేషన్ విడుదలచేసింది. ఎస్ఎంఇ విభాగంలో ఏదైనా కంపెనీ ఐపిఒకు రావాలంటే గడిచిన మూడేళ్లలో కనీసం రెండేళ్లపాటు రూ.కోటి నిర్వహణ లాభాలను సాధించి ఉండాలి. ఈ ఐపిఒల్లో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా షేర్ హోల్డర్లు 20శాతానికి మించి వాటాను విక్రయించడానికి వీల్లేదు. ప్రస్తుత వాటాదారులెవరూ 50శాతానికి మించి వాటాను విక్రయించడానికి అవకాశంలేదు. కనీస వాటా పరిమితికి మించి అదనంగా ఉన్న షేర్ హోల్డింగ్‌కు లాక్-ఇన్ వ్యవధి ఉంటుంది. యేడాది తర్వాత అదనంగా ఉన్న వాటా, రెండేళ్ల తర్వాత మిగిలిన 50శాతం వాటా వదులుకోవడానికి వీలవుతుంది. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు షేర్ల అలకేషన్‌కు సంబంధించి మెయిన్ బోర్డు ఐపిఒ నిబంధనలే ఎస్ఎంఇ ఐపిఒలకూ వర్తిస్తాయి. ఎస్ఎంఇ ఐపిఒల సబ్‌స్క్రిప్షన్‌కు కనీసం రెండు లాట్లు కొనుగోలుచేయాల్సి ఉంటుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల ను సాధారణ కార్పొరేట్ అవసరాలు పేరు చెప్పి ఎడాపెడా వినియోగించుకోవడానికి లేదు. మొత్తం నిధుల్లో 15శాతం లేదా రూ.10కోట్లు మాత్రమే గరిష్టంగా వినియోగించుకోవడానికి వీలుంది. ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్స్, సంబంధిత పార్టీలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకున్న రుణాలకు ఐపిఒ ద్వారా సమీకరించిన నిధులను వినియోగించడానికివీల్లేదు. ఎస్ఎంఇ ఐపిఒలకు సంబంధించి ముసాయిదా పత్రాలను 21 రోజుల పాటు అందుబాటులో ఉంచాలి. పత్రికల్లో ప్రచురించాలి. డిహెచ్ఆర్‌పిని సులువుగా యాక్సెస్ చేసేందుకు వీలుగా క్యూఆర్ కోడ్‌ను ముద్రించాలి.

# మొబిక్విక్ సిస్టమ్స్ షేర్లు డీలా

**ముంబై, మార్చి 10:** గత ఏడాది ఐపీవోగా స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టిన మొబిక్విక్‌సిస్టమ్స్ లిమిటెడ్ షేర్లు ప్రస్తుతం కొనసాగుతున్న మార్కెట్ అస్థిరతల్లో తమ ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి జారుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ స్టాక్ ధర ఒక్కోటి రూ.285 వద్ద ఉండగా ఐపీవో తర్వాతి కాలంలో గరిష్ఠంగా రూ.698.30కి చేరుకున్న సంగతి తెలిసిందే. ఒక్కసారి కంపెనీ షేర్ల లిస్టింగ్ రోజుకు వెళితే స్టాక్ ఒక్కోటి తొలిరోజున రూ.442 వద్ద అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. కానీ కొనసాగుతున్న మార్కెట్ కరెక్షన్ సమయంలో మొబిక్విక్ స్టాక్ బేర్స్ చేతిలో నలిగి పోతూ దాని లిస్టింగ్ ధర నుంచి దాదాపు 35 శాతం తక్కువ రేటు వద్ద మార్కెట్లో ట్రేడింగ్ చేస్తోంది. అలాగే స్టాక్ వారం రోజుల కిందట ఒక్కోటి తన జీవితకాల కనిష్ఠమైన రూ.261.30కి చేరుకున్న తర్వాత స్వల్ప రికవరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత మార్కెట్లను పరిశీలిస్తే.. ఈ పతనం ఇంకెన్ని రోజులు ఉంటుందో అనే ఆందోళనలు ఇన్వెస్టర్లలో కొనసాగుతోంది. రోజువారీ చార్టులో రూ.261 వద్ద స్టాక్ టెక్నికల్‌గా బలమైన మద్దతుతో కొంత బుల్లిష్‌గా కదులుతోందన్నారు. దీని ప్రకారం స్టాక్ ధర సమీప భవిష్యత్తులో రూ.334 స్థాయికి చేరుకోవచ్చని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. వాస్తవానికి మొబిక్విక్ ఐపీవో ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.265-279గా ఉన్న సంగతి తెలిసిందే.

# ఎపి ఒప్పందంతో టాటా పవర్ దూకుడు

**ముంబై, మార్చి 10:** టాటా గ్రూప్ అనుబంధ సంస్థ టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ తాజాగా ఏపీ ప్రభుత్వంతో కీలక పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దీనికింద రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులలో సహకరించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఎంవోయూపై సంతకం చేసిందని వెల్లడించటంతో సోమవారం మార్కెట్లో టాటాపవర్ కంపెనీ లిమిటెడ్ షేర్లు 3శాతం మేర లాభపడ్డాయి. ఇంట్రాడేలో కంపెనీ షేర్లు ఒక్కోటి బీఎస్ఈలో 3శాతం పెరుగుదలను నమోదు చేయటంతో స్టాక్ ధర ఒక్కోటి రూ.362.85 స్థాయికి చేరుకుంది. అలాగే కంపెనీ మార్కెట్ విలువ రూ.1.14 లక్షల కోట్లకు చేరుకుంది. చార్టులలో ఈ స్టాక్ ఓవర్‌సోల్డ్ లేదా ఓవర్‌బాట్ చూపలేదు. గడచిన ఐదేళ్ల కాలంలో టాటా పవర్ స్టాక్ 807శాతం వృద్ధితో మల్టీబ్యాగర్ రాబడులను అందించింది. అలాగే గడచిన రెండేళ్లలో స్టాక్ ధర 72శాతం పెరగగా, ఆరు నెలల కాలంలో మార్కెట్ల కరెక్షన్ కారణంగా 19 శాతం క్షీణతను నమోదు చేసింది. ఏపీ ప్రభుత్వంతో కుదుర్చుకున్న తాజా అగ్రిమెంట్ పరిశీలిస్తే, టాటా గ్రూప్ సంస్థ ఏపీప్రభుత్వంతో కలిసి సంయుక్తంగా ఎనర్జీ స్టోరేజ్ పరిష్కారాలతో లేదా లేకుండా సౌర, పవన, హైబ్రిడ్ ప్రాజెక్టులతో సహా 7 గిగావాట్ల వరకు పునరుత్పాదక ఇంధన అభివృద్ధి అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించాయి. ఈ మెగా ప్రాజెక్టులో టాటా గ్రూప్ రూ.49 వేల కోట్లను పెట్టుబడిగా పెట్టాలని యోచిస్తోంది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీనర్ ఎనర్జీ పాలసీ ప్రవేశపెట్టిన నేపథ్యంలో రాష్ట్రం 160 గిగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పాలసీ ద్వారా మెత్తం రూ.10లక్షల కోట్లు పెట్టుబడులతో పాటు దాదాపు 7.5 లక్షల ఉద్యోగాలు సృష్టి ద్వారా రాష్ట్రానికి మేలు జరగనుంది. తాజా ఒప్పందం ప్రకారం టాటాలకు అవసరమైన పునరుత్పత్తి విద్యుత్ ప్రాజెక్టుల స్థలాల గుర్తింపు, ఫీజిబిలిటీ అధ్యయనాలు అభివృద్ధి పనులను చేపట్టనున్నది. ఈ ప్రాజెక్టుల అభివృద్ధి క్రమంలో న్యూ అండ్ రీన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవసరమైన సహాయాన్ని అందించనుంది. ఇది స్థలాల గుర్తింపు, సైట్ సదుపాయాల ఏర్పాటు, విద్యుత్ అవకాసం నిర్మాణం వంటి సహాయ చర్యలకు బాధ్యత వహిస్తుంది. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేకూర్చడంతో పాటు, స్థానిక సామర్థ్యాభివృద్ధి, నైపుణ్యాల పెంపు, జీవనాధారాలను మెరుగుపరచడానికి సహాయపడతాయి. ఇంత పెద్ద స్థాయి పునరుత్పత్తి విద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి, భారతదేశంలోని పర్యావరణ నిబంధనలకి అనుగుణంగా సుస్థిరమైన, గ్రీన్ ఎనర్జీ వనరుల వినియోగాన్ని పెంచడం కోసం కీలకమైంది.




# వాణిజ్యం

## సుజ్లాన్ ఎనర్జీ ర్యాలీ

**ముంబై, మార్చి 10:** సుజ్లాన్ ఎనర్జీ పెట్టుబడిదారులకు ప్రస్తుతం మార్కెట్లో పెద్ద శుభవార్త వచ్చింది. వరుసగా 6వ రోజు కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో సుజ్లాన్ ఎనర్జీ కంపెనీ షేర్లు లాభపడ్డాయి. ఈ క్రమంలో సోమవారం ఎన్ఎస్ఈలో స్టాక్ ధర ఒక్కోటి రూ.55.11 వద్ద ప్రారంభమై.. ఇంట్రాడేలో గరిష్ఠంగా రూ.56.69 రేటుకు చేరుకుంది. దీంతో గడచిన 6 ట్రేడింగ్ సెషన్లలో కంపెనీ షేర్లు 14 శాతం మేర లాభాన్ని నమోదు చేశాయి. నిపుణుల అంచనాప్రకారం టెక్నికల్‌గా కంపెనీ షేర్లు 52 రేటు వద్ద బలమైన మద్దతును కలిగి ఉన్నట్లు వెల్లడైంది. అలాగే 5860 స్థాయి వద్ద నిరోధాన్ని కలిగి ఉన్నట్లు పేర్కొన్నారు. టెక్నికల్ నిరోధాన్ని అధిగమిస్తే రెన్యూవబుల్ ఎనర్జీ కంపెనీ షేర్లు ఒక్కోటి రూ.70మార్కును చేరుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే సపోర్ట్ జోన్ దిగువకు చేరుకుంటే స్టాక్ క్రాష్ కావొచ్చని వారు చెబుతున్నారు. బ్రోకరేజ్ సంస్థ ఇన్వెస్టెక్ రూ.70 స్టాక్ ధరతో స్టాక్‌పై కవరేజ్ ప్రారంభించిన తర్వాత సుజ్లాన్ షేర్లు ర్యాలీ చేయడం ప్రారంభించాయి. విండ్ ఎనర్జీ రంగంలో పునరుజ్జీవనం వల్ల సుజ్లాన్ ఎనర్జీ ప్రయోజనం పొందే అవకాశంఉందని ఇన్వెస్టెక్ విశ్లేషకులు విశ్వసిస్తున్నారు. కంపెనీ ఆర్డర్ బుక్ 5.5 బిజూకి చేరుకుంది మరియు దాని సరఫరా గొలుసు కూడా బాగా ఆప్టిమైజ్ చేయబడింది. సుజ్లాన్ కంపెనీ షేర్లు లాభపడటానికి అసలు కారణం కంపెనీ మూడోసారి జిందాల్ గ్రీన్ విండ్ సంస్థ నుంచి 204.75 మెగా వాట్లకు ఆర్డర్ పొందటమే. వాస్తవానికి ఈ సంస్థ జిందాల్ రెన్యూవబుల్స్‌కి అనుబంధ సంస్థ కావటం గమనార్హం. ఈ భాగస్వామ్యం ఇప్పుడు సుజ్లాన్ అతిపెద్ద వాణిజ్య అండ్ పారిశ్రామిక ఆర్డర్. దీంతో మెత్తం ఆర్డర్ 907.20 మెగావాట్లకు చేరుకుంది. ఇప్పటికే జిందాల్ కంపెనీ ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో కలిగి ఉన్న జిందాల్ స్టీల్ ప్లాంట్లకు అవసరమైన విద్యుత్ తయారీ కోసం రెండు ఆర్డర్లను సుజ్లాన్ దక్కించుకుంది. ప్రస్తుతం సుజ్లాన్ ఆర్డర్ బుక్ గమనిస్తే పెద్ద వాణిజ్యఅండ్ పారిశ్రామిక కస్టమర్లవాటా 59శాతంగా ఉండటం గమనార్హం. ఇది కంపెనీ చరిత్రలో అత్యధికంగా కంపెనీ ఒక ప్రకటనలోవెల్లడించింది. ప్రస్తుతం జిందాల్ కొత్త ఆర్డర్ పరిశీలిస్తే.. సుజ్లాన్ 65 అత్యాధునిక ఎస్144విండ్ టర్బైన్ జనరేటర్లను హైబ్రిడ్ లాటిస్ టవర్స్‌తో సరఫరా చేయనున్నట్లు వెల్లడైంది. ఇవి ఒక్కొక్కటి 3.15 ఎండబ్ల్యూ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటాయి. ఉత్పత్తి చేయబడిన శక్తిని ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని ఉక్కు కర్మాగారాల్లో క్యాప్టివ్ వినియోగం కోసం ఉపయోగిస్తారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.